www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 12
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 271
గురువారం 16-1-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: తదియ తె. 4.06 తదుపరి చవితి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 11.17 తదుపరి మఖ; వర్జ్యం: రా.12.01-1.42; దుర్ముహూర్తం: ఉ.11.34-11.18, మ.3.00-4.44; అమృతఘడియలు: ఉ.9.37-11.17; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.57
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



గోల్డ్‌మ్యాన్‌కు థార్ జీపు

11

విజయవాడలోని రామవరప్పాడు బరిలో పోటాపోటీగా తలపడుతున్న కోళ్లు



కోట్లలో కూత

మూడు రోజులు... పందల బరులు.... సుమారు రూ.రెండు వేల కోట్ల పందేలు! ఇందులో భోగి రోజు రూ.350 కోట్లు. సంక్రాంతి పండగ సందడిని డబుల్ చేస్తూ రెండోరోజు దాదాపు రూ. 600 కోట్లు... ఇక.. కనుమ రోజు ఏకంగా వెయ్యి కోట్లు....! ఇటు కోనసీమ నుంచి అటు రాయలసీమ వరకు సంక్రాంతి కోడి జైత్రయాత్ర ఇలా అప్రతిహతంగా సాగింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్క పందెమే రికార్డుస్థాయిలో రూ. 1.25 కోట్లు పలికింది.

3 రోజుల్లో రూ. 2 వేల కోట్ల పందేలు!

కోడి కూత కోటి దాటింది! ఏలూరుకు చెందిన రసంగి, గుడివాడకు చెందిన నెమలి..రెండూ తలపడ్డాయి. నువ్వా నేనా అన్నట్టు తొలి రెండు రౌండ్లలో దీటుగా నిలబడ్డాయి. మూడో రౌండ్‌లో రసంగిని నెమలి గాయపర్చింది. గాయం లోతుగా కావడంతో అది కుప్పకూలింది. నెమలి విజేత ప్రభాకర్ రూ. 1.25 కోట్ల పందెం దక్కించుకున్నాడు. అయితే, ఓడిన రసంగి పందెం రాయుడు రత్తయ్య ఆ వెంటనే తేరుకుని రూ.రెండు కోట్ల పందేనికి సై అన్నాడు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పైబోయిన వెంకటరామయ్యతోటలో జరిగింది ఈ పందెం!





తాడేపల్లిగూడెంలో కోటీ పాతిక లక్షల పందెంలో విజేత ఈ కోడి.. ఆ పందెం గెలిచిన ఆనందంలో ప్రభాకర్ టీం

- ఒక్క కనుమనాడే వెయ్యి కోట్లు దాటిన పందెం
- కోనసీమ నుంచి రాయలసీమ దాకా ఒకే జోరు
- పెద్ద బరుల్లో సందడి చేసిన సంక్రాంతి కోడి
- రూ. కోట్లలో పందేలు.. భారీగా ఆఫర్లు
- విజేతలకు థార్ జీపు, యాక్టివాలు, బుల్లెట్లు
- 'పశ్చిమ'లో ఒక్క పందేనికే రూ.1.25 కోట్లు
- గోదావరి జిల్లాల్లో జబర్దస్త్ బృందాల హడావుడి



(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పండగ పందేలు జాతరను తలపించాయి. ఎక్కడికక్కడ షామియానాలు, కుర్చీలు, ఎల్ ఈడీ స్ర్కీన్లలో ప్రత్యక్ష ప్రసారాలు, వీటికి కామెంట్రీలు ఏర్పాటు చేసి స్టేడియం తరహాలో బరులను నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, కోనసీమలను కలుపుకొని పందేలు రూ.500కోట్లు దాటేశాయి. బరుల్లో కోడిపందేలతో సమానంగా గుండాట భారీగా జరిగింది. ఎక్కడా పోలీసుల జాడ లేకపోవడంతో పందెంరాయుళ్లు, గుండాట వ్యాపారులు చెలరేగిపోయారు. అడ్డూఅదుపు లేకుండా రేయింబవళ్లు రెచ్చిపోయారు. మొత్తం పందేల్లో సగానికిపైగా గుండాటదే కావడం విశేషం. ప్రధానంగా కాకినాడ జిల్లాలో మూడురోజుల్లో రూ.250కోట్లకుపైగా పందేలు

మిగతా 11వ పేజీలో...

ఆర్టీసీ కిటకిట

- తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సులూ ఫుల్లే
- ఐదు రోజులు.. 500 స్పెషల్స్



నారావారిపల్లెలో కుటుంబ సభ్యులతో కలిసి ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

ప్రతి ఇల్లు, గ్రామం ఆనందంగా ఉండాలి

అందుకోసమే స్వర్ణాంధ్ర విజన్-2047: సీఎం చంద్రబాబు

12

స్కిల్ కేసులో బాబుకు ఊరట

- బెయిల్ రద్దు కోరుతూ నాటి వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్ కొట్టివేత
- ఇంటర్‌లొక్యూటరీ దరఖాస్తు వేసిన జర్నలిస్టుపై న్యాయమూర్తి ఆగ్రహం
- ఈ కేసుతో మీకేం సంబంధమని నిలదీత
- మరోసారి ఇలా చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక
- ఆ దరఖాస్తునూ డిస్మిస్ చేసిన కోర్టు



న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ.. గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇప్పటికే చార్జిషీటు దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవలసిన అవసరం లేదని జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేతో కూడిన ధర్మాసనం బుధవారం

మిగతా 12వ పేజీలో...

బీజేపీ, ఆరెస్సెస్‌తోనే కాదు.. భారత రాజ్య వ్యవస్థతోనూ

పోరాడుతున్నాం

దేశ వ్యవస్థలన్నీ కమలం, సంఘ్ స్వాధీనమయ్యాయి

- పార్టీ కార్యకర్తలతో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ
- రామమందిర ప్రతిష్ఠాపననాడే నిజమైన స్వాతంత్ర్యం అన్న మోహన్‌భాగవత్ వ్యాఖ్యలపైనా తీవ్ర ఆగ్రహం
- ఆ వ్యాఖ్యలు దేశద్రోహంతో సమానమని మండిపాటు
- రాహుల్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ వికృత వాస్తవ రూపం బయటపడింది: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

న్యూఢిల్లీ, జనవరి 15: కాంగ్రెస్ పార్టీ.. ఆరెస్సెస్, బీజేపీతోనే కాక.. భారత రాజ్యవ్యవస్థతో కూడా పోరాడుతోందని ఆ పార్టీ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఏఐసీసీ నూతన ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మనం బీజేపీ, ఆరెస్సెస్ అనే రాజకీయ సంస్థలతో పోరాడుతున్నామని మీరు భావిస్తుంటే.. అసలేం జరుగుతోందో మీకు అర్థం కానట్టే. ఆ రెండూ మనదేశంలోని

మిగతా 2వ పేజీలో...





ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కొత్త కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సోనియా, ఖర్గే. చిత్రంలో రాహుల్, ఇతర సీనియర్ నేతలు

మోహన్ భాగవత్.. దేశంలో తిరగలేరు జాగ్రత్త!

- 'నిజమైన స్వాతంత్ర్యం' వ్యాఖ్యలపై సంఘ్ చీఫ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే హెచ్చరిక
- 1947లో స్వాతంత్ర్యం వచ్చిందని మీరు గుర్తించకపోవడం సిగ్గుచేటు
- అంబేడ్కర్ అన్నట్టుగా చరిత్రను విస్మరించేవాళ్లు చరిత్ర సృష్టించలేరు: ఖర్గే
- కాంగ్రెస్ పార్టీ కొత్త కేంద్రకార్యాలయం ప్రారంభం.. ఇందిరాభవన్‌గా పేరు



యడవల్లి లక్ష్మణరావు



హరిహరనాథ శర్మ

హైకోర్టుకు మరో ఇద్దరు న్యాయమూర్తులు

12

- యడవల్లి లక్ష్మణరావు, హరిహరనాథ శర్మ పేర్లు సిఫారసు చేసిన సుప్రీం కొలీజియం
- తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీలు

డ్రోన్ విధ్వంసక సూక్ష్మ క్షిపణి భార్గవాస్త్రం

మైక్రో మిస్సైల్ సిస్టమ్ పరీక్ష విజయవంతం

అగ్రశ్రేణి నౌకాశక్తిగా భారత్

- నౌకాదళానికి ఇది చిరస్మరణీయమైన రోజు
- 3 శక్తివంతమైన అస్త్రాలు ఒకేసారి చేరాయి
- విశ్వ భాగస్వామిగా మన నేవీ ఎదగాలి: మోదీ
- 2 యుద్ధనౌకలు, సబ్‌మెరైన్ జాతికి అంకితం

2



12

టీడీపీ @1,00,20,065

- సంక్రాంతి వేళ పార్టీ సభ్యత్వాల రికార్డు బద్దలు
- పార్టీ ఆవిర్భావం తర్వాత కోటి మార్కుకు తొలిసారి
- టాప్‌లో నెల్లూరు నగరం.. ఐదో స్థానంలో కుప్పం
- 2, 3 స్థానాల్లో ఆనం, నిమ్మల నియోజకవర్గాలు
- తెలంగాణలో 15 లక్షల వరకూ సభ్యత్వాల నమోదు

పనిచేసిన వారికే పదవులు

- నెలాఖరుకు నామినేటెడ్ పోస్టుల భర్తీ
- రెడ్ బుక్ తన పని చేసుకుపోతోంది: మంత్రి లోకేశ్
- ఇసుక, లిక్కర్ కుంభకోణాల్లో త్వరలో కొందరు జైలుకు



మోహన్‌బాబు వర్సిటీ వద్ద ఉద్రిక్తత

12

- క్యాంపస్‌లోకెళ్లేందుకు మనోజ్ దంపతుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది
- మనోజ్ వాహనంపై కర్రతో యువకుడి దాడి
- విష్ణు అనుచరులపై పరోక్షంగా మనోజ్ ఫైర్
- తాత, నానమ్మ సమాధులకు నివాళులర్పించి వెనక్కి
- కోర్టు ధిక్కరణకు పాల్పడిన మనోజ్‌పై ఫిర్యాదు చేస్తాం
- ఎంబీయూ మీడియా ఇన్‌చార్జ్ ప్రకటన

ప్రాజెక్టులవారీ కేటాయింపులు ఉండాల్సిందే!

- మా వాటా 512 టీఎంసీలు కొనసాగించాలి
- రెండు కేసులూ విడివిడిగా వినాల్సిందే
- 2023లో కేంద్రం ఇచ్చిన ఆర్డినెన్సు చెల్లదు
- ఆ ఎత్తిపోతలను అక్రమ ప్రాజెక్టులుగా ప్రకటించాలి
- కృష్ణా ట్రైబ్యునల్ ముందు నేడు ఏపీ వాదనలు

2

అయ్యో..రు!

ఎన్నో తగ్గని ఉద్యోగం ఏదైనా ఉందంటే అది సర్కారు టీచర్ కొలువే! గౌరవప్రదమైన ఉద్యోగం, మంచి జీతమే కాదు.. సెలవులకు సెలవులు.. వృత్తిపరమైన సంతృప్తి..! అందుకే ఎక్కువమంది టీచర్ విద్యపై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే, ప్రభుత్వాలు ఎప్పుడైనా డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల చేసినా.. బీఈడీ, డీఈడీ చేసినవారితో పోల్చి చూస్తే పోస్టుల సంఖ్య రెండు మూడు శాతానికి మించి ఉండడంలేదు. పోనీ ప్రైవేటు పాఠశాలల్లో చేరదామంటే అక్కడ సరైన జీతం ఇవ్వరు. దీంతో బీఈడీ, డీఈడీలు చేసినా లక్షల మంది ఖాళీగా మిగిలిపోయే పరిస్థితి. కొందరు ఈ వృత్తిని వదిలేసి ఇతరత్రా ప్రైవేటు ఉద్యోగాల వైపు వెళ్లిపోతున్నారు. ఇంత మంది నిరుద్యోగులుగా ఉన్నా.. ప్రతి సంవత్సరం వేల మంది మళ్లీ టీచర్ విద్యలో చేరుతుండడం గమనార్హం!



ఎందుకీ టీచర్ చదువు?

- లక్షల్లో బీఈడీ, డీఈడీ నిరుద్యోగులు
- ఈ ఏడాది టెట్‌కు 4.27లక్షల మంది దరఖాస్తు
- మొత్తంగా 7లక్షలకు పైగా ఉంటారని అంచనా
- డీఎస్సీలు వేసినా 2, 3 శాతం మందికే ఉద్యోగాలు
- ప్రైవేటు స్కూళ్లలో చేరితే చాలీచాలని జీతాలు
- ఎందుకూ అక్కరకు రాని ఉపాధ్యాయ విద్య
- అయినా ఏటా టీచర్ విద్యకు 35 వేల అడ్మిషన్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'బతకలేక బడి పంతులు' అనేది ఒకప్పటి మాట. అప్పట్లో టీచర్ ఉద్యోగం ఉన్నా వేతనాలు అంతంతమాత్రమే!. కానీ ఇప్పుడు ప్రభుత్వ టీచర్ల స్థితి మెరుగుపడింది. జీతాలు మాత్రమే కాదు.. సెలవులకు సెలవులు.. ప్రశాంతమైన జీవితం!. ఇది చూసి రాష్ట్రంలో వేల మంది ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ పెంచుకుంటున్నారు. ఏటా సుమారు 30 వేల మంది బీఈడీ, డీఈడీ చదివి బయటికొస్తున్నారు. అయితే, వారిలో ఎంతమంది ఉద్యోగాలు సాధిస్తున్నారంటే నోరెళ్లబెట్టే సమాధానం తప్పదు! అవును.. కనీసం ఐదు శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడంలేదు!!

అడ్మిషన్లు భారీగా..

బీఈడీ కోర్సుల్లో 2021-22లో 32348 మంది, 2022-23లో 35748 మంది చేరారు. అలాగే ఏటా సుమారు 2వేల మంది డిప్లొమా ఇన్ టీచర్ ఎడ్యుకేషన్(డీఈడీ) కోర్సుల కోసం డైట్ కాలేజీల్లో చేరుతున్నారు. వీరిలో 30వేల మందికి పైగా ఏటా ఉత్తీర్ణులై బయటికి వస్తున్నారు. వారిలో సుమారు5 వేల మంది బయటి రాష్ట్రాల వారుంటున్నారు. ఇలా గత పదేళ్లలో సుమారు 2.5లక్షల మంది రాష్ట్రానికి చెందినవారు టీచర్ విద్యను పూర్తిచేశారు. వీరు కాకుండా గతంలోనే బీఈడీ, డీఈడీలు చేసి ఇంకా ఉద్యోగార్హత వయసున్నవారు భారీగా ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 4 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది మరోసారి టెట్ నిర్వహించగా మళ్లీ 4,27,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంతకంటే ముందే టెట్ రాసి అర్హత ఉన్నవారు అనేక మంది ఉన్నారు. మొత్తంగా



మిగతా 3వ పేజీలో...

భాగవత్ వ్యాఖ్యలు దేశ ద్రోహమే: షర్మిల


రాహుల్‌తో పీసీసీ చీఫ్ షర్మిల

న్యూఢిల్లీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన త్యాగాలను ప్రతిబింబించేలా పార్టీ కేంద్ర కార్యాలయాన్ని నిర్మించారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. బుధవారం, కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం నూతన భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న షర్మిల మీడియాతో మాట్లాడారు. '1947లో దేశానికి స్వాతంత్ర్యం రాలేదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు దేశ ద్రోహమే. ఆర్ఎస్ఎస్ వ్యవహారం టెర్రరిస్టుల శైలిని, భాషను తలపిస్తోంది. దేశం కోసం పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ జట్టులో భాగస్వామి అయినందుకు గర్వంగా ఉంది' షర్మిల అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ, 'ఇందిరా గాంధీ శక్తిని స్ఫూర్తిగా తీసుకుని మతతత్వ పార్టీ అయిన బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీకి వ్యతిరేకంగా పోరాడి వాటిని ఓడిస్తాం' అని అన్నారు.

ప్రాజెక్టులవారీ కేటాయింపులు ఉండాల్సిందే!

- కృష్ణా ట్రిబ్యునల్ ముందు నేడు ఏపీ వాదనలు

అమరావతి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు వేసిన రెండేసి కేసులపై వాదనలను విడివిడిగా వినాలని కృష్ణా జలవివాదాల (బ్రిజేశ్‌కుమార్) ట్రిబ్యునల్‌ను రాష్ట్రప్రభుత్వం కోరనుంది. గురువారంనాడు ట్రిబ్యునల్ ముందు రెండు రాష్ట్రాలు తమ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యాయి. విభజన చట్టం సెక్షన్ 89లో పేర్కొన్న విధంగా ప్రాజెక్టుల వారీ నీటి కేటాయింపులను యథాతథంగా కొనసాగించాలని.. కృష్ణా జలాల్లో తమ వాటా 512 టీఎంసీలను కొనసాగించాలని.. రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా నదిపై తెలంగాణ నిర్మించిన జలాశయాలు, ఎత్తిపోతల పథకాలను అక్రమ కట్టడాలుగా గుర్తించాలంటూ తాము వేసిన కేసును ప్రత్యేకంగా వినాలని ఆంధ్ర కోరనుంది. 2023లో కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్సును, బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ కాల పరిమితిని పొడిగించడాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ వ్యతిరేకిస్తోంది.

నేడు ఈడీ ముందుకు కేటీఆర్

- 'ఫార్ములా-ఈ రేసు'కు విదేశీ కరెన్సీలో చెల్లింపులపై విచారణ

హైదరాబాద్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఉదయం 11గంటలకు ఈడీ ముందు విచారణకు హాజరు కానున్నారు. కాగా, విచారణకు తాను న్యాయవాదితో వస్తానని కేటీఆర్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని ఈడీ వర్గాలు తెలిపాయి. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి ఏసీబీ గతనెలలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేశారు. కేటీఆర్ తదితరులపై పీఎంఎల్ఏతో పాటు ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద దర్యాప్తు జరుపుతున్నారు.

కేటీఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు!

న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఈడీ, ఏసీబీ విచారణకు హాజరు కావాల్సిందేనన్న హైకోర్టు ఆదేశాల విషయంలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోబోమని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పీబీ వర్లేతో కూడిన ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. దీంతో కేటీఆర్ తన క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

80కిపైగా షెల్ కంపెనీలతో ప్రభుత్వానికి టోకరా!

- తమిళనాడు వాసిని అరెస్టు చేసిన జీఎస్టీ ఇంటెలిజెన్స్

విశాఖపట్నం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎనభైకి పైగా షెల్ కంపెనీలు సృష్టించి, వాటి ద్వారా వ్యాపారం చేసినట్టు రూ.230 కోట్లకు బోగస్ ఇన్వాయిస్‌లు తయారుచేసిన వ్యక్తిని విశాఖపట్నం జోన్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన మొహ్మద్ సహీమ్ అక్కడి పెర్నాంబుట్ పట్టణంలో ఉంటూ పలు సంస్థలకు చెందిన ధ్రువపత్రాలు సేకరించి, వాటితో వ్యాపార లావాదేవీలు నడిపినట్టు పత్రాలు సృష్టించాడు. ఏపీ, తమిళనాడు, కర్ణాటకల్లో వ్యాపారాలు నిర్వహించినట్టు పత్రాలు చూపి ప్రభుత్వం నుంచి రూ.35 కోట్ల ఇన్‌పుట్ క్రెడిట్ దక్కించుకున్నాడు. జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారుల దర్యాప్తులో వ్యాపారమే చేయకుండా తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించినట్టు తేలింది. దీంతో తమిళనాడు వెళ్లి అతన్ని అరెస్టు చేశారు. విశాఖపట్నంలోని ఆర్థిక నేరాల కోర్టులో అతన్ని హాజరుపరచగా ఈ నెల 24వరకు రిమాండ్ విధించినట్టు బుధవారం జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు తెలిపారు.

బెంగళూరు స్టార్టప్ 'పిక్సెల్' ప్రయోగం సక్సెస్

బెంగళూరు, జనవరి 15: భారత్‌కు చెందిన స్పేస్ స్టార్టప్ సంస్థ 'పిక్సెల్' అమెరికా నుంచి ప్రపంచంలోనే అత్యధిక రిజల్యూషన్ కలిగిన మూడు కమర్షియల్ హైపర్‌స్పెక్ట్రల్ ఉపగ్రహాలను ప్రయోగించినట్టు బుధవారం వెల్లడించింది. మంగళవారం రాత్రి కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం చేపట్టి.. 'ఫైర్‌ఫ్లైస్'గా పిలిచే ఈ భూ పరిశీలన ఉపగ్రహాలను 550 కిలోమీటర్ల ఎత్తులోని దిగువ భూ కక్ష్యలో ప్రవేశపెట్టినట్టు పేర్కొంది. బెంగళూరులోని తమ ప్రధాన కార్యాలయం నుంచి ఈ ప్రయోగాన్ని వీక్షించినట్టు పిక్సెల్ తెలిపింది.

ఏప్రిల్ 29 నుంచి ఎప్‌సెట్.. జూన్ 8న ఐసెట్

- తెలంగాణలో వివిధ కోర్సుల ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మా, న్యాయ విద్య, ఎంబీఏ, ఎంసీఏ సహా వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి బుధవారం ప్రకటించింది. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎప్‌సెట్(ఎంసెట్)ను ఏప్రిల్ 29 నుంచి మే 5వరకు నిర్వహించనున్నారు. ఈ-సెట్ మే 12న, లాసెట్ జూన్ 6న, ఐసెట్ జూన్ 8,9 తేదీల్లో నిర్వహిస్తారు.

ఆరాధన పత్రిక ఎడిటర్ గోశాల ప్రసాద్ మృతి



విజయవాడ(వన్‌టౌన్), జనవరి 15(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ నిర్వహిస్తున్న ఆరాధన పత్రిక ఎడిటర్ గోశాల ప్రసాద్ (64) బుధవారం కాకినాడలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్టుగా సుపరిచితుడు. ఆయన పూర్తిపేరు గోశాల వెంకట సోమేశ్వర దైవ ప్రసాద్. స్వస్థలం కాకినాడ. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పలు పత్రికలు, టీవీ చానెళ్లలో పనిచేశారు. కొంతకాలం సొంత పత్రిక నడిపారు. 2010-14లో ఆనాటి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, 2014-16 వరకు వైద్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు వద్ద పీఆర్వోగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఏపీ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరాధన పత్రిక ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. గోశాల ప్రసాద్ మరణ వార్త తెలుసుకున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫోన్‌లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. మంత్రి లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సంతాపం తెలిపారు.

సోషల్ మీడియాని మంచికే వాడదాం: వెంకటేష్

అమరావతి, జనవరి15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాను మంచి విషయాల కోసం మాత్రమే వాడదామని సినీ హీరో విక్టరీ వెంకటేష్ పిలుపునిచ్చారు. పోస్ట్ నో ఈవిల్ క్యాంపెయిన్ కోసం ఏపీ ప్రభుత్వంతో చేతులు కలిపిన వెంకీ మామ.. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, దూషణలకు స్వస్తి పలుకుదామని సూచించారు. అందరికీ నమస్కారం.. సోషల్ మీడియాను మంచి విషయాల కోసం మాత్రమే వాడదాం. డోంట్ మీ బ్యాడ్ కామెంట్స్. డోంట్ షేర్ ఫాల్స్ న్యూస్ ఆఫ్ సోషల్ మీడియా. పోస్ట్ నో ఈవిల్.. మేక్ సోషల్ మీడియా.. పాజిటివ్ ఎక్స్‌పీరియన్స్.. అనే వెంకటేష్ వీడియో సందేశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

భాగవత్.. జాగ్రత్త!

అలా మాట్లాడితే దేశంలో తిరగలేరు

1947లోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనే విషయాన్ని మీరు గుర్తించకపోవడం సిగ్గు చేటు

రామమందిర ప్రతిష్ఠాపనతోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వ్యాఖ్యలపై ఖర్గే ఫైర్


కాంగ్రెస్ పార్టీ కొత్త ప్రధాన కార్యాలయం, కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సోనియా గాంధీ(ఇన్‌సెట్)

న్యూఢిల్లీ, జనవరి 15: ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గుమంది. మన దేశానికి 'నిజమైన స్వాతంత్ర్యం' ఆయోధ్యలో రామ మందిరం ప్రారంభమైన రోజే వచ్చిందని భాగవత్ పేర్కొన్నారు. సోమవారం ఓ కార్యక్రమంలో భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే భాగవత్ 'అసలైన స్వాతంత్ర్యం' వ్యాఖ్యలను ఖర్గే తీవ్రంగా ఖండించారు. భాగవత్ ఇలాంటి వ్యాఖ్యలను కొనసాగిస్తే గనక ఆయనకు దేశంలో తిరగడం కష్టమవుతుందని హెచ్చరించారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా దాన్ని గుర్తించకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'చరిత్రను మరిచిపోయేవాళ్లు చరిత్ర సృష్టించలేరు' అన్న అంబేడ్కర్ వ్యాఖ్యలను ఖర్గే ప్రత్యేకంగా గుర్తుచేశారు. బుధవారం ఢిల్లీలోని 9-ఏ కోట్లా రోడ్డులో కాంగ్రెస్ పార్టీ నూతన కేంద్ర కార్యాలయాన్ని ఖర్గే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన, పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ వాళ్ల పాత్రేలేదని, ఎవ్వరూ జైళ్లకు వెళ్లలేదని, అసలు స్వాతంత్ర్య పోరాటంతో వారికి సంబంధమే లేదని.. ఈ విషయాలు అందరికీ తెలుసునని.. అందుకే మన దేశానికి 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిందనే విషయం వారికి గుర్తులేక.. ఇప్పుడు రామ మందిరం ప్రారంభమైన రోజును స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకోవాలని చెబుతున్నారని మండిపడ్డారు. "రామ మందిరం ప్రారంభోత్సవం రోజు స్వాతంత్ర్యం వచ్చిందని భాగవత్ చెబుతున్నారు. ప్రధాని మోదీనేమో తాను అధికారంలోకి వచ్చిన 2014లోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని నమ్ముతారు. కానీ దేశం స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు పోరాటం చేశారు. తమ ప్రాణాలను అర్పించారు కాబట్టి మేం మాత్రం 1947 స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తుపెట్టుకుంటాం" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిందని, దీన్ని మరిచిపోయినవాళ్లు చరిత్ర సృష్టించలేరని సంఘ్‌ను ఉద్దేశించి మండిపడ్డారు. కాగా, పార్టీ నూతన కేంద్ర కార్యాలయానికి 'ఇందిరా భవన్' అని పేరు పెట్టారు.

'ఎల్ అండ్ టీ-90 గంటల పని'పై అసంతృప్తి

వారంలో 90 పని గంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణియన్ చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విభేదించారు. రోజుకు 8గంటలు పనిచేశాక అలసిపోతారు కాబట్టే రోజుకు అంతకుమించి పని గంటలు ఉండొద్దంటూ నెహ్రూ, అంబేడ్కర్ సూచించారని గుర్తు చేశారు. ఇప్పుడేమో ఎల్ అండ్ టీ వాళ్లు 12 గంటలు, 14 గంటలు అంటున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆఫీసు వాస్తు మార్చిన సంఘ్

కాంగ్రెస్ పార్టీ కొత్త ఆఫీసు వాస్తును సంఘ్ ప్రభావితం చేసిందా? అంటే అవుననే అనిపిస్తోంది. పార్టీ కార్యాలయ ప్రధాన ముఖ ద్వారం వాస్తవానికి దీన్‌దయాళ్ మార్గ్ వైపు ఉండాల్సింది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త పేరుతో కార్యాలయ చిరునామా ఉండేందుకు వీల్లేకుండా కాంగ్రెస్ జాగ్రత్తపడింది. ఆ మేరకు దీన్‌దయాళ్ రోడ్డుకు వెనుకవైపు రోడ్డు అయిన కోట్లా మార్గ్‌వైపు కార్యాలయ ప్రధాన ద్వారాన్ని తెరిచింది.

ఏఐసీసీ కార్యాలయంలో పీవీకి చోటు

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు గుర్తింపునిచ్చింది. బుధవారం ప్రారంభమైన ఏఐసీసీ నూతన ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో పీవీ చిత్రపటాలను మూడింటిని ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి.. పీవీ కుర్చీలో కూర్చున్న ఫొటో ఒకటి కాగా, మరొకటి ప్రధాని హోదాలో దక్షిణ కొరియా అధ్యక్షుడు కిమ్ యంగ్ సామ్‌ను స్వాగతిస్తున్న ఫొటో. మూడోది.. కేంద్ర రక్షణశాఖ మంత్రిగా ఒకప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీతో కలిసి ఉన్న ఫొటో. పీవీ నర్సింహారావు 1991-1996 మధ్య దేశ ప్రధానిగా పని చేయడంతోపాటు 1992-1994 మధ్య ఏఐసీసీ అధ్యక్షుడిగానూ వ్యవహరించినప్పటికీ ఇప్పటివరకు ఉన్న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేయలేదు. ఆయన మృతి చెందిన 20 ఏళ్ల తరువాత తాజాగా ఏఐసీసీ కార్యాలయంలో ఆయనకు చోటు దక్కింది.

బీజేపీ, ఆరెస్సెస్‌తోనే కాదు.. భారత రాజ్య వ్యవస్థతోనూ పోరాడుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి వ్యవస్థనూ స్వాధీనం చేసుకున్నాయి. మనం పోరాడుతున్నది బీజేపీ, ఆరెస్సెస్‌తోపాటు భారత రాజ్య వ్యవస్థతో కూడా" అని ఆయన పేర్కొన్నారు. దళితులు, మైనారిటీలు, బీసీలు, ఎస్టీల నోరు మూసేయడం ద్వారా ద్వారా ప్రధాని మోదీ దేశ గళాన్ని అణచివేయాలని భావిస్తున్నారని ఆరోపించారు. అలాగే.. అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన రోజునే భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందంటూ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపైనా రాహుల్ మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలు దేశ ద్రోహంతో సమానమని.. ఇవే వ్యాఖ్యలు మరే దేశంలోనైనా చేసి ఉంటే.. వెంటనే ఆయన్ను అరెస్టు చేసి, విచారణ జరిపి ఉండేవారని దుయ్యబట్టారు. భారతదేశం 1947లో స్వాతంత్ర్యం పొందలేదని చెప్పడమంటే భారతీయులందరినీ అవమానించడమేనని ధ్వజమెత్తారు. "స్వాతంత్ర్యోద్యమం, రాజ్యాంగం గురించి తాను ఏమనుకుంటున్నానో ప్రతి 2-3 రోజులకొకసారి దేశప్రజలకు చెప్పే తెంపరితనం మోహన్ భాగవత్‌కు ఉంది. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు దేశద్రోహమే. ఎందుకంటే.. రాజ్యాంగానికి, బ్రిటిషర్లతో పోరాటానికి విలువ లేదని ఆయన వ్యాఖ్యలు చెబుతున్నాయి" అని రాహుల్ నిప్పులు చెరిగారు. అలాంటి నిరర్థకమైన మాటలను పట్టించుకోవద్దని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా.. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "ఇక దాపరికం లేదు. కాంగ్రెస్ పార్టీ వికృత వాస్తవ రూపం ఆ పార్టీ నేత ద్వారానే బయటపడింది. ఈ దేశానికి ఇప్పటికే తెలిసిన విషయాన్ని స్పష్టంగా చెప్పినందుకు రాహుల్‌ను నేను ప్రశంసిస్తున్నాను. ఆయన చెప్పే మాటలు, చేసే పనులు అన్నీ.. దేశ విచ్ఛిన్నం దిశగా, సమాజాన్ని విభజించే దిశగానే ఉంటున్నాయి" అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ట్వీట్ చేశారు. అర్బన్ నక్సల్స్‌తో, భారతదేశ ప్రతిష్ఠను తగ్గించి అపకీర్తిపాలు చేయాలనుకునే తెరవెనుక శక్తుల (డీప్ స్టేట్)తో రాహుల్‌గాంధీకి, ఆయన చుట్టూ ఉన్న వ్యవస్థకు సంబంధాలున్నాయని నడ్డా ఆరోపించారు. ఇక.. భారత రాజ్యవ్యవస్థపై పోరాడుతున్నామని చెబుతున్న రాహుల్‌గాంధీ చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ఎందుకు తిరుగుతున్నారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు.

లోకం తీరు



పోలీసుల ఎదుటే కుమార్తెను కాల్చేశాడు

- పెళ్లికి 4రోజుల ముందు తండ్రి ఘాతుకం
- ప్రేమ వ్యవహారమే కారణం
- మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఘటన

గ్వాలియర్, జనవరి 15: పెద్దలు కుదిర్చిన పెళ్లిని వ్యతిరేకించి తన ఇష్టప్రకారం జీవిత భాగస్వామిని ఎంచుకోవాలనుకున్న కుమార్తెను ఆమె తండ్రి కాల్చి చంపారు. పోలీసులు చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన తనూ గుర్జార్‌కు ఆమె తండ్రి మహేశ్ వివాహాన్ని ఏర్పాటుచేశారు. అది ఇష్టం లేని ఆమె.. తన పెళ్లికి నాలుగు రోజులు ముందు, మంగళవారం, 52 నిమిషాల నిడివి గల వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోను తనూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. విక్కీ అనే వ్యక్తిని ప్రేమిస్తున్నానని, కానీ, తమ కుటుంబం వేరే సంబంధం ఖాయం చేసిందని ఆమె తెలిపారు. వారు కుదిర్చిన సంబంధాన్ని వ్యతిరేకించినందుకు నన్ను రోజూ ఇంట్లో కొడుతున్నారనీ వాపోయారు. తనకు ప్రాణహాని ఉన్నదని, తనను రక్షించాలని ఆ వీడియోలో ఆమె కోరారు. సోషల్ మీడియాలో ఆమె వీడియో వైరల్ కావడంతో ఎస్పీ ధర్మవీర్‌సింగ్ సహా పోలీసు అధికారులు మంగళవారం రాత్రి ఆమె ఇంటికి చేరుకున్నారు. ఎందరు ఎన్నివిధాలా చెప్పినా తనూ, తన కుటుంబంతో కలిసి ఉండేందుకు నిరాకరించారు. తనను ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి (వన్ స్టాప్ సెంటర్) పంపాలని పోలీసు అధికారులను కోరారు. ఆమె మేజర్ (20ఏళ్లు) కావడంతో తనూను సంరక్షణ కేంద్రంలో చేర్చడానికి పోలీసు అధికారులు సిద్ధమయ్యారు. ఇంతలో తండ్రి వారిని ఆపారు. తన కుమార్తెతో కొద్దిసేపు మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఆమెను కొద్ది దూరం తీసుకువెళ్లాడు. పోలీసులు చూస్తుండగానే కూతుర్ని కాల్చి చంపేశాడు.


సెంట్రల్‌ఫ్యూజ్ ప్లాట్‌ఫారంలో గుర్తించిన పేలుడు పదార్థాలు

అణు పరికరాల్లో బాంబులు!

- ఇరాన్‌పై ఇజ్రాయెల్ వ్యూహం

(సెంట్రల్ డెస్క్)

ఇరాన్ అణు కార్యక్రమాలను ఇజ్రాయెల్ వ్యూహాత్మకంగా లక్ష్యంగా చేసుకుంటోందా? లెబనాన్‌లో హిజ్బుల్లా నేతలే లక్ష్యంగా పేజర్, వాకీటాకీ బాంబులను పేల్చిన ఇజ్రాయెల్.. ఇరాన్‌పైనా అలాంటి వ్యూహాన్నే అమలు చేయాలని కసరత్తు చేసిందా? ఏకంగా ఇరాన్ అణు కార్యక్రమాల పరికరాల్లో ఐఈడీలను అమర్చిందా? టెహ్రాన్ అణు కార్యక్రమాలను తన నియంత్రణలోకి తెచ్చుకుని, అణ్వాయుధాలు, ఇతర అణు ప్రాజెక్టులను ఏ క్షణాన్నైనా పేల్చేసేందుకు వ్యూహం రచించిందా?? ఈ ప్రశ్నలకు ఇరాన్ ప్రభుత్వం అవునని చెబుతోంది. తాము అణు కార్యక్రమాల కోసం కొనుగోలు చేసిన కవ్వాలు(సెంట్రల్ ఫ్యూజ్)కు సంబంధించిన ప్లాట్‌ఫారాల్లో ఇజ్రాయెల్ అమర్చిన బాంబులను గుర్తించామని ఇరాన్ వ్యూహాత్మక వ్యవహారాల ఉపాధ్యక్షుడు, విదేశాంగ శాఖ మాజీ మంత్రి మహమ్మద్ జావేద్ జరీఫ్ 'ఇరాన్ ఇంటర్నేషనల్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. "ఈ చర్య మా భద్రత సవాళ్లను తీవ్రతరం చేసింది" అని ఆయన వివరించారు. అయితే.. ఈ ఘటన ఎప్పుడు జరిగింది? ఎలా గుర్తించారు? అనే వివరాలను ఆయన వెల్లడించలేదు. 2020లో ఇరాన్‌లోని నతాంజ్ అణు కేంద్రంలో సెంట్రల్ ఫ్యూజ్‌లు పేలిపోయి, భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే.! 2021లోనూ నాటాన్జ్ అణు కేంద్రంపై సైబర్ దాడి జరిగింది. అప్పట్లో ఇరాన్ ఈ ఘటనలను 'న్యూక్లియర్ టెర్రరిజం' అని అభివర్ణించింది. తాజాగా జరీఫ్ చేస్తున్న ఆరోపణలు 2021లో కొనుగోలు చేసిన సెంట్రల్ ఫ్యూజ్‌కు సంబంధించినవని ఇరాన్ పత్రికలు చెబుతున్నాయి. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పజెష్కియాన్ కూడా దీనిపై పరోక్షంగా స్పందించారు. ఎన్‌బీసీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ యుద్ధం పట్ల ఆసక్తి చూపడం లేదన్నారు.

దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ అరెస్టు

సియోల్, జనవరి 15: దక్షిణ కొరియాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. నాటకీయ పరిణామాల నడుమ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను దక్షిణ కొరియా పోలీసులు అరెస్టు చేశారు. దేశంలో 'మార్షల్ లా' విధించి చట్టాన్ని ఉల్లంఘించినందుకు గాను యూన్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, బుధవారం తెల్లవారుజామున దాదాపు 3 వేల మంది పోలీసులు, అవినీతి నిరోధకశాఖ అధికారులు యూన్ నివాసానికి చేరుకున్నారు. యూన్‌ను అరెస్టు చేసేందుకు వెళ్లిన వీరిని ఆయన మద్దతుదారులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. తీవ్ర ఉద్రిక్తతల నడుమ అధికారులు అధ్యక్ష నివాసంలోకి వెళ్లి యూన్‌ను అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఓ సారి యూన్‌ను అరెస్టు చేసేందుకు అధికారులు ప్రయత్నించగా తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో వెనక్కు తగ్గారు. ఇక దక్షిణ కొరియా చరిత్రలో అధ్యక్షుడు అరెస్టు కావడం ఇదే తొలిసారి.

అగ్రశ్రేణి నౌకాశక్తిగా భారత్

- ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- రెండు యుద్ధ నౌకలు, జలాంతర్గామి జాతికి అంకితం


ఐఎన్ఎస్ సూరత్ నమూనాతో ప్రధాని మోదీ, నేవీ చీఫ్ దినేశ్

ముంబై, జనవరి 15: ఒకేసారి శక్తిమంతమైన అస్త్రాలు మూడు చేరడంతో భారత నౌకాదళం మరింత సమున్నతమైంది. ముంబై నావల్ డాక్‌యార్డ్ నుంచి భారత నౌకాదళ చరిత్రలో తొలిసారి ఓ డిస్ట్రాయర్, ఓ ఫ్రిగేట్, మరో జలాంతర్గామి భారత అమ్ములపొదిలోకి చేరాయి. యుద్ధ నౌకలైన ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం జాతికి అంకితం చేశారు. భారత సముద్ర వారసత్వం, నౌకాదళ చరిత్ర, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌కు ఇది చిరస్మరణీయమైన రోజు అని ఈ సందర్భంగా మోదీ అన్నారు. మూడు శక్తిమంతమైన అస్త్రాలు ఒకేసారి నౌకాదళంలో చేరడం చరిత్రలో ఇదే మొదటిసారని చెప్పారు. ఇవి స్వదేశంలో తయారు కావడం అత్యంత గర్వకారణమని కొనియాడారు. వీటి రాకతో ప్రపంచంలోనే ఓ అగ్రశ్రేణి నౌకాశక్తిగా భారత్ అవతరించిందని అభివర్ణించారు. అంతర్జాతీయ జలాల్లో రక్షణాత్మక చర్యలు చేపట్టడంలో భారత పాత్ర గణనీయంగా పెరిగిందని, మొత్తం హిందూ మహా సముద్ర ప్రాంతంలో తొలిగా స్పందించేది భారత్ అని, ఈ ప్రాంతంలో మన సైనికులు వందలాది మంది ప్రాణాలను కాపాడారని మోదీ తెలిపారు. కీలకమైన మారిటైమ్ శక్తిగా ఎదుగుతున్న భారత్.. జల సరిహద్దులు, స్వేచ్ఛాయుత సముద్రయానం, వ్యాపార మార్గాలను కాపాడటంలో ముఖ్యమైన పోషించాలని చెప్పారు.

భారత్‌ది అభివృద్ధి వాదం..

భారత్‌ది విస్తరణ వాదం కాదని, అభివృద్ధి స్ఫూర్తితోనే మనదేశం పనిచేస్తుందని మోదీ స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత, సహకారం, అభివృద్ధికి భారత్ ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందన్నారు. భవిష్యత్‌లో ప్రపంచంలో కీలకమైన శక్తిగా ఎదిగేందుకు విశాల దృక్పథంతో చేపడుతున్న చర్యలను కూడా మోదీ వివరించారు. సముద్రగర్భంలోని అత్యంత లోతులను శోధించే శక్తిని భారత్ పెంచుకుంటోందని, 6 వేల మీటర్ల లోతుల్లో కూడా అన్వేషణ కొనసాగించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించామని వెల్లడించారు. నౌకాదళంలో 'మేడిన్ ఇండియా' శక్తిసామర్థ్యాలు శరవేగంగా పెరగడాన్ని గర్వకారణమన్న మోదీ.. దీనికి 2014 నుంచి రెండింతలైన నౌకాదళ శక్తి నిదర్శనమని చెప్పారు. ఇప్పటి వరకు 33 నౌకలు, ఏడు జలాంతర్గాములను ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. సముద్ర వ్యవహారాల్లో కూడా గ్లోబల్ లీడర్‌గా ఎదిగే బాటలో భారత్ ఉందని అన్నారు.

ఇస్కాన్ ఆలయాన్ని ప్రారంభించిన మోదీ

ముంబై పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. నవీ ముంబైలోని ఖర్గార్‌లో నిర్మించిన ఇస్కాన్ ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. సేవా స్ఫూర్తిలోనే భారత ఆధ్యాత్మిక మూలాలు ఉన్నాయని ఈ సందర్భంగా మోదీ ఉద్ఘాటించారు. ప్రజా శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం దశాబ్దకాలానికి పైగా నిస్వార్థంగా పనిచేస్తోందని చెప్పారు. సేవా స్ఫూర్తి నిజమైన సామాజిక న్యాయానికి, లౌకికవాదానికి ఆలంబనగా నిలుస్తుందని మోదీ అభిప్రాయపడ్డారు. యువకుల్లో ఇస్కాన్ సేవా స్ఫూర్తిని నింపుతోందని కొనియాడారు.

ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం!

- ఉత్తర భారతంలోని సరిహద్దుల్లో పరిస్థితి సాధారణమే: ఆర్మీ చీఫ్
- పుణెలో ఘనంగా 77వ ఆర్మీ డే

పుణె, జనవరి 15: దేశ సరిహద్దు వెంబడి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే సమర్థత మనకుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. ఉత్తర భారతంలోని సరిహద్దుల్లో పరిస్థితి సున్నితమైనప్పటికీ ప్రస్తుతం సాధారణంగానే ఉందని పేర్కొన్నారు. పుణెలోని ఆర్మీ సదరన్ కమాండ్‌కు చెందిన బాంబే ఇంజనీరింగ్ గ్రూప్ అండ్ సెంటర్‌లో బుధవారం ఆర్మీ డే పరేడ్ ఘనంగా జరిగింది. ఈ వేడుకలలో ద్వివేది మాట్లాడారు. నియంత్రణ రేఖ వెంబడి కాల్పుల విరమణ కొనసాగుతోందని, అయితే చొరబాటు ప్రయత్నాలూ జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఆర్మీ డే వేడుకలను తొలిసారి పుణెలో నిర్వహిస్తున్నామని, ఇది కూడా ప్రాముఖ్యత కలిగిన అంశమని, ఇకపై చిన్న నగరాల్లో వేడుకలను నిర్వహిస్తామన్నారు.



వీర జవాన్‌కు గ్యాలంటరీ అవార్డు

సిరిసిల్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతిచెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన జవాన్ అనిల్‌కుమార్(30)కు కేంద్రం ప్రకటించిన గ్యాలంటరీ అవార్డును ఆయన సతీమణి సౌజన్యకు అందజేశారు. పుణెలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. 2023 మే 4న జమ్మూకశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అనిల్ మృతి చెందారు.

డ్రోన్ విధ్వంసక సూక్ష్మ క్షిపణి 'భార్గవాస్త్రం'

- మైక్రో మిస్సైల్ సిస్టమ్ పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ, జనవరి 15: దేశ రక్షణ వ్యవస్థలోకి మరో సరికొత్త క్షిపణి వ్యవస్థ చేరనుంది. డ్రోన్ విధ్వంసక సూక్ష్మ క్షిపణి వ్యవస్థ 'భార్గవాస్త్రం'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. డ్రోన్ తరహా దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దేశీయంగా రూపొందించిన ఈ మైక్రో మిస్సైల్ సిస్టమ్‌ను.. ఒడిసాలోని గోపాల్‌పూర్‌లోని సీవార్డ్ ఫైరింగ్ రేంజ్ నుంచి పరీక్షించారు. భారత సైన్యం కోసం అభివృద్ధి చేసిన ఈ మైక్రో మిస్సైల్ 2.5 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. ఈ ఏడాది చివర్లో మరోసారి పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి దీన్ని సైన్యానికి అందుబాటులోకి తెచ్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భార్గవాస్త్రం అనేది ఒక కౌంటర్ డ్రోన్ వ్యవస్థ. డ్రోన్ దాడులను దీటుగా ఎదుర్కొనేందుకు దీన్ని అభివృద్ధి చేశారు. 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న వైమానిక వాహనాలను కూడా ఇది గుర్తించి, గైడెడ్ మైక్రో బాంబులను ఉపయోగించి వాటిని నిర్వీర్యం చేస్తుంది. భార్గవాస్త్రం వ్యవస్థకు ఏకకాలంలో 64 మైక్రో క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం ఉంది. ఎక్కడికైనా సులువుగా, వేగంగా తరలించవచ్చు.



స్వామి, అమ్మవార్ల తరపున నిందాస్తుతి చేస్తూ పారాయణం చేస్తున్న అర్చకులు

తిరుమలలో ప్రణయకలహోత్సవం

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రణయ కలహోత్సవం కనువిందు చేసింది. స్వామి అమ్మవార్ల మధ్య కలహ శృంగార భరితమైన సన్నివేశాలు భక్తులకు ఆనందాన్ని పంచాయి. ఏటా వైకుంఠ ఏకాదశికి ఆరోరోజు, అధ్యయనోత్సవం 17వ రోజు తిరుమలలో ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు మలయప్పస్వామి పల్లకీ ఎక్కి మహాప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరిణి వద్దకు వచ్చారు. ఇంతలో అమ్మవార్లు చెరో పల్లకీపై అప్రదక్షిణంగా స్వామికి ఎదురుగా వచ్చి నిలుచున్నారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరపున జీయంగార్లు పూల చెండ్లను స్వామిపై విసరడం.. వాటికి స్వామి బెదిరినట్టుగా వెనుకకు పారిపోయి మళ్లీ ముందుకు రావడం మూడుసార్లు చేశారు. తన తప్పేమీ లేదని అమ్మవార్లను స్వామివారు ప్రాధేయపడటం వంటి సన్నివేశాలను భక్తులు తన్మయత్వంతో తిలకించారు.

ఘనంగా పార్వేట ఉత్సవం



శ్రీవారి తరఫున ఈటె విసురుతున్న అర్చకుడు

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం శ్రీవారి పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది. శ్రీవారి ఆలయం నుంచి మధ్యాహ్నం మలయప్పస్వామి తిరుచ్చిలో ఊరేగింపుగా పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపానికి వేంచేపు చేశారు. వెంట మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామినీ వేంచేపు చేశారు. పార్వేట ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన వేటకు సంబంధించిన సన్నివేశాలు ఆసక్తికరంగా నిలిచాయి. మలయప్పస్వామి తరుపున కొందరు అర్చకులు, అధికారులు ముందుకు కొంత దూరం పరుగెత్తి మూడుసార్లు ఈటెను విసరడం వంటి సన్నివేశాలను భక్తులు ఆసక్తికరంగా తిలకించారు.

3.36 లక్షల మందికి వైకుంఠద్వార దర్శనాలు

తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఐదురోజుల్లో 3,36,873 మంది స్వామిని.. వైకుంఠ ద్వారాలను దర్శించుకున్నారు. రూ.16.75 కోట్ల హుండీ కానుకలు రాగా, 79,002 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, ధనుర్మాసం మంగళవారంతో ముగియడంతో బుధవారం ఉదయం నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవతిరిగి ప్రారంభమైంది.



జగ్గన్నతోట తీర్థంలో కొలువుతీరిన ఏకాదశ రుద్రుల ప్రభలు, (ఇన్‌సెట్) అప్పర్ కౌశిక దాటుతున్న గంగలకుర్రు, జి.అగ్రహారం ప్రభలు

కన్నుల పండువగా ప్రభల ఉత్సవం

▸ జనసంద్రంగా జగ్గన్నతోట

అంబాజీపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కనుమ సందర్భంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 170గ్రామాల్లో ప్రభల తీర్థాలను కన్నుల పండువగా నిర్వహించారు. అంబాజీపేట మండలం మొసలపల్లిలోని జగ్గన్నతోట ప్రభల తీర్థం చూసేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. 11 గ్రామాల నుంచి ఏకాదశ రుద్రులు జగ్గన్నతోటలో కొలువుతీరాయి. ఏకాదశ రుద్రులను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం నుంచి వచ్చే చెన్నమల్లేశ్వరస్వామి, వీరేశ్వరస్వామి ప్రభలు పచ్చని చేలను తొక్కుకుంటూ పంట కాలువను దాటిస్తున్న తీరు చూపరులను పారవశ్యానికి గురిచేసింది. మిగిలిన ప్రభలను ఆయా గ్రామాల్లో ఊరేగింపుగా తీర్థానికి తీసుకువచ్చారు. శిలాతోరణాలు, వరికంకులు, గుమ్మడికాయ, పలురకాల పూలమాలలతో ప్రభలను అలంకరించారు. మండంలోని వాకలగరువులో 42అడుగులకు పైగా ఉన్న తొండవరం, వాకలగరువు ప్రభలు తీర్థంలో కొలువుదీరాయి.

అయ్యో..రు!

(మొదటి పేజీ తరువాయి)

చూస్తే సుమారు 7లక్షల మందిపైగా ఉద్యోగ అర్హత వయసున్న బీఈడీ, డీఈడీ చదివినవారు రాష్ట్రంలో ఉన్నారని అంచనా.

ఆరు శాతం ఉద్యోగాలే..

ఓవైపు భారీగా టీచర్ విద్యనభ్యసించిన వారుంటే టీచర్ ఉద్యోగాల భర్తీ మాత్రం ఆ స్థాయిలో లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. అంతకుముందు 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 20,532 పోస్టులతో రెండు డీఎస్సీ నోటిఫికేషన్లు ప్రకటించింది. అంటే మొత్తం నిరుద్యోగుల్లో ఈ పోస్టుల సంఖ్య కేవలం 2.93శాతం మాత్రమే. ఇవి కాకుండా ఏటా పెరుగుతున్న ప్రైవేటు పాఠశాలల్లోనూ కొందరు ఉద్యోగాల్లో చేరుతున్నారు. ఆ సంఖ్య కూడా దాదాపుగా 20 నుంచి 30వేల మధ్యే ఉంటుంది. అంతా కలిపినా గత పదేళ్లలో 6 నుంచి 7శాతం మందికే టీచర్ ఉద్యోగాలు లభించాయి. మిగిలిన వారంతా ఖాళీగానే మిగిలిపోతున్నారు. టీచర్ ఉద్యోగం ఆశ లేనివారు చిన్నా చితక ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇక ప్రభుత్వం త్వరలో విడుదల చేయబోయే మెగా డీఎస్సీలో 16,347 పోస్టులున్నాయి. అవి కూడా మొత్తం నిరుద్యోగుల్లో రెండు మూడు శాతం మందికే ఉద్యోగావకాశాలు కల్పిస్తాయి.

ఒకప్పుడు సీటొస్తే గొప్ప

ఇప్పుడు ఉద్యోగాలు లేక నామమాత్రంగా మారిన బీఈడీ, డీఈడీ విద్యకు ఒకప్పుడు భారీ డిమాండ్ ఉండేది. ఇరవై ముప్పై ఏళ్ల కిందట బీఈడీ సీటు సాధించడం కోసం విద్యార్థులు చాలా కష్టపడాల్సి వచ్చేది. అప్పట్లో బీఈడీ, డీఈడీల్లో సీటు వస్తే ఎంబీబీఎస్ సీటు వచ్చినంత గొప్పగా ఉండేది. కాలక్రమంలో కాలేజీలు, సీట్లు భారీగా పెరిగిపోయి బీఈడీ, డీఈడీలకు విలువ తగ్గిపోయింది.

ప్రైవేటులో జీతం పదివేలే

ప్రభుత్వ టీచర్ ఉద్యోగాలు కష్టం కావడంతో మిగిలిన వారంతా ప్రైవేటు స్కూళ్ల బాట పడుతున్నారు. కానీ, అర్హత కలిగిన టీచర్లు లక్షల్లో ఉంటే ప్రైవేటులో అవకాశాలు మాత్రం అతి తక్కువగానే ఉంటున్నాయి. దీంతో నిరుద్యోగుల మధ్యే పోటీ ఏర్పడి అది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు అవకాశంగా మారుతోంది. అన్ని అర్హతలు, బోధనలో నైపుణ్యం ఉన్నా సగటున టీచర్‌కు నెల జీతం రూ.10వేలే వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.7వేలు, రూ.8వేలుకు మించడంలేదు. వీరిలో ఎక్కువగా మహిళలు ఉంటున్నారు. రాష్ట్రంలో 1 నుంచి 12వ తరగతి వరకు 3,39,827 మంది టీచర్లు పనిచేస్తున్నారు. వారిలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో 57శాతం మంది, ఎయిడెడ్‌లో ఒక శాతం, ప్రైవేటులో 42శాతం మంది ఉన్నారు. అంటే 1,42,750 మంది ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్నారు. నిరుద్యోగుల సంఖ్యతో పోలిస్తే పోస్టులు తక్కువగా ఉండటంతో ఎప్పటికప్పుడు నిరుద్యోగ రేటు పెరిగిపోతోంది.

మారనున్న ట్రెండ్..

ప్రభుత్వ టీచర్ ఉద్యోగాల్లో ఇప్పుడు ట్రెండ్ మారనుంది. కారణం.. ఇప్పటివరకూ బీఈడీ చదివినవారు స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకూ అర్హులుగా ఉన్నారు. కానీ 1 నుంచి 5 తరగతులకు బోధించే ఎస్జీటీ టీచర్ పోస్టులకు బీఈడీలు అర్హులు కారని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో ఎస్జీటీ పోస్టులకు బీఈడీ చేసినవారి నుంచి పోటీ తగ్గుతోంది. దీంతో డీఈడీకి పోటీ పెరిగే అవకాశం కనిపిస్తోంది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు డైట్ కాలేజీల్లో మొత్తం 2వేలకు మించి డీఈడీ సీట్లు లేవు.

సర్టిఫికెట్ కోసం చదివేద్దాం

బీఈడీ చదివేవారిలో కొంతమంది కేవలం సర్టిఫికెట్ కోసం మాత్రమే చదువుతున్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. కాలేజీకి వెళ్లే పనిలేనందున బీఈడీ చదివేవారి సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో 396 ప్రైవేటు బీఈడీ కాలేజీలున్నాయి. వాటిలో పట్టుమది పది కాలేజీలు కూడా సక్రమంగా తరగతులు నిర్వహించట్లేదు. దీంతో అడ్మిషన్ తీసుకోవడం మళ్లీ ఆ తర్వాత పరీక్షలు రాయడం తప్ప విద్యార్థులు మళ్లీ కాలేజీల ముఖం చూడట్లేదు. అందుకే పొరుగు రాష్ట్రాల విద్యార్థులూ ఇక్కడికొచ్చి బీఈడీ చదువుతున్నారు. అదే కచ్చితంగా రోజూ తరగతులకు హాజరుకావాలనే నిబంధన ఉంటే ఇన్ని అడ్మిషన్లు ఉండవు.

ఘనంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం

▸ జనసంద్రమైన ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరులో అశేష జనవాహిని నడుమ నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం

ఎమ్మిగనూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవానికి తెలంగాణ, కర్ణాటక జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

డీసీసీబీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

▸ 50 అసిస్టెంట్ మేనేజర్, 201 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్

అమరావతి, జనవరి15(ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా, శ్రీకాకుళం, కర్నూలు డీసీసీబీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మేనేజర్, స్టాఫ్ అసిస్టెంట్/క్లర్క్ పోస్టుల భర్తీకి తాజాగా నోటిఫికేషన్ జారీ అయ్యింది. వివరాలను ఆప్కాబ్ తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈనెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఫిబ్రవరిలో ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. గుంటూరు డీసీసీబీలో 31 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు, 50 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల్లో పీఏసీఎస్ ఇన్‌సర్వీస్ ఉద్యోగులకు 13 రిజర్వ్ అయ్యాయి. శ్రీకాకుళం డీసీసీబీలో 19 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు, 35 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు చూపగా పీఏసీఎస్ ఉద్యోగులకు 9 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించారు. కృష్ణా జిల్లా డీసీసీబీలో 66 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులకు 17 పీఏసీఎస్ ఇన్‌సర్వీస్ ఉద్యోగులకు కేటాయించగా, కర్నూలు డీసీసీబీలో 50 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల్లో పీఏసీఎస్ ఇన్‌సర్వీస్ ఉద్యోగులకు 13 పోస్టులు కేటాయించారు.

ఇలవేల్పును దర్శించుకున్న జస్టిస్ చల్లా గుణరంజన్



జస్టిస్ చల్లా గుణరంజన్‌ను గజమాలతో సత్కరిస్తున్న జంబులపాడు గ్రామస్థులు

తాడిపత్రి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం జంబులపాడులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని హైకోర్టు అదనపు జడ్జి జస్టిస్ చల్లా గుణరంజన్ కుటుంబ సభ్యులతో బుధవారం దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. జస్టిస్ చల్లా గుణరంజన్ ఇదే మండలంలోని చల్లావారిపల్లికి చెందినవారు. తమ ఇలవేల్పు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు జంబులపాడుకు వెళ్లిన ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు.

మల్లన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

శ్రీశైలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను బుధవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి దంపతులు దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారికి పూజలు చేశారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

మహిళను కొట్టి.. జుత్తు కత్తిరించారు!



▸ ప్రేమజంట పరారీకి సహకరించిందనే అనుమానంతోనే..

▸ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలో దారుణం

▸ 22 మందిపై కేసు నమోదు

పెనుకొండ రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రేమ జంట పరారీకి సహకరించిందన్న అనుమానంతో ఓ మహిళపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టడంతోపాటు ఆమె జుత్తును కత్తిరించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన అనిల్ అనే యువకుడు ప్రేమ పేరుతో ఈ నెల 9వ తేదీన ఓ బాలికతో పరారయ్యాడు. రెండు రోజుల తర్వాత తిరిగి గ్రామానికి చేరుకొని ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అనిల్‌పై కియ పోలీసుస్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. కాగా, బాలిక కుటుంబ సభ్యులు బుధవారం గ్రామంలోని వెంకటలక్ష్మమ్మపై దాడి చేసి, ఆమె జుత్తును కత్తిరించారు. బాలిక ప్రేమ వ్యవహారంతో తనకు సంబంధం లేకపోయినా ఆమ బంధువులు తన ఇంట్లోకి చొరబడి విచక్షణారహితంగా కొట్టారని, తన జుత్తును కత్తిరించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో 22 మందిపై కేసు నమోదు చేశామని కియ పోలీసులు తెలిపారు.

అన్న ఇక లేడని...కుప్పకూలి...

▸ గంటలోపే గుండెపోటుతో సోదరుల మృతి

చీరాలటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అన్న మృతి చెందాడన్న వార్త వినగానే తమ్ముడు కూడా కుప్పకూలి తుది శ్వాస విడిచాడు. బాపట్ల జిల్లా చీరాల పట్టణ పరిధిలోని గొల్లపాలెంకు చెందిన గొల్లప్రోలు గంగాధర్ (42), గోపి పవన్ కుమార్ (36) అన్నదమ్ములు. వీరిది ఉమ్మడి కుటుంబం. అన్నకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తమ్ముడు ఎంటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నాడు. వీరి తండ్రి రాములు అలియాస్ బాలాజీ సుమారు నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. గంగాధర్ వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బుధవారం ఉదయం ఇంటి ముందు కూర్చుని తమ్ముడు గోపితో మాట్లాడుతూ వడ్రంగి పనిచేస్తున్న అన్న గంగాధర్ ఒక్కసారిగా ఛాతీనొప్పితో కుప్ప కూలిపోయాడు. చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మరణించినట్లు చెప్పారు. అది విన్న వెంటనే అక్కడికక్కడే తమ్ముడు గోపిపవన్ కూడా కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. చీరాల రెండో పట్టణ పోలీసులు అనుమానాస్పద మరణాలుగా కేసు నమోదు చేశారు.

టీ-5 మిశ్రమంవైపే సీఎస్ఎంఆర్ఎస్ మొగ్గు!

▸ టీ-15కి ఓటేసిన విదేశీ నిపుణులు

▸ ప్లాస్టిక్ కాంక్రీట్‌పై నేడు ఐఐటీ-తిరుపతి నివేదిక

▸ అది చూశాక జలసంఘం నిర్ణయం!

అమరావతి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అత్యంత ప్రధానమైన డయాఫ్రం వాల్ నిర్మాణానికి ఉపయోగించే ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమం ఎంపికపై కేంద్ర జల సంఘం ఒక ట్రెండు గురువారం నిర్ణయమూ తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. జర్మన్ సంస్థ బావర్, మేఘా ఇంజనీరింగ్ సంస్థ నాలుగు రకాల మిశ్రమాలు తయారుచేసి దానికి, అంతర్జాతీయ నిపుణులు డేవిడ్ బ్రియాన్ పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో (అమెరికా), సీన్ హించ్‌బెర్గర్, చార్లెస్ రిచర్డ్ డొనెల్లీ (కెనడా)కు పంపింది. వాటిని పరిశీలించిన నిపుణులు ఈ నెల 9న వర్చువల్ భేటీలో తలో అభిప్రాయం చెప్పారు. టీ-15 మిశ్రమం వాడాలని సూచిస్తూ 10న నివేదిక పంపారు. వారితో సెంట్రల్ సాయిల్-మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) విభేదించింది. వాల్ నిర్మాణానికి గతంలో బావర్, ఎల్ అండ్ టీ సంస్థలు వాడిన టీ-5 మిశ్రమం మంచిదని స్పష్టం చేసింది. 2019లో గోదావరికి 14 లక్షల క్యూసెక్కులు, 2020లో 23 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా పాత వాల్ తట్టుకోగలిగిందని గుర్తుచేసింది. ఇదే విషయాన్ని జల సంఘం కూడా ఇదివరకు జరిగిన పలు సమీక్షల్లో అంగీకరించింది. ఈ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో ఢిల్లీలో సీఎస్ఎంఆర్ఎస్ అధికారులతో జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారుల బృందం వరుస భేటీలు నిర్వహించింది. టీ5 మిశ్రమమే వాడాలని సీఎస్ఎంఆర్ఎస్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఇంకోవైపు.. బావర్-మేఘా తయారుచేసిన నాలుగు మిశ్రమాల పనితీరును పరీక్షించి అంచనా వేసే బాధ్యతను జలసంఘం ఐఐటీ-తిరుపతికి అప్పగించింది. అది గురువారం నివేదికను సమర్పించనుందని జలసంఘం బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావుకు తెలియజేసింది. దానిని పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని సమాచారమిచ్చింది. గురు లేదా శుక్రవారం తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని జల వనరుల శాఖ చెబుతోంది.

వ్యవసాయ పనుల్లో మంత్రి నిమ్మల



రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కనుమ పండుగ రోజు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. తన సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లా ఆగర్తిపాలెంలో ఆయనకు పొలం ఉంది. బుధవారం ఆ పొలంలో ఆయన వరి చేలకు మందు స్ప్రే చేస్తూ కనిపించారు. వ్యవసాయమంటే తనకు ఎంతో ఇష్టమని, పండుగ రోజు కొంత తీరిక దొరకడంతో కూలీలతో కలిసి పని చేయడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడూ, అధ్యాపకుడిగా పని చేసినప్పుడూ సొంతంగా వరి సాగు చేసి ఎకరానికి 55 నుంచి 60 బస్తాలు దిగుబడి సాధించడమే కాక ఆక్వా సాగులోనూ మంచి ఫలితాలు సాధించానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. -ఆంధ్రజ్యోతి, పాలకొల్లు రూరల్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సోనా' సొరంగం..!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొన్న సోమవారం జమ్మూకశ్మీర్‌లో సోనామార్గ్ సొరంగాన్ని ఆరంభించారు. ఆరున్నర కిలోమీటర్ల పొడవున్న ఈ సొరంగ మార్గం వల్ల ఈ కేంద్రపాలిత ప్రాంతానికి ఆర్థికంగానూ, దేశానికి రక్షణపరంగానూ ఎంతోమేలు జరుగుతుందని విశ్లేషణలు వెలువడ్డాయి. సముద్రమట్టానికి ఎనిమిదిన్నర వేల అడుగులో దీనిని నిర్మాణానికి ఎవరు ఎంతగా శ్రమించారో ఆరంభానికి బాగా ముందునుంచే వ్యాఖ్యానాలు వినబడ్డాయి. మంచుపెళ్ళలు విరిగిపడుతూ రాకపోకలకు ఏమాత్రం వీలులేని పరిస్థితులు ఈ సొరంగం ఏర్పాటుతో పూర్తిగా మారినమాట వాస్తవం. శ్రీనగర్ నుంచి సోనామార్గ్‌కు దట్టమైన మంచున్నకాలంలో కూడా సులువుగా పోవచ్చును. ప్రజల రాకపోకలకు వీలుకల్పిస్తూ, వ్యాపారావకాశాలను పెంచుతున్న ఈ సొరంగం ఏర్పాటుతో కశ్మీర్‌కు ఎంత లబ్ధిచేకూరగలదో ప్రధాని తన ప్రసంగంలో వివరించారు. కశ్మీర్‌ను గతంలో భూతలస్వర్గం అనేవారనీ, సోనామార్గ్ సొరంగం ఆరంభంతో ఇకపై మళ్ళీ అలా పిలవడం మొదలవుతుందనీ అన్నారాయన. తమ పదేళ్ళ ఏలుబడిలోనే దేశం ప్రగతి మెట్లు ఎక్కినట్టుగానూ, ప్రత్యేకప్రతిపత్తి పోవడంతోనే కశ్మీర్ కళకళలాడుతున్నట్టుగానూ వ్యాఖ్యలు చేయడం బీజేపీ పెద్దలకు అలవాటే. అతిశయోక్తులను అటుంచితే, ఏడాది అంతా శ్రీనగర్‌ను లద్దాఖ్‌తో అనుసంధానించే ఈ టన్నెల్ ఆరంభం కశ్మీర్ ఆర్థిక పురోగతికి తోడ్పడేమాట నిజం.

మోదీ ప్రధాని కావడానికి రెండేళ్ళకు ముందే ఈ సొరంగ నిర్మాణానికి పునాదులు పడినవిషయాన్ని గుర్తుచేస్తూ, ఈ కీర్తిలో తమకూ వాటా దక్కాలని కాంగ్రెస్ వాదిస్తోంది. మొత్తం కీర్తి మోదీకి పోతుందేమోనన్న భయంతో కాబోలు అప్పుడు తాము చూపిన చొరవనూ, పడిన శ్రమనూ ఆ పార్టీ గుర్తుచేస్తోంది. ఎవరి పాత్ర ఎంత అన్నది అటుంచితే, ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్న ప్రతీ ఒక్కరి పట్టుదలవల్లనే ఈ మూడువేలకోట్ల రూపాయల నిర్మాణం ప్రజలకు అందుబాటులోకి వచ్చిన మాట నిజం. అత్యంత సంక్లిష్టమైన ప్రాంతంలో, ప్రకృతి బీభత్సాలకు ఎదురొడ్డి ఈ అద్భుతాన్ని ఆవిష్కరించడానికి పన్నెండేళ్ళు పట్టడంలో తప్పేమీ లేదు. 1999లో కార్గిల్‌లో ఓ చిన్నయుద్ధం చేయాల్సివచ్చిన తరువాత, సర్వకాల సర్వావస్థల్లోనూ సైన్యం ఎల్‌వోసీ, ఎల్ఏసీలకు సులువుగా చేరగలిగే మార్గాలు ఉండాలన్న విషయం మనకు స్పష్టంగా తెలిసొచ్చింది. చైనా దురాక్రమణల తరువాత లద్దాఖ్ మీద మరింత పట్టుబిగించాల్సిన ఆవశ్యకత కనిపించింది. కార్గిల్, లద్దాఖ్ సెక్టార్లను సైనికపరంగా మనకు చేరువచేయడానికి ఈ టన్నెల్ ఉపకరిస్తుంది.

అప్పట్లో అబ్దుల్లాలు అధికారంలో ఉండగానే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం, ఇప్పుడు మళ్ళీ వారి ఏలుబడిలోనే ఆరంభోత్సవం జరగడం కొందరు గుర్తుచేస్తున్నారు. ఆ అనుబంధం వల్లనో, మరేకారణంచేతనో, ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాత్రం ఈ టన్నెల్ ఆరంభోత్సవ కార్యక్రమంలో మోదీని అధికంగా కీర్తించారని కొందరికి ఆగ్రహం కలిగింది. మోదీ మూడోసారి ప్రధానిగా అధికారం చేపట్టిన తర్వాత శ్రీనగర్‌లో అంతర్జాతీయ యోగాదినోత్సవంలో పాల్గొన్నారని, ఎన్నికలు నిర్వహిస్తామని ప్రజలకు ఆయన అప్పుడుచేసిన వాగ్దానాన్ని నాలుగునెలల్లోనే నెరవేర్చారని ఒమర్ చెప్పుకొచ్చారు. తాను ముఖ్యమంత్రి కావడానికి వీలుగా ఎన్నికలు జరిపినందుకు ఆయన ఎన్నికల సంఘానికీ, ప్రధానికీ కృతజ్ఞతలు తెలియచేశారు. అయితే, ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారంటూ సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వం మెడమీద కత్తిపెట్టిన కారణంగా, అప్పట్లో కేంద్రప్రభుత్వం నిర్దిష్టమైన గడువుకు హామీపడిన విషయాన్ని ఒమర్ మరిచిపోయినట్టు ఉన్నారు. అలాగే, ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరిగాయని ఉద్ఘాటించడం ద్వారా తాను భాగస్వామిగా ఉన్న ఇండియాబ్లాక్‌ను కూడా ఆయన ఇరకాటంలో పడేశారు. కశ్మీర్‌లో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని ఆయన ఏ ప్రాతిపదికన వ్యాఖ్యానించారో తెలియదు. సోన్‌మార్గ్ సొరంగం నిర్మాణంలో ఉండగానే ఏడుగురు కార్మికులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రతిపత్తికోసమే ఒమర్ అబ్దుల్లా ఈ మోదీ కీర్తిగానానికి ఉపక్రమించి ఉండవచ్చు. ఆ కాలం ఎప్పుడు కలిసొస్తుందో మోదీ తెలివిగా చెప్పలేదు కానీ, ఇచ్చినమాట ప్రకారం త్వరలోనే అది నెరవేరితే జమ్మూకశ్మీర్ ప్రజలకు మేలు జరుగుతుంది.

'తొలి సవరణ'పై బీజేపీ వక్రభాష్యాలు



రాజ్యాంగానికి జరిగిన తొలి సవరణను వివాదాస్పదం చేయడం ద్వారా చరిత్రను బీజేపీ ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నది. రాజ్యాంగ సవరణ వల్ల వాక్ స్వాతంత్ర్యానికి ఏర్పడిన కొన్ని సహేతుకమైన పరిమితుల గురించి మాత్రమే మాట్లాడుతూ ఆ సవరణ వల్ల ఒనగూరిన ప్రయోజనాలను విస్మరించడం బీజేపీ హ్రస్వదృష్టికి నిదర్శనం. నెహ్రూ విధానాలను విమర్శించడం ద్వారా బీజేపీ ఆంక్షలు లేని వాక్ స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నదని భావిస్తే మనం బొక్కబోర్లా పడినట్లే!

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తొలి రాజ్యాంగ సవరణపై ఓ విచిత్ర వాదనను లేవనెత్తింది. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం వాక్ స్వాతంత్ర్యాన్ని అణచి వేసిందంటూ అదే పనిగా ఆరోపిస్తోంది. నిజానికి బీజేపీ ఎన్నడూ తన పార్టీలో అసమ్మతి గళాలను సహించదన్న, వాటిని నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తుందన్న ఆరోపణ ఉండనే ఉంది. నేడు దేశవ్యాప్తంగా జైళ్లన్నీ నేరస్తులతో గాక అధికార బీజేపీ నియంతృత్వపు పోకడలను ప్రశ్నిస్తున్న విద్యార్థులు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, ప్రతిపక్ష నేతలు కిక్కిరిసి ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి మధ్య– ఆత్మరక్షణలో పడినప్పుడు ఎదురుదాడి చేయడమే ఉత్తమం (అఫెన్స్ ఈజ్ ద బెస్ట్ డిఫెన్స్) అనే వ్యూహాన్ని అనుసరిస్తున్నది బీజేపీ. ఆ క్రమం లోనే భారత రాజ్యాంగానికి నెహ్రూ ప్రభుత్వం చేసిన తొలి సవరణపై అనవసరపు రచ్చకు తెర లేపింది.

1951లో దేశంలో ప్రజలకున్న వాక్ స్వాతంత్ర్యంపై సహేతుకమైన పరిమితులను ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని ప్రధాని నెహ్రూ అనివార్యంగా తీసుకోవాల్సి వచ్చింది. దీనికి తగిన బలమైన నేపథ్యం ఉంది. ఆనాడు న్యాయస్థానాలు కొన్ని తీర్పుల్లో– ఉదాహరణకు, రమేష్ థాపర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ (1950), అదే విధంగా బ్రిజ్ భూషణ్ వర్సెస్ ఢిల్లీ స్టేట్ (1950) వంటి కేసుల్లో ఆర్టికల్ 19(2)లో పేర్కొన్న విధంగా– మతపరమైన హింసను అరికట్టడానికి నిర్దేశించిన చట్టాలు చెల్లుబాటు కావని స్పష్టం చేశాయి. దాంతో, స్వాతంత్ర్యానంతరం ప్రజల మధ్య ఐక్యతను దెబ్బ తీయడానికి జరిగిన విద్వేషపూరిత ప్రసంగాలు, మతపరమైన ప్రచారాలను ప్రభుత్వం నిరోధించ లేకపోయింది. ఈ పరిస్థితిని చూసి, భిన్నాభిప్రాయాలను స్వీకరించే ప్రజాస్వామ్య లక్షణం కలిగిన ప్రధాన మంత్రి నెహ్రూ వ్యక్తిగత స్వేచ్ఛ, సామూహిక భద్రతల నడుమ సమతుల్యతను సాధించాలని ప్రయత్నించారు. ఫలితంగానే, రాజ్యాంగానికి తొలి సవరణ చేశారు. ఆయన దీనిని తన రాజకీయ లబ్ధి కోసం గానీ, విమర్శకుల నోళ్లు మూయించడానికి గానీ ఒక ఆయుధంగా ఎప్పుడూ ఉపయోగించ లేదు.

ఇందుకు పూర్తి విరుద్ధంగా అసమ్మతి పట్ల బీజేపీ అసహనం తీవ్ర స్థాయిలో ఉంటున్నది. సామాజిక కార్యకర్తలను, ఉద్యమ కారులను 'ఉపా' వంటి క్రూరమైన చట్టాల కింద జైళ్లలోకి నెట్టారు. బీజేపీ విధానాలను నిర్మాణాత్మకంగా ఎండగట్టిన పాత్రికేయులు, మీడియా సంస్థలు వేధింపులకు గురయ్యారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైతం ఉపేక్షించలేదు. ఆనాడు నెహ్రూ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన కొన్ని పరిమితులను ఖండిస్తున్న బీజేపీ నేడు ప్రజాస్వామ్యయుతంగా అసమ్మతిని తెలియజేస్తున్న గళాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి ఎటువంటి క్రూర చట్టాలను తెచ్చిందో అందరూ గమనిస్తూనే ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో వాక్ స్వాతంత్ర్యం ఎంతో ముఖ్యం. అయితే, రాజ్యాంగ తొలి సవరణ దానిని సంబంధించి మాత్రమే చేసింది కాదు. తొలి సవరణ పరిధి వాక్ స్వాతంత్ర్య చట్టాలను సవరించడం కంటే మించినది. దేశంలో సమతావాద రాజకీయాలకు అవకాశం కల్పించడానికి దోహదం చేసింది. ప్రధాని నెహ్రూ భూసంస్కరణ చట్టాలు న్యాయవ్యవస్థ ద్వారా చెల్లుబాటు కాకుండా రక్షించడానికి ఆర్టికల్స్ 31ఎ, 31బి, అదేవిధంగా 9వ షెడ్యూల్‌ను ప్రవేశపెట్టారు. ఈ నిబంధనలు జమీందారీ వ్యవస్థను కూలదోశాయి. లక్షలాది రైతులకు భూమిని పునఃపంపిణీ చేయడానికి, అదేవిధంగా భూస్వామ్య వ్యవస్థ విచ్ఛిన్నానికి దోహదం చేశాయి.

ఉదాహరణకు, స్వాతంత్ర్యానంతరం జమీందారీ నిర్మూలన చట్టాలపై భూస్వాముల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురైంది. ఈ చట్టాలను న్యాయస్థానాలలో వారు సవాలు చేశారు. స్టేట్ ఆఫ్ బీహార్ వర్సెస్ కామేశ్వర్ సింగ్ కేసులో బీహార్ భూ సంస్కరణల చట్టం 1950 రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ, రాజ్యాంగం 3వ విభాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతుందన్న కారణంగా న్యాయస్థానం దానిని కొట్టివేసింది. ఇందువల్లనే ఆర్టికల్స్ 14, 19 కింద ఎదురయ్యే న్యాయపరమైన సవాళ్ల నుంచి వ్యవసాయ సంస్కరణలను పరిరక్షించడానికి ఆర్టికల్ 31ఎ ను ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆర్టికల్ 31బి, 9వ షెడ్యూల్ ఇవి రెండూ ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతుందనే కారణంగా కొన్ని నిర్దిష్టమైన చట్టాలను కొట్టివేయకుండా రక్షణ కల్పించాయి. అంతేకాకుండా, ఇవి గతంలో ఉన్నవాటికి కూడా రక్షణ కల్పించాయి. ప్రధాని నెహ్రూ చేపట్టిన ఈ చర్యలు భూస్వామ్య వర్గాల ప్రమేయాన్ని తొలగించి రైతులకు, ప్రభుత్వానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పాయి.

జమీందారీ వ్యవస్థ రద్దుతో దేశంలో పెద్దఎత్తున భూపునఃపంపిణీకి మార్గం సుగమం అయింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ అధీనంలో ఉన్న భూములను, సాగుయోగ్యమైన బంజరు భూములను, ప్రైవేట్ అడవులతో సహా భూమిలేని రైతులకు పునఃపంపిణీ చేశారు. బీహార్ రాష్ట్రంలో '1949 బీహార్ భూ సంస్కరణల చట్టం' కింద ఇటువంటి చర్యలనే చేపట్టారు. సమాజంలో సమానత్వాన్ని సాధించడానికి ఈ భూ సంస్కరణలు చాలావరకు దోహదం చేశాయి. వీటితో పోల్చి చూసినప్పుడు– బీజేపీ ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలపై దేశ వ్యాప్తంగా ఎంత వ్యతిరేకత వచ్చిందో, రైతులు ఎలా రోడ్డెక్కి ఉద్యమించారో అందరం చూశాం. కార్పొరేట్ ప్రయోజనాల కోసమే ఈ చట్టాలు తెచ్చారన్న విమర్శను ఎదుర్కోలేక చివరకు బీజేపీ వాటిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది.

అలాగే రాజ్యాంగానికి జరిగిన తొలి సవరణ ద్వారా ఆర్టికల్ 15(4)ను చేర్చడంతో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించే వీలు కలిగింది. అంతేకాకుండా, చారిత్రక అసమానతలను పరిష్కరించడానికి ఈ రాజ్యాంగ సవరణ ఉపయోగపడింది. మద్రాస్ రాష్ట్రం వర్సెస్ చంపకం దొరైరాజన్ కేసులో ఒక బ్రాహ్మణ అభ్యర్థి తమిళనాడు ప్రభుత్వం మతపరంగా ఇచ్చిన ప్రభుత్వ జీవోను సవాలు చేశాడు. కులం, మతం ఆధారంగా విద్యా సంస్థల్లో సీట్లను తమిళనాడు ప్రభుత్వం కేటాయించడాన్ని ఆ కేసులో ప్రశ్నించాడు. ఇతర కులాల అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు ఉన్నప్పటికీ, పిటిషనర్‌కు ప్రవేశం నిరాకరించబడింది. తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన కమ్యూనల్ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(1), 29(2)లను ఉల్లంఘిస్తోందని, ఇది వివక్షకు తావు లేకుండా ప్రభుత్వ సంస్థల్లో సమాన ప్రవేశానికి ఇచ్చే హామీకి విరుద్ధమని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. కాగా, ఆర్టికల్ 16(4) వెనుకబడిన తరగతులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లను అనుమతిస్తుండగా, విద్యకు సంబంధించి మాత్రం ఆర్టికల్ 15 ప్రకారం అటువంటి నిబంధన అమలులో లేదు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రాజ్యాంగ రక్షణలో గల అంతరాన్ని ఈ చారిత్రాత్మక తీర్పు ఎత్తిచూపింది. ఫలితంగా, ఇది ఆర్టికల్ 15(4)ని చేర్చడానికి దోహదం చేసింది. రిజర్వేషన్లపైనా బీజేపీ వైఖరి ఏమాత్రం సానుకూలంగా లేదు. సామాజిక న్యాయం చేయడానికి విధానాలను సమీక్షించాలని పదేపదే కోరుతున్నప్పటికీ బీజేపీ వాటిని పెడచెవిన పెడుతూ తన సైద్ధాంతిక దివాళాకోరుతనాన్ని ప్రదర్శిస్తోంది.

రాజ్యాంగానికి జరిగిన తొలి సవరణను వివాదాస్పదం చేయడం ద్వారా బీజేపీ చరిత్రను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నది. రాజ్యాంగ సవరణ వల్ల వాక్ స్వాతంత్ర్యానికి ఏర్పడిన కొన్ని సహేతుకమైన పరిమితుల గురించి మాత్రమే మాట్లాడుతూ ఆ సవరణ వల్ల ఒనగూరిన ప్రయోజనాలను విస్మరించడం బీజేపీ హ్రస్వదృష్టికి నిదర్శనం. నెహ్రూ విధానాలను విమర్శించడం ద్వారా బీజేపీ ఆంక్షలు లేని వాక్ స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నదని భావిస్తే మనం బొక్కబోర్లా పడినట్లే! నెహ్రూ ప్రభుత్వం చేసిన తొలి రాజ్యాంగ సవరణను ఆనాడు దేశంలో రైతులకు, బడుగు బలహీన వర్గాలకు, సామాన్యులకు ఫ్యూడల్ శక్తుల నుండి లభించిన విముక్తిగా చూడాలి. బీజేపీ కువిమర్శ చరిత్రను వక్రీకరించడం తప్ప మరొకటి కాదు.

■ కె. రాజు
నేషనల్ కోఆర్డినేటర్
ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విభాగాలు – ఏఐసీసీ

'భారత్‌లో రాయబారం అపురూప గౌరవం'

భారత్‌కు నేను మొట్టమొదట నా కౌమార వయసులో వచ్చాను. ఈ అద్భుత దేశం నా హృదయాన్ని ఎలా చూరగొననున్నదనే విషయమై అప్పుడు నాకు ఎలాంటి భావన లేదు. భారత్‌కు అమెరికా రాయబారిగా నా దౌత్య బాధ్యతలను ముగించనున్న ఈ సమయంలో నా మనసు ఈ దేశం పట్ల కృతజ్ఞతా భావంతో నిండి ఉన్నది. ఎందుకంటే భారత్ నాకు ఎన్నో సమున్నత సత్యాలను నేర్పింది. అంతే కాదు, భారత్, అమెరికాలు కలసికట్టుగా ముందుకు సాగితే మన ఉభయ దేశాలకూ, మన ధరిత్రికి సుస్థిర శాంతి, సదా సమృద్ధ ఐశ్వర్యమూ సమకూరుతాయనే ఆశాభావమూ నాకు అపారంగా ఉన్నది.

అమెరికా రాయబారిగా ఈ అపురూప దేశం నాలుగు దిశలా ప్రయాణించాను. నిరంతర సందడితో ఉండే ముంబై వీథుల నుంచి కోల్‌కతా సాంస్కృతిక కేంద్రాల దాకా, హిమాలయ పర్వతాలు మొదలయ్యే ప్రాంతాలు, అరుణాచల్ ప్రదేశ్ నుంచి దక్షిణాగ్రాన ఉన్న కన్యాకుమారి దాకా నేను పర్యటించాను. ఈ సువిశాల దేశంలో నా పర్యటనలు, సందర్శనలలో ఈ పురానవ జాతి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ముఖ్యంగా అమెరికా, భారత్ కలసికట్టుగా ముందుకు సాగితే ఉభయ దేశాలూ సమస్త జీవన రంగాలలో మరింత మెరుగ్గా ఉండడమే కాకుండా ఈ ధరాతలంపై ఉన్న సకల సమాజాల జీవన స్థితిగతులను భవ్యంగా మార్చగలగడం సాధ్యమవుతుందనే వాస్తవాన్ని గుర్తించాను. ఆ అవగాహన నాలో ప్రగాఢంగా నెలకొంది. అంకెలు ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తున్నాయి : ఇంచుమించు 20,000 కోట్ల డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యంతో అమెరికా భారతదేశ అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్నది; అమెరికాలో మూడు లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు (అమెరికా విశ్వవిద్యాలయాలలోని విదేశీ విద్యార్థులలో భారతీయులే అత్యధికం); వరుసగా రెండో సంవత్సరం భారతీయులకు పది లక్షలకు పైగా వలసేతర వీసాలు జారీ చేయడం జరిగింది; వాతావరణ మార్పు నుంచి మన ధరిత్రిని రక్షించుకోవడానికి దాదాపు 1000 కోట్ల డాలర్ల మేరకు వ్యయపరచడం జరిగింది; ఆరోగ్య భద్రతకు సంబంధించి కలసికట్టుగా 90కి పైగా కొత్త ఔషధాల రూపకల్పన, ఉత్పత్తి ద్వారా ఇంచుమించు ఐదు కోట్ల మంది భారతీయులు లబ్ధి పొందారు. ఈ అంకెలు ఆశ్చర్యకరంగా ఉన్నప్పటికీ మన అసాధారణ స్నేహ సంబంధాల గాథను అవి సంపూర్ణంగా చెప్పేవి ఎంత మాత్రం కావు.



'మనం వర్తమానంలో చేసిన పనులపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది' అని మహాత్మా గాంధీ అన్న మాటలను సదా గుర్తుంచుకోవాలి. శాంతి, సంపద వృద్ధి, ప్రజల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు అనే లక్ష్యాలతో కూడిన ఉమ్మడి దార్శనికత స్ఫూర్తితో మనం కలసికట్టుగా కృషి చేయాలి. భారత్‌లో అమెరికా రాయబారిగా ఉండడం నా జీవితానికి దక్కిన సమున్నత గౌరవంగా భావిస్తున్నాను.


అమెరికా రాయబారిగా భారత్‌కు వచ్చినప్పుడు మన ఉభయ దేశాలు కలసికట్టుగా కృషి చేస్తున్న వివిధ రంగాల విస్తృతి, దాని ప్రాధాన్యం నన్ను అబ్బురపరిచింది. నవీన సాంకేతికతల నుంచి వాణిజ్యం దాకా, మహిళా సాధికారిత నుంచి ఆరోగ్యభద్రత దాకా, ఇండో పసిఫిక్ తీరస్థ దేశాల భద్రత, మహా సాగరాల అగాధాలలో అన్వేషణల నుంచి అంతరిక్షంలో పరిశోధనల దాకా .. ఇంకా ఎన్నో రంగాలలో మనం పరస్పరం సహాయ సహకారాలు అందించుకుంటున్నాం. నేను ఊహించిన దాని కంటే అతి విస్తృతంగా భారత్–అమెరికా సంయుక్త కృషి జరుగుతోంది. మన సంబంధాలలోని నాలుగు కీలక అంశాల– శాంతి, సంపద సృష్టి, ధరిత్రి శ్రేయస్సు, ప్రజల అభ్యున్నతి–లో సంయుక్త కృషి మరింత మెరుగైన ప్రపంచాన్ని, ఉజ్వల భవిష్యత్తును ఎలా నిర్మిస్తుందో నేను ప్రత్యక్షంగా చూశాను.

భారత్‌లో నేను తొలుత అధికారికంగా పర్యటించిన అహ్మదాబాద్‌లో ఆ విశిష్ట కృషి సాధిస్తున్న సమున్నత ఫలితాలను చూశాను. ఆ నగరంలో మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న 'సేవ' అనే స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, నాయకురాళ్లను కలుసుకున్నాను. వారి గాథలు వాతావరణ సంక్షోభం నుంచి ప్రపంచాన్ని పరిరక్షించేందుకు తక్షణ, అంతర్జాతీయ కార్యాచరణ అవసరమనే సత్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. పూణేలోని సీరమ్ ఇనిస్టిట్యూట్‌లో మలేరియా వ్యాక్సిన్ ఉత్పత్తి కార్యకలాపాలను చూశాను, భారతీయ ఔషధ ఉత్పత్తిదారు, అమెరికాలోని జీవ సాంకేతికత కంపెనీ, బ్రిటన్ లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం సమష్టి కృషి ఫలితంగా ఆ వ్యాక్సిన్ ఉత్పత్తి అవుతోంది. మధ్య ఆఫ్రికా దేశం నొక దానికి ఎగుమతి చేయడానికై ఆ వ్యాక్సిన్ల పెట్టెలను ట్రక్కులలో ఎక్కించడాన్ని కూడా నేను చూశాను.

వివిధ సదస్సులలో ఉత్సాహపూరితులైన భారతీయ వ్యాపార, పారిశ్రామికవేత్తల ప్రతినిధి బృందాలను కలుసుకున్నాను. అమెరికాలో వందల కోట్ల డాలర్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు భారతీయ ప్రతినిధి బృందం ఒకటి అమెరికన్ కంపెనీలతో ఒక ఒప్పందానికి రావడం ఎంతైనా ముదావహమైన విషయం. అమెరికా– భారత పౌర విమానయాన రంగ శిఖరాగ్ర సదస్సులో ప్రైవేట్ పౌర విమానయాన సంస్థల నిర్వాహకులను కలుసుకున్నాను. హర్యానాలో ఒక విమానయాన కేంద్రాన్ని అభివృద్ధి పరిచేందుకు 15,000 కోట్ల డాలర్ల విలువైన అమెరికా విమానాలకు వారు ఆర్డర్ ఇచ్చారు.

భారతదేశ విశిష్ట కళాకృతులు, సంస్కృతీ సంప్రదాయాలు నన్ను చాలాకాలం నుంచీ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించేందుకు ఉద్దేశించిన సాంస్కృతిక సంపద ఒప్పందంలో సహ సంతకందారు అయినందుకు నేను అమితంగా గర్విస్తున్నాను. అమెరికాలో క్రికెట్ ఆట వర్ధిల్లేందుకు, అందునా 2028లో నా సొంత ఊరు అయిన లాస్ ఏంజెల్స్‌లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌లో ఆ క్రీడను కూడా చేర్చడానికి దోహదం చేసినందుకు నేను ఎంతగానో సంతోషిస్తున్నాను. ఆలోచనలోను, ఆచరణలోను అమెరికా, భారత్ సంయుక్తంగా కృషి చేస్తే మనం తెరవ లేని ద్వారమంటూ ఉండదు, మనం కలుపుకు పోలేని స్నేహితుడు అంటూ ఉండడు. ఎందుకంటే మనం మరింత ప్రపంచ ప్రజల సమష్టి శ్రేయస్సుకు కృషి చేస్తున్నాము. మన ఉభయ దేశాల సంయుక్త కృషి ప్రపంచ పరిస్థితులను తప్పక మెరుగుపరుస్తుంది.

నా జీవితంలో ఒక అపురూప అధ్యాయాన్ని ముగించబోతున్నాను. ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నది, మనం కలిసికట్టుగా నిర్మించనున్న భవిష్యత్తును కౌమార వయస్సులోని నా మనసు ఊహించి ఉండదు. భవిష్యత్తుపై కాకుండా మన ముందున్న ప్రతిబంధకాలపై దృష్టిని కేంద్రీకరించేందుకై స్వల్ప అపార అభిప్రాయ భేదాలను తొలగించుకునేందుకు ప్రాధాన్యమివ్వడం సహజమే. మనం స్వతస్సిద్ధంగా సమరీతిలో విశ్వసిస్తున్న విలువలు, పాటిస్తున్న సంప్రదాయాలు మన విభేదాల కంటే ముఖ్యమైనవి కనుక అమెరికా – భారత్ స్నేహ సంబంధాల భవిష్యత్తు విషయమై నాకు అపరిమితమైన ఆశాభావం ఉన్నది. మన ముందున్న సవాళ్లు– వాయు కాలుష్య నివారణ, మనలను ఏకం చేసేందుకు, రక్షించేందుకు నవీన సాంకేతికతలను ఉపయోగించుకోవడం, ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పెచ్చరిల్లుతున్న యుద్ధ ప్రమాదాలు మొదలైన వాటిని ఎవరికి వారుగా కాకుండా సమైక్యంగా కృషి చేసినప్పుడు సులువుగా పరిష్కరించుకోగలుగుతాము. 'మనం వర్తమానంలో చేసిన పనులపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది' అని మహాత్మా గాంధీ అన్న మాటలను మనం సదా గుర్తుంచుకోవాలి. శాంతి, సంపద వృద్ధి, ప్రజల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు అనే లక్ష్యాలతో కూడిన ఉమ్మడి దార్శనికత స్ఫూర్తితో మనం కలసికట్టుగా కృషి చేయాలి. ప్రియమైన భారతదేశమా, నీ ఆదర ఔదార్యాలకు, వివేకానికి, అచంచల స్నేహానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ అద్భుత దేశంలో అమెరికా రాయబారిగా ఉండడం నా జీవితానికి దక్కిన సమున్నత గౌరవంగా భావిస్తున్నాను. మన ఉభయ దేశాలు కలసికట్టుగా నిర్మించే అపరూప భవిష్యత్తును చూసేందుకు నేను వేచి ఉండను. భారత్, నా హృదయంలో భారత్ సదా ఉంటూనే ఉంటుంది నిరంతరం వెలుగులు విరజిమ్ముతూనే ఉంటుంది. అనంత ధన్యవాదాలు. కలసి స్థిరంగా ముందుకు సాగుదాం.



• ఎరిక్ గార్సెట్టి
అమెరికా రాయబారి

సర్వ 'ముక్క'లూ సమానమే!

ప్రధాన పండుగలైన భోగి, సంక్రాంతి, కనుమల తర్వాత, తెలుగు ప్రజలందరూ ఈరోజు చిట్టచివరిదైన ముక్కనుమ పండుగతో ఆనవాయితీగా, ప్రతీ సంవత్సరం ఈ సంక్రాంతి ఉత్సవాలను ముగిస్తారు. ఇది అందరికీ తెలిసినదే అయినా, మళ్ళీ ఎందుకు చెప్తున్నానంటే, ఒక చిన్న 'వెజ్ – నాన్‌వెజ్' అనుమానాల నివృత్తి కోసం..!

ఇప్పుడైతే వారం వర్జ్యం వంటివేవీ చూడకుండా ప్రతి రోజూ మాంసాహారం తింటున్నాం గానీ, ఒకప్పటి రోజుల్లో సంక్రాంతి పండుగ మొదటి మూడు రోజులూ– అంటే భోగి, సంక్రాంతి, కనుమ పండుగ రోజుల్లో కేవలం శాకాహారమే భుజించాలి అని ఒక నియమం ఉండేది. ఇది మంచి ఆరోగ్యసూత్రం కూడా అంటారు. ఈ ఉత్తరాయణ మకర సంక్రమణ శీతల కాలంలో, ప్రకృతిలో వచ్చే మార్పుల వలన, సప్త ధాతువుల మిళితమైన మానవ శరీరంలో కూడా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇవి శరీరానికి హాని చేయకుండా ఉండేందుకే ఈ రోజుల్లో ప్రకృతి పరంగా లభించే పండ్లూ, ఇతరత్రా శాకాహారం, ఎక్కువగా మినుములు, నెయ్యి, బియ్యప్పిండి, నువ్వులు... వగైరాలతో చేసే పిండి వంటకాలను తినాలని పెద్దలు చెబుతారు.

మన పురాణాల్లో, శాస్త్రాల్లో లిఖితపూర్వకంగా ఎక్కడా రాసినట్లు లేకపోయినా 'ముక్కనుమ' పండుగ రోజున ఖచ్చితంగా 'ముక్క' తినాలి అన్న మాట క్రమంగా ఎలాగో స్థిరపడింది. ముక్క + కనుమ = ముక్కనుమ అన్న లాజిక్ ప్రకారం ఇది ఒకరకంగా నిజమే అనిపిస్తుంది. అసలు సమస్య ఎక్కడొచ్చిందంటే– ఏ 'ముక్క' అనే దగ్గర! ముక్కనుమలో 'ముక్క' అంటే ప్యూర్ 'నాన్ వెజిటేరియన్' ముక్కే అని మాంసాహారులు వాదిస్తే– 'కాదు.. అది ప్యూర్ వెజిటేరియన్ ముక్కే' అని శాకాహారులు కూడా అంతే గట్టిగా నొక్కి వక్కాణిస్తున్నారు! ఏ 'ముక్క' అయితే ఏముంది, ఎవరికి నచ్చిన ముక్కలను వాళ్లు కోసుకుని వండుకొని కడుపునిండా తిని ఈ ముక్కనుమ అనే పొట్ట పూజా మహోత్సవ మహాపండుగను విజయవంతం చేయవలసిందిగా నా విజ్ఞప్తి!

అంటే, నాన్‌వెజ్ బ్యాచ్ అంతా చికెన్ ముక్కో, మటన్ ముక్కో, చేప ముక్కో, రొయ్య ముక్కో, పీత ముక్కో, కనీసం కోడిగుడ్డు ముక్కో... వగైరా వగైరాలతో; అలాగే వెజ్ బ్యాచ్ అంతా బెండకాయ ముక్కో, బీరకాయ ముక్కో, వంకాయ ముక్కో, సొరకాయ ముక్కో, గుమ్మడికాయ ముక్కో... కనీసం కంద ముక్కో, చిట్టి గారె ముక్కో, పూర్ణం బూరె ముక్కో ఇలా ఏదో ఒక ముక్కతో కలిసిమెలిసి విందు భోజనం ఆరగించండి! ఋగ్వేదం లోని మొదటి అధ్యాయం, నూట అరవై నాలుగో సూక్తం, నలభై ఆరవ శ్లోకము అయిన 'ఏకం సత్ విప్రా – బహుధా వదంతి'కి అర్థం– 'సత్యం అనేది ఒక్కటే, అనేక రీతులుగా పిలువబడుతుంది' అని. ఈ సత్యం మనకు బోధపడితే రుచులు వేరైనా సారం ఒక్కటే అనీ, సర్వ 'ముక్కలూ' సమానమే అనీ అర్థమవుతుంది.

ఐతే లిక్కర్ తాగడం విషయంలో వెజ్ – నాన్‌వెజ్‌లకు అతీతంగా సర్వసమైక్య భావం పాటించే 'మందు'బాబులు పైన పేర్కొన్న ఏ ముక్కల్నీ మంచింగ్ సరుకుగా మార్చి మందు తాగవద్దనీ, తద్వారా లివర్‌ను కాపాడుకోమనీ కూడా విజ్ఞప్తి చేస్తూ, అలాగే వారి జీవితాలకు వారు 'ఏక్టివ్'గా పొగ పెట్టుకోవడమే కాకుండా, పక్కవారి జీవితాలకు కూడా 'పాసివ్'గా పొగ పెడుతూ, అందర్నీ మెల్లగా చంపుతున్న మన స్మోకింగ్ బాబులు కూడా సిగరెట్లకు దూరంగా ఉండాలని కోరుకుంటూ... ఈ 'ముక్కనుమ' పండుగతో ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ ఉత్సవాలకు వీడ్కోలు పలుకుతూ... సర్వేజనా సుఖినోభవంతు!


– పెన్మెత్స రవిప్రకాష్ అశోకవర్మ
శృంగవరం

ప్రగతిబాటలో పంచాయతీలు...!

గత ప్రభుత్వ నిరాదరణతో విలవిలలాడిన గ్రామ పంచాయితీలను ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించే ప్రయత్నాలు ప్రారంభించింది. నిధుల దారి మళ్ళింపుతో నీరసపడ్డ పంచాయతీలను నిటారుగా నిలబెట్టే సన్నాహాలు జరుగుతున్నాయి. ఐదేళ్ళు కునారిల్లిన మన పంచాయతీలు నేడు జాతీయ స్థాయిలో ఏకంగా నాలుగు అవార్డులు సాధించటం గమనార్హం. పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ దార్శనికతతో గ్రామాల్లో అభివృద్ధి, ఉపాధి హామీ, ఉద్యోగ పాలన, నిధుల నిర్వహణ, జవాబుదారీతనం, పారదర్శకతలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆయన తన పరపతితో కేంద్రం నుంచి గ్రామ పంచాయితీలకు నిధులను సమీకరించటంతో పాటు, ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతూ, ప్రజల లోనే ఉంటూ గ్రామీణ ముఖచిత్రంపై తనదైన ముద్ర వేస్తున్నారు.

గత పాలకులు 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్ళించి గ్రామాల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసారు. ఫలితంగా పంచాయితీల ప్రాథమిక విధులైన మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సౌకర్యాలు అందించటం కూడా కష్టమైంది. బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితికి గ్రామపాలన దిగజారింది. పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకున్నాక 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయితీల ఎకౌంటుకు చేరేలా చర్యలు తీసుకున్నారు. గత పాలకులు ఉపాధి హామీ పథకం కోసం వచ్చిన నిధుల్ని కూడా సరిగా వినియోగించలేదు. ఈ నిధుల్ని ఉపాధి కోసం కంటే సచివాలయ భవనాల నిర్మాణాలకే ఎక్కువ ఖర్చుపెట్టారు. ఉపాధి పని దినాల సంఖ్యను పెంచే ప్రయత్నాలేమీ చేయలేదు. ఈ పథకంలో అవినీతి నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన సోషల్ ఆడిట్ అధికారులు కూడా పీకల్లోతు అవినీతిలో కూరుకు పోయారు. ఉపాధి హామీ కోసం ఇప్పుడు పవన్ కళ్యాణ్ కేంద్రం నుంచి రూ.4500 కోట్లు సాధించగలిగారు. ఆ నిధులతో 87 రకాల పనులు, 9 కోట్ల పనిదినాలు, 54 లక్షల కుటుంబాలకి ఉపాధి కలిగించే నిర్ణయం చేసారు. సోషల్ ఆడిట్‌లో అవినీతి జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా పంచాయితీ రాజ్ శాఖ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చెయ్యటం కోసం గత ఆగస్టు 23న రాష్ట్రం లోని 13,326 గ్రామసభల్ని ఒకే రోజు నిర్వహించి రికార్డు నెలకొల్పటం చూస్తే ప్రభుత్వం ఆ పథకానికి ఇస్తున్న ప్రాధాన్యత ఏమిటో అర్థం అవుతుంది. దీంతో పాటు గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే, ఇతర జాతీయ పండుగల కోసం ఇచ్చే నిధుల్ని గణనీయంగా పెంచారు.

పల్లె పండుగ, విజిబుల్ వర్క్స్, PR(1) యాప్ ద్వారా గ్రామాల్లో అవస్థాపన పనులతో పాటు, సేవల నాణ్యతను పెంచడానికి సంకల్పించారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రాబోయే సంక్రాంతి లోపు సిమెంట్ రోడ్లు, ప్రహరీలు, కమ్యూనిటీ బిల్డింగులు పూర్తి చెయ్యాలని నిర్ణయించారు. అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు క్రమం తప్పకుండా మంచినీటి క్లోరినేషన్, ట్యాంక్‌లు శుభ్రం చెయ్యడం, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ వంటి పనుల్ని ప్రతి రోజూ ప్రభుత్వానికి నివేదించటానికి PR(1) యాప్ ప్రారంభించారు. దీనివల్ల అధికారులు ప్రతి రోజూ ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చెయ్యాల్సి ఉంటుంది. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు ప్రజలకి తెలియజేసే విధంగా విజిబుల్ వర్క్స్‌లో భాగంగా బోర్డుల మీద ప్రదర్శించాలనే నిబంధన ఏర్పాటు వల్ల పాలనలో పారదర్శకత పెరుగుతున్నది.



నాయకులకి రాజకీయ నిబద్ధత, పట్టుదల ఉంటే అభివృద్ధి సాధించవచ్చునని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ శాఖలో జరుగుతున్న ప్రగతి నిరూపిస్తున్నది. ఉన్న పరిధుల్లోనే సాధ్యమైనంత ప్రగతి సాధించాలనే పవన్ కళ్యాణ్ తపన గ్రామాల పునర్నిర్మాణానికి ఎంతో సాయపడుతున్నది.

గ్రామాల్లో మంచినీటి సమస్యను అధిగమించి, రక్షిత మంచినీటిని అందించటంపై పవన్ కళ్యాణ్ దృఢ సంకల్పంతో ఉన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలకి కనీసం మంచినీళ్ళు ఇవ్వలేకపోవటాన్ని ఆయన అనేక సార్లు ప్రస్తావించారు. ఆయన ఇటీవల ఉత్తర అంధ్రాలోని ఏజెన్సీ, ఆదివాసీ గ్రామాల్లో పర్యటించినప్పుడు కూడా ఇదే ప్రధానాంశంగా ముందుకి వచ్చింది. ఇప్పటివరకు మంచి నీరు అందని ప్రతి ఇంటికీ జలజీవన్ మిషన్‌లో భాగంగా రక్షిత మంచినీటి సరఫరా అందించటం కోసం కుళాయిల్ని ఏర్పాటు చెయ్యటానికి ప్రభుత్వం నిర్ణయించటం ఒక శుభ పరిణామం.

పంచాయితీ ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీల్లో అవకతవకలు, అవినీతి ఒక ఆచారంగా మారిపోయింది. అస్మదీయులకే ప్రమోషన్లు, కోరుకున్న చోటుకి బదిలీలు. అందువల్ల అర్హులైన ఉద్యోగులకి అన్యాయం జరిగేది. ఈ పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెడుతూ పవన్ కళ్యాణ్ ప్రతి నెల సీనియారిటీని బట్టి ప్రమోషన్లు ఆటోమేటిక్‌గా జరిగిపోయే విధంగా మార్పులు తెచ్చారు. గతంలో పంచాయతీ రాజ్ శాఖలోని జిల్లా పరిషత్ సిఈఓ, డీఆర్‌డీఏ, డ్వామా విభాగాల్లో ఉన్నత స్థానాల్లో రెవెన్యు శాఖ అధికారులు డిప్యుటేషన్‌పై చేరి పెత్తనం చేసేవారు. పవన్ కళ్యాణ్ ఆ పద్ధతికి స్వస్తి పలికి మాతృ శాఖలోని సీనియర్లకే అర్హతల్ని బట్టి అవకాశాలు వెళ్ళేలా చర్యలు చేపట్టారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పారిశుద్ధ్య కార్మికులకి సన్మానం చెయ్యాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించటం విప్లవాత్మకమని చెప్పాలి. అయితే గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు ఆరు వేల రూపాయలలోపే ఉంటున్నాయి. అవి కూడా గ్రామంలో నిధులు ఉంటేనే ఇస్తారు. లేకపోతే ఎన్ని నెలలైనా వాళ్ళు ఇబ్బందులు పడాల్సిందే! ప్రజారోగ్య రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషించే ఈ విభాగంలో పనిచేసే సిబ్బందికి కనీస వేతనం నెలకు పదిహేను వేల వరకూ పెంచాల్సిన అవసరం ఉందని అనేక స్వచ్ఛంద సంస్థలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. అయినా ఆ దిశగా అడుగులు పడటం లేదు. పాలకులు దృష్టి సారించాలి. అనేక సంవత్సరాల నుంచి సమస్యల్లో కూరుకుపోయి ఉన్న ఒక వ్యవస్థని రాత్రికి రాత్రే స్వర్గంగా మార్చటం సాధ్యం కాకపోవచ్చు. కానీ ఉన్న పరిధుల్లోనే సాధ్యమైనంత ప్రగతి సాధించాలనే పవన్ కళ్యాణ్ పట్టుదల, తపన మన గ్రామాల పునర్నిర్మాణానికి ఎంతో సాయపడుతున్నది.

○ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ





కోట్లాట..!

ఉమ్మడి కృష్ణాలో రూ.400 కోట్లకు కోడి పందేలు

పండుగ మూడు రోజులూ పందెంకోళ్లదే హవా

- జిల్లా అంతటా భారీగా వెలిసిన బరులు
- పేకాట, గుండాటకు కూడా ప్రాధాన్యం
- అంపాపురం హైటెక్ బరిలో కాసులే కాసులు
- కిక్కిరిసిన బరులు.. పట్టని పోలీస్ ఆంక్షలు
- రాత్రి సమయాల్లోనూ జోరుగా జూదం
- చాలాచోట్ల ఇరువర్గాల ఘర్షణ, దాడులు
- యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- గత ఏడాదితో పోలిస్తే కాస్త తక్కువే..

ఎనికేపాడు బరిలో ఆసక్తికరంగా సాగుతున్న కోడిపందేలు (ఇన్‌సెట్‌లో) గుడ్లవల్లేరు బరిలో పందేలు వేస్తున్న మహిళలు

కోళ్ల కాళ్లు దువ్వాయ్.. నోట్ల 'కట్టలు' తెంచుకున్నాయ్.. రూ.కోట్లు పైకెగిరాయ్.. సంబరాల సంక్రాంతి మూడు రోజులూ పందెంకోళ్లే హవా సాగించాయ్. మూడుముక్కలాటలు ముచ్చటగా జరిగాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని చాలాప్రాంతాల్లో పండుగ మూడురోజులు కలిపి రూ.400 కోట్లకు పైగా కోడిపందేలు, ఇతరత్రా జూదాలు నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పందేలు కాస్త తక్కువగానే జరిగినప్పటికీ ఈసారి హైటెక్ బరులు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు బరులను నిలిపివేయాలని పోలీసులు ఆంక్షలు విధించినా.. ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. చాలాచోట్ల ఇరువర్గాలు ఘర్షణలకు దిగగా, మందుబాబులు రూ.30 కోట్ల మద్యాన్ని తాగేశారు.



రామవరప్పాడు బరిలో కిక్కిరిసిన జనం



ఎనికేపాడు బరి వద్ద ముక్కలాట



రామవరప్పాడు బరి వద్ద కోలాహలం



మూడు రోజులు రూ.30 కోట్ల మద్యం

మూడు రోజులపాటు మందుబాబులు మొత్తం రూ.30 కోట్ల మద్యాన్ని తాగేశారు. ఉమ్మడి జిల్లాలో మద్యం వ్యాపారులు ఈనెల 11వ తేదీన డిపోల నుంచి రూ.8.46 కోట్లు, 12న రూ.7.41 కోట్లు, 13న రూ.16.59 కోట్ల సరుకును షాపులకు తరలించారు. 14వ తేదీ మధ్యాహ్నం వరకు రూ.4.50 కోట్ల విలువైన మద్యం కొన్నారు. కనుమ రోజున సెలవు కావడంతో మూడు రోజులకు సరిపడా 14వ తేదీ సాయంత్రానికే సమకూర్చుకున్నారు.

ఆంధ్రజ్యోతి మచిలీపట్నం/విజయవాడ : బాపులపాడు మండలంలోని అంపాపురంలో హైటెక్ హంగులతో కోడిపందేలు, పేకాట శిబిరాలు మూడు రోజుల పాటు జరిగాయి. ఒక్కో పందెం రూ.3 లక్షలకు తక్కువకాకుండా వేశారు. పెద్దబరుల్లో ఒక్కో కోడిపందెం రూ.10 లక్షలకు తక్కువ కాకుండా నిర్వహించారు. అంపాపురంలో ఏర్పాటుచేసిన శిబిరానికి తెలంగాణ నుంచి అధికంగా తరలివచ్చారు. దీంతో విజయవాడ-ఏలూరు జాతీయ రహదారిపై కార్లు బారులు తీరి కనిపించాయి. కాగా, చాలామంది ఈసారి భీమవరం వైపు వెళ్లారు. దీంతో ఏటా రూ.30 కోట్ల వరకూ జరిగే పందేలు ఈసారి రూ.20 కోట్లకే పరిమితమయ్యాయి. గుండాట శిబిరాల వద్ద మహిళలు అధిక సంఖ్యలో పందేలు కాశారు. నగదు రూపంలో కాకుండా టోకెన్లు అందించి మరీ పందెపురాయుళ్లను అనుమతించారు. బుధవారం వరుసగా ఐదు పందేలు గెలిచిన బాబీకి నిర్వాహకులు బుల్లెట్‌ను బహుమతిగా అందజేశారు. రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో భారీగా బరులు ఏర్పాటు చేశారు.

- జగ్గయ్యపేట, బూదవాడ, గరికిపాడుతో పాటు వత్సవాయి, పెనుగంచిప్రోలు, తిరువూరులో ఈసారి భారీగా బరులు ఏర్పాటు చేశారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురంలోని పాములకాల్వ చుట్టుపక్కల ఐదారు బరులను ఏర్పాటు చేశారు. నగరంలోని కబేళా, పటమటలంకలో కూడా బరులు వెలిశాయి.
- గుడివాడ నియోజకవర్గంలో మూడు రోజులుగా కోడి పందేలు, పేకాట శిబిరాలు జరిగాయి. గుడివాడలోని గౌతమ్ స్కూల్ వెనుక, బొమ్ములూరులో, నందివాడ మండలం నందివాడ, పుట్టగుంట, పోలుకొండ, రుద్రపాక శివారు గొల్లగూడెం, తమిరిశలో కోడి పందేలు, పేకాట నిర్వహించారు.
- మచిలీపట్నంలోని రుద్రవరం బరిలో కోడి పందేలు సక్రమంగా నిర్వహించడం లేదని పోలాటితిప్ప గ్రామానికి చెందినవారు ప్రశ్నించారు. ఇరువర్గాలు కొట్లాడుకున్నా పోలీసులు కన్నెత్తి చూడలేదు. మేకావానిపాలెం, శ్రీనివాసనగర్, గోకవరం బరుల వద్ద పెద్ద ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహించారు. పేకాట కోసం ప్రత్యేకంగా గదులు ఏర్పాటుచేసి రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున టోకెన్లు మిగతా 6లో..



ఎనికేపాడులో ఫోన్ పే కు నగదు ఇచ్చే కౌంటర్

షేర్‌మహ్మద్‌పేట బరిలో వివాదం

రెండు వర్గాల మధ్య తన్నులాట

- పోలీసుల ఘర్షణలో టీడీపీ నేతకు గాయాలు
- ఆసుపత్రి వద్ద ఆందోళన చేసిన కార్యకర్తలు
- బుజ్జగించిన ఎమ్మెల్యే సోదరులు

జగ్గయ్యపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట సమీపంలో షేర్‌మహ్మద్‌పేట బరిలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం పెద్దదిగా మారి ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో అధికార పార్టీ నేతలు బరి ఏర్పాటు చేశారు. మంగళవారం బరికి వచ్చిన గ్రామానికి చెందిన ఎస్టీలపై పందెం నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. అప్పుడు చిల్లకల్లు పోలీసులు వారిని చెదరకొట్టారు. ప్రతీకారంగా ఎస్టీ వర్గీయులు బుధవారం బరి వద్దకు వచ్చి నిర్వాహకులపై దాడి చేశారు. దీంతో నిర్వాహకులు సమీపంలోని టీడీపీ నేత వీరకృష్ణకు చెందిన రెస్టారెంట్‌లో దాక్కున్నారు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్సై టీ.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి టీడీపీ నేత రెస్టారెంట్‌కు వెళ్లి దాడికి కారణమైన వారిని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వారిని టీడీపీ నేత అనుచరులు అడ్డుకోవటంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ సమయంలో టీడీపీ నేత వీరకృష్ణ తలకు గాయమైంది. ఆయన స్పృహతప్పి పడిపోయారు. పోలీసులు జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సీతారాంపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈలోగా టీడీపీ నేత వీరకృష్ణ అనుచరులు ఆసుపత్రి వద్దకు చేరుకుని తమ నేతపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకుని ఆసుపత్రికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఆయన సోదరుడు శ్రీరాం చినబాబులు కార్యకర్తలను బుజ్జగించారు. వివాదం సద్దుమణిగినా షేర్‌మహ్మద్‌పేటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పాములకాల్వ బరి వద్ద ఉద్రిక్తత

రెండు వర్గాల మధ్య ఘర్షణ

ఎస్ఐపై తిరగబడిన జక్కంపూడి వాసులు

విజయవాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అంబాపురంలోని పాములకాల్వ వద్ద ఏర్పాటుచేసిన కోడిపందేల బరుల వద్ద బుధవారం రాత్రి ఉద్రిక్తత ఏర్పడింది. జక్కంపూడికి చెందిన కొంతమందితో పాటు కొందరు యూట్యూబర్లు.. పోలీసు అధికారిపై తిరగబడటంతో గొడవ మరింత పెద్దదైంది. వివరాల్లోకి వెళితే.. పాములకాల్వ వద్ద బరి వద్దకు బుధవారం రాత్రి జక్కంపూడి గ్రామానికి చెందిన కొంతమంది వచ్చి గొడవ చేశారు. బైక్ పార్కింగ్ విషయంలో వివాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. నిర్వాహకులకు, జక్కంపూడికి చెందిన వ్యక్తులకు గొడవై ఒకరినొకరు తోసుకోవడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కొత్తపేట ఎస్ఐ హరిప్రసాద్ లాఠీకి పనిచెప్పారు. దీంతో జక్కంపూడికి చెందిన వ్యక్తులు ఆయనపై తిరగబడ్డారు. ఆయన్ను తోసే ప్రయత్నం చేశారు. ఎస్ఐపై తిరగబడిన వారికి కొంతమంది యూట్యూబర్లు కూడా వత్తాసు పలికారు. కాగా, ఎస్ఐపై తిరగబడిన విషయాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.కాగా, ఎస్ఐపై తిరగబడిన విషయాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

కాసుల మాటున కట్టడాలు

భవానీపురంలో అనుమతి లేకుండా భారీ నిర్మాణాలు

- వీఎంసీకి వీఎల్ ట్యాక్స్ కట్టరు.. ప్లానూ తీసుకోరు
- 3 వేల గజాల్లో భారీ షెడ్లు, పదుల సంఖ్యలో నిర్మాణాలు
- తొలుత నోటీసులు.. ఆ తర్వాత అనధికార ఆమోదం
- వీఎంసీ ఖజానాకు రూ.కోట్లలో నష్టం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సామాన్యులు ఇల్లు కట్టుకుంటే సవాలక్ష నిబంధనల పేరుతో అవాంతరాలు సృష్టించే వీఎంసీ అధికారులు బడాబాబులకు మాత్రం ఎలాంటి అనుమతులు లేకున్నా భారీ నిర్మాణాలకు అనధికార అనుమతులు ఇచ్చేస్తున్నారు. వీఎంసీ అధికారుల తీరుతో ఖజానాకు భారీగా గండి పడుతోంది. దీనికి నిదర్శనమే భవానీపురం మార్బుల్ ఎస్టేట్ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా శరవేగంగా వెలుస్తున్న నిర్మాణాలు. ఈ అడ్డగోలు నిర్మాణాల కారణంగా వీఎంసీ ఖజానాకు సుమారు రూ.కోటికిపైగా గండి పడుతోంది.

- సుమారు 3వేల గజాల్లో కొద్దిరోజుల క్రితం భారీ షెడ్డును నిర్మించడం ప్రారంభించారు. దీన్ని గుర్తించిన వీఎంసీ అధికారులు గత ఏడాది డిసెంబరు 11న ఆ యజమానికి నోటీసులు ఇచ్చారు. దీంతో రెండు రోజులపాటు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత షరా మామూలుగా పనులు మొదలుపెట్టి పూర్తిచేసి చక్కగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేసుకుంటున్నారు. ఈ నిర్మాణదారుడు ఖాళీ స్థలం పన్ను కానీ, వీఎంసీ నుంచి ప్లాన్ కానీ తీసుకోకుండానే ఈ భారీ నిర్మాణాన్ని పూర్తి చేసేయడం గమనార్హం. తొలుత నోటీసులు ఇచ్చిన వీఎంసీ అధికారులు ఆ తర్వాత ఏ కారణంతో ఆ భారీ నిర్మాణం పూర్తికావడానికి సహకరించారన్నది ప్రశ్న.
- సర్వే నెంబరు 10లోనే ఇద్దరు వ్యక్తుల పేరుతో 600 గజాల చొప్పున రెండు ప్లాట్లు ఉన్నాయి. మొత్తం 1,200 గజాల్లో భారీ షెడ్డును నిర్మిస్తున్నారు. వీరికి కూడా గత ఏడాది డిసెంబరులో వీఎంసీ అధికారులు నోటీసులిచ్చారు. తక్షణం నిర్మాణ పనులు ఆపేయాలని అందులో కోరారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ప్రస్తుతం అక్కడ భారీ గోదాము నిర్మాణం పూర్తిచేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగిపోతున్నాయి. మార్బుల్ ఎస్టేట్ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాలన్నింటి పరిస్థితి ఇంతేనని, వీఎంసీ అధికారులు, భూయజమానులు కుమ్మక్కై ఖజానాకు భారీగా గండికొడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భవానీపురంలో పూర్తయిన షెడ్డు నిర్మాణం



ఖజానాకు గండి కొట్టేదిలా..

ఖాళీస్థలంలో ఏదైనా నిర్మాణం చేపట్టినప్పుడు ముందుగా వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్‌ను చెల్లించాలి. దీన్ని అక్కడ ఉన్న భూమి విలువలో 0.5 శాతంగా నిర్ణయించి, మూడు సంవత్సరాలకు కట్టించుకుంటారు. ఉదాహరణకు భవానీపురంలో ప్రభుత్వ విలువ గజం రూ.30 వేలు ఉందనుకుంటే, 3 వేల గజాలకు మొత్తం భూమి విలువ రూ.9 కోట్లుగా నిర్ణయించి అందులో 0.5 శాతం అంటే రూ.4.50 లక్షలను వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్‌గా నిర్ణయిస్తారు. ఏడాదికి రూ.4.50 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.13.50 లక్షలు చెల్లించాలి. ఆ తర్వాత ప్లాన్‌కు నిర్దేశిత రుసుం చెల్లించి ఆమోదం పొందాలి. మొత్తం మీద రూ.30 లక్షల వరకు వీఎంసీకి ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం మార్బుల్ ఎస్టేట్ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాల నుంచి వీఎంసీకి సుమారు రూ.కోటి పైచిలుకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని, కానీ వీఎంసీ అధికారుల లాలూచీ వ్యవహారంతో ఆ మొత్తానికి గండి పడిందనే ఆరోపణలు ఉన్నాయి.

తూర్పు బైపాస్‌పై సందిగ్ధం

- కేంద్ర నిర్ణయంపై ఎంపీ బాలశౌరికి విజ్ఞప్తుల వెల్లువ
- పవన్ దృష్టికి తీసుకెళ్లే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు ప్రాజెక్టుపై అంతర్మథనం నెలకొంటోంది. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్తు) ఈ ప్రాజెక్టు అవసరం లేదని చెప్పటంతో అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు, తూర్పు బైపాస్‌కు లింకు పెట్టడం కూడా ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజల్లో అసంతృప్తిని రగిల్చింది. ఈ విషయం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వరకు చేరింది. ఆయనకు ప్రజల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే బందరుకు రావాల్సిన ఆయిల్ రిఫైనరీ రామాయపట్నం తరలివెళ్లడం, మరికొన్ని కేంద్ర సంస్థలు కూడా వెళ్లిపోవడం, మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ పరిస్థితి కూడా అనిశ్చితిగా ఉన్న పరిస్థితుల్లో తూర్పు బైపాస్ రోడ్డు భవితవ్యం కూడా డోలాయమానంలో పడటం ఎంపీకి ఇబ్బందికరంగా మారింది. దీంతో ఎంపీ బాలశౌరి ఈ అంశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి.. ఆయన ద్వారా అధిష్ఠానానికి విన్నవించుకోవాలని చూస్తున్నారు. త్వరలో డిప్యూటీ సీఎంను కలవనున్నారు.



నగరం నిర్మానుష్యం

సంక్రాంతి సెలవులకు చాలామంది సొంతూర్లకు వెళ్లడంతో నగరం నిర్మానుష్యంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఏలూరురోడ్డు ఇలా బోసిపోయింది.



రామవరప్పాడు బరి వద్ద ఉద్రిక్త వాతావరణం



ఎనికేపాడు బరిలో జోరుగా గుండాట



బరుల వద్ద భారీగా వాహనాలు

బరిలో.. కోడ్ఢీ!

» భారీగా కోడి పందేలు, జూదాలు
» కోట్లలో చేతులుమారిన నగదు

ప్రేక్షకుల్లా.. పోలీసులు!



పుంజులో సై అంటూ బరిలోకి..







కంచికచర్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నందిగామ డివిజన్ పరిధిలో సంక్రాంతి మూడు రోజులు భారీగా కోడి పందేలు క్యాసినో తరహాలో జూదాలు జరిగాయి. రూ.కోట్లలో నగదు చేతులు మారింది. ఇంతకు ముందెన్నడూ ఈ స్థాయిలో పందేలు జరగలేదు. జాతీయ రహదారి పక్కన బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. నందిగామ నుంచి రాష్ట్ర సరిహద్దు గరికపాడు వరకు జాతీయ రహదారి పక్కన పదికి పైగా బరులు ఏర్పాటు చేశారు. పెనుగంచిప్రోలు, గరికపాడు, కంచికచర్ల మండలం గండేపల్లి, చందర్లపాడు, షేర్‌మహ్మద్‌పేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా టెంట్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి రేయింబవళ్లు క్యాసినో తరహాలో జూదం నిర్వహించారు. ఎక్కడికక్కడ నేతల కనుసన్నల్లో పేకాట, గుండాట ఇతర జూదాలు జరిగాయి. జూదరులకు ప్రత్యేక వసతి సదుపాయాలతో పాటు మందు, మాంసాహార భోజనాలు ఏర్పాటు చేశారు. పందేలకు మాట్‌లు, టేబుళ్లతో సహా అన్ని రకాల ఏర్పాట్లకు నిర్వాహకులు రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఖర్చు చేశారంటే జూదం ఏస్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. రూ.కోట్లలో నగదు చేతులు మారింది.

డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నాం.. బరులు తొలగించాం.. నిర్వాహకులకు నోటీసులిచ్చాం.. జూదం, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చేసిన హెచ్చరికలు ఎప్పటిలానే ప్రకటనలకే పరిమితమయ్యాయి. మూడురోజులు పోలీసులు పందేల జోలికి రాలేదు. కొందరు అధికారులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. గతానికి భిన్నంగా పెద్దఎత్తున కోడిపందేలు, జూదం జరిగాయి. పలు శిబిరాల్లో బుధవారం రాత్రి కూడా జూదం నడిచింది.

కాసులు కురిపించిన సంబరాలు

మూడురోజుల పాటు పేటలో జనం జాతర
తెలంగాణా నుంచి భారీగా పందెంరాయుళ్లు

జగ్గయ్యపేట : సంక్రాంతి సంబరాలు కూటమి నేతలకు కాసులు కురిపించాయి. ఎక్కడికక్కడ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి భారీగా కోడిపందేలు, జూదం నిర్వహించి కాసులు దండుకున్నారు. పండుగ ముందు రోజువరకు బరులను ధ్వంసం చేసిన పోలీసులు తర్వాత ఆవైపే చూడలేదు. జగ్గయ్యపేట నియోజకవర్గం ఆంధ్రా, తెలంగాణా ప్రాంతం సరిహద్దుగా ఉండటంతో జనం జాతరలా తరలివచ్చారు. గరికపాడు, బూదవాడ, జాతీయరహదారిపై తిరుమలగిరి వద్ద, వత్సవాయి, లింగాల, మంగోల్లు ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేశారు. పంచాయతీ సర్పంచ్‌లు, అధికార పార్టీ నేతలు బరుల నిర్వాహకులకు అన్ని రకాలుగా సహకరించారు. పోలీసులు సివిల్‌లో ఉండి ఎక్కడికక్కడ నిర్వాహకులకు ఇబ్బందులు కలగకుండా, ఘర్షణలు జరగకుండా పర్యవేక్షించటం విశేషం. లోపాయి కారీ ఒప్పందాలతో బరులు అధికార పార్టీ నేతలకు సిరులు కురిపించాయి.

తిరునాళ్లను తలపించిన 'అంపాపురం'

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రాష్ట్రంలోనే పెద్దబరిగా గుర్తింపు పొందిన అంపాపురం కోడిపందేలు, జూదం చూడటానికి, ఆడటానికి వచ్చే వారితో తిరునాళ్లను తలపించింది. బాపులపాడు మండలం బిళ్లనపల్లి, వేలేరు, సింగన్నగూడెం, తిప్పనగుంట తదితర గ్రామాల్లో మూడురోజుల పాటు కోడిపందేలను నిర్వహించారు. కోడిపందేల్లో కోట్లాది రూపాయల నగదు చేతులు మారింది. మందుబాబుల కోసం ప్రత్యేక కౌంటర్లతో పాటు అక్కడే కూర్చుని సేవించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అంపాపురం బరిలో లక్షల్లో నిర్వహించిన కోడిపందేలు, జూదంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. పోలీసులు ఎక్కడా కానరాకపోవడంతో గ్రామాల్లో బరుల్లోనూ నోట్ల వరద పారింది. జాతీయ రహదారి పక్కన సర్వీస్ రహదారి కార్లతో నిండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బిళ్లనపల్లి శివారులోని బరిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ పడేయడంతో ఎండిపోయిఉన్న ఆయిల్‌పామ్ మట్టలు అంటుకుని మంటలు చెలరేగాయి. పందెపురాయుళ్లు కోళ్లతో పరుగులుపెట్టారు. పొగ కమ్మేయడంతో నిర్వాహకులు నీటి ట్యాంకర్లతో మంటలను అదుపుచేశారు.

కోస మాంసానికి భలే గిరాకీ



పందెంలో కత్తులు కట్టుకుని ప్రత్యర్థితో హోరాహోరీగా పోరాడిన కోడి పుంజులు విజయంతో తమ యజమానికి ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. ఆదే కోడి ఓడినా ధర రూ.వేలల్లో ఉంటుంది. పందెంలో ఓడి చనిపోయిన పుంజు మాంసాన్ని 'కోస' అంటారు. సంక్రాంతి మూడు రోజుల్లో ఒక్కసారైనా కోస మాంసం రుచిచూడాలని పందెపురాయుళ్లతో పాటు అధికారులు, అనధికారులు ఎదురుచూస్తుంటారు. జీడిపప్పు, బాదం, పిస్తా వంటి బలవర్ధకమైన ఆహారంతో పాటు రోజూ వ్యాయామం చేయించడంతో 'కోస' మాంసానికి అంతటి గిరాకీ ఏర్పడిందని పందెపురాయుడు అంటున్నారు. కోస మాంసం కిలో రూ. 5వేలకు పైగా ధర పలికింది. అయినా కోస అందట్లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పందెం కోడి బతికినా, చచ్చినా ఆదాయమె అంటున్నారు పెంపకం దారులు.

మామిడి తోటల్లో పందేల కోలాహలం

తిరువూరు : సంక్రాంతి సాంప్రదాయం ముసుగులో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో భారీస్థాయిలో కోడిపందేలు, కోసు, గుండాట జూదాలు జోరుగాసాగాయి. మామిడి తోటల్లో మూడురోజులుగా భారీ స్థాయిలో కోసా నిర్వహించారు. కోడిపందేల బరులతో పాటు పేకాట శిబిరాలవద్ద రూ.లక్షల్లో చేతులు మారాయి. తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో శిబిరాల వద్దకు దూరప్రాంతాలకు చెందిన పందెంరాయుళ్లు వసతి ఏర్పాటు చేసుకొని మరి పందేల్లో పాల్గొన్నారు. కొన్నిచోట్ల రాత్రి సమయాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిరాటంకంగా సాగాయి. తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు తరలిరావడంతో పందేలు లక్షల్లోకి చేరుకున్నాయి. మద్యం, గుట్కాలు అధిక ధరకు విక్రయించారు. కోడిపందేల్లో జేబు దొంగలు రెచ్చిపోయారు. నగదుతో పాటు, సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి.

పామర్రు : పామర్రు పరిధిలో కోడి పందేలు, పేకాట, ఇతర జూదలు యథేచ్ఛగా సాగాయి. గుడివాడ రోడ్డులోని కొత్తూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బరుల్లో జూదాలు నిర్వహించారు. భారీస్థాయిలో నగదు చేతులు మారింది. విచ్చలవిడిగా మద్యం, గూట్కాల విక్రయాలు జరిగాయి. అధికార పార్టీ నేతలకు పందేల రూపంలో కాసులు కురిపించాయి. ఎక్కడికక్కడ ఆహార పదార్థాల ధరల మోత



సమష్టి దివ్యబలిపూజ సమర్పిస్తున్న బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

బ్రదర్ జోసఫ్ తంబి ధన్యజీవి

- బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

» ఘనంగా ముగిసిన జోసఫ్ తంబి తిరునాళ్లు

ఉంగుటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరుమండలం, పెదఅవుటపల్లిలోని ప్రసిద్ధ కతోలికా పుణ్యక్షేత్రంలో మూడురోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్ల మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు ఉత్సవాలకు విజయవాడ మేత్రాసనం పీఠాధిపతులు(బిషప్)తెలగతోటి జోసఫ్ రాజారావు ప్రధాన గురువులుగా హాజరయ్యారు. తొలుత తంబి సమాధిని దర్శించి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించి, భక్తులకు దివ్యసందేశాన్ని అందించారు. బ్రదర్ జోసఫ్ తంబి ధన్యజీవి అని, ఆయన జీవించి వుండగా ఎన్నో అద్భుతాలు చేశారని, కుల, మత భేదాలు లేకుండా అందరిని సమంగా ఆదరించి, ప్రేమించారని, అందుకే నేడు ఆయనను అందరూ ఒక పునీతునిగా ఆదరిస్తున్నారని కొనియాడారు. అనంతరం అర్థరాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.

ఈకార్యక్రమంలో పలువురు గురువులు, ఉపదేశులు, గుడిపెద్దలు, సంఘపెద్దలు, మరియదళసభ్యులు, కన్యాస్త్రీలు, యూత్, సంఘస్థులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



యాక్టివా సాధించిన హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ బృందం విజయకేతనం చూపిస్తూ..

వేడుకగా సంక్రాంతి సంబరాలు

గుడ్లవల్లేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి సంబరాలు ప్రజలు ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. యువత, చిన్న పెద్దలు తేడా లేకుండా కోడిపందేల బరుల్లోకి క్యూకట్టారు. కార్లు, మోటార్ బైక్‌లు అన్నీ బరుల బాట పట్టాయి. రోడ్లన్నీ వాహనాల రాకపోకలతో కిక్కిరిశాయి. మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో పందేలకు వచ్చారు. కొందరు కోడిపందేలు చూసి ఆనందిస్తే, మరికొందరు పందేలు వేశారు. లల్లాయి గుండు, ముడుముక్కలు, 52 ముక్కలాట, లోనా బయటా పెద్దసంఖ్యలో ఆడగా రూ.లక్షల్లో చేతులు మారాయి. మండలంలోని వేమవరం, కూరాడ, డోకిపర్రు, గుడ్లవల్లేరు, కుచికాయిలపూడిలో బరులు నిర్వహించారు. మండలంలో జూదాలు, కోడి పందేలు రూ.కోట్లలో టర్నోవర్ జరిగిందని సమాచారం. బరులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సందర్శించి పందేలు తిలకించారు. వేమవరంలో పందెంలో గెలిచిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బుల్లెట్ వాహనాన్ని అందజేశారు. పందేల్లో రెండు యాక్టివాలను హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్, కిషోర్, సురేంద్రరెడ్డి బృందం గెలుపొందారు. కుచికాయిలపూడి బరిని అఖండ ఫేమ్ పాటల, మాటల రచయిత త్రిపురనేని కళ్యాణ చక్రవర్తి సందర్శించారు..

ముగిసిన పూటీలాగుడు పోటీలు

» విజేత నెల్లూరు ఎడ్ల జత, రెండు, మూడు స్థానాల్లో గుంటూరు, కృష్ణా





పూటీలాగుతున్న సీనియర్ ఎడ్ల జత, ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి

ఘంటసాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ గొర్రెపాటి నవనీత కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఘంటసాల జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పూటీలాగుడు పోటీలు మంగళవారంతో ముగిశాయి. న్యూ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో రెండు రోజులపాటు జరిగిన పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా సాగాయి. న్యూ జూనియర్స్ విభాగంలో 13 ఎడ్ల జతలు, జూనియర్స్ అండ్ సీనియర్స్ విభాగంలో 11 జతలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పశుపోషకులు తరలిరావటంతో సందడి నెలకొంది. హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పోటీల నిర్వాహకులను అభినందించారు. పూటీ బండికి టీడీపీ జెండాలు కట్టి నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నెల్లూరు ఎడ్ల జతకు ప్రథమ స్థానం

జూనియర్ అండ్ సీనియర్స్ విభాగంలో నెల్లూరు జిల్లా ఆలూరు మండలం తూర్పుగోగులపల్లికి చెందిన పల్లిబోయిన సంతోష్ రెడ్డి ఎడ్ల జత 2824.9 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్ల జత 2783.9 అడుగుల దూరం లాగి రెండో స్థానంలోనూ, కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాదెళ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్‌బాబు ఎడ్ల జాత 2700 అడుగుల దూరం లాగి మూడో స్థానం కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా చిన్నగంజాం మండలం ఆవుల దొడ్డి గొల్లపాలెం గ్రామానికి చెందిన గోగినేని కార్తీక్ ఎడ్ల జత 2636.7 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానాన్ని, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పగడంవారిపాలెంకు చెందిన కుంచెల వేదశ్రీలతారెడ్డి ఎడ్ల జాత 2593.7 అడుగుల దూరం లాగి ఐదో స్థానాన్ని, కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం చిన్నపులిపాక గ్రామానికి చెందిన ఆర్‌విఎస్ బుల్స్ ఎడ్ల జత 2439.2 అడుగుల దూరం లాగి ఆరో స్థానాన్ని, ఆర్‌విఎస్ బుల్స్ మరో ఎడ్ల జత 2277.4 అడుగుల దూరం లాగి స్పెషల్ ప్రైజ్‌ను కైవసం చేసుకున్నాయి. విజేతలైన ఎడ్ల జత యజమానులకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులను హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి చేతులమీదుగా అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా సూరపనేని రాధాకృష్ణ ప్రసాద్ వ్యవహరించారు. ఒంగోలు జాతి వృషభ రాజముల పూటీ లాగుడు ప్రదర్శన కమిటీ వారి పర్యవేక్షణలో జరిగాయి.

ఉత్కంఠగా పొట్టేలు పందేలు..



విజేతకు బహుమతి అందజేస్తున్న కోట వీరబాబు



బరిలో పోట్లాడుతున్న పొట్టేళ్లు

నందిగామ/చందర్లపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. చందర్లపాడు గ్రామంలో సంక్రాంతి సాంప్రదాయలను ప్రతిబింబించేలా పొటేలు పందేలు నిర్వహించారు. పొటేలు కాపరులు పొట్టేళ్లను సుందరంగా అలంకరించి పోటీలకు తెచ్చారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి కోమటి అజేష్ పొట్టేలు, ద్వితీయ బహుమతి అండాల అవినాష్, తృతీయ బహుమతి దెందుకూరుకు చెందిన అంకమ్మతల్లి, మహ లక్ష్మమ్మతల్లి పొట్టేలు, నాలుగో బహుమతి ఆవల వెంకటాద్రి పొట్టేల్లు సాధించాయి. విజేతలకు ఎన్ఎస్‌పి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, ఉన్నం నరసింహారావు, దాసరి ఏసుప్రభు, దుద్దుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోట్లాట..!

(5వ పేజీ తరువాయి)

అందించారు. బౌన్సర్లను ఏర్పాటుచేసి, టోకెన్లు ఉన్నవారినే లోపలికి పంపారు. అక్కడే మద్యం విక్రయాలు జరిపారు. మచిలీపట్నంలో ఏర్పాటుచేసిన బరులను సాయంత్రం 5 గంటలకు మూసివేయాలని పోలీసులు చెప్పినా, నిర్వహకులు వినిపించుకోలేదు. రాత్రి సమయంలోనూ కొనసాగించారు.

● పెడన నియోజకవర్గంలో తోటమూల, కొంకేపూడి, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, అర్తమూరులో కోడి పందేలు భారీగా జరిగాయి. బంటుమిల్లి, పెందుర్రు, నాగేశ్వరరావుపేట, తువిమ్మడి తదిత ర ప్రాంతాల్లో పేకాట శిబిరాలను మూడు రోజులు రాత్రిపూట కొనసాగించారు. గూడూరు మండలంలోని గూడూరు-పెడన రహదారి వెంబడి, పోసినవారిపాలెంలలో బరులు ఏర్పాటుచేసి పందేలు వేశారు. పేకాట కూడా జరిగింది.

● అవనిగడ్డ నియోజవర్గంలోని పులిగడ్డ, పులిగడ్డపల్లెపాలెం, అవనిగడ్డ, పాతఎడ్లంక, గొట్టుముల్లుల వద్ద కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించారు. నాగాయలంక, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, కోడూరు మండలాల్లో కోడి పందేలు, పేకాట, గుండాట నిర్వహించారు.

● పామర్రు నియోజకవర్గం కొత్తపెదమద్దాలి, పెదపారుపూడి మండలం యలమర్రు, పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం, హనుమంతపురం, మొవ్వ మండలం కోసూరు, కూచిపూడి, భట్లపెనుమర్రు, తోట్లవల్లూరు మండలం గరికపర్రు, కొమ్ముమూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరులో కోడి పందే మూడు రోజులు జోరుగా కొనసాగాయి.

దుర్గమ్మ సేవలో సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్ర



రవిచంద్ర దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఈవో రామచంద్ర మోహన్

వన్‌టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కనక దుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో కె.రామచంద్ర మోహన్ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దేవస్థానంలో బుధవారం శాస్త్రోక్తంగా గోశాలలో గోమాతకు పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల నడుమ వస్త్రం, పూలు, పసుపు, కుంకుమ తదితరాలు గోమాతకు సమర్పించి పూజలు నిర్వహించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ఉంగుటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని ఆత్కూరు, ఉంగుటూరు స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో పేకాట, కోడిపందేల శిబిరాలపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఆత్కూరు పరిధిలోని చినఅవుటపల్లి, తెంపల్లి గ్రామాల్లో కోడిపందేలు, పేకాట స్థావరాలపై ఎస్సై చావా సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి 39మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,350ల నగదు, 12 కోళ్లను స్వాధీనం చేసుకుని 9 కేసులు నమోదుచేసినట్టు తెలిపారు. మద్యం మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణ పరస్పరదాడులకు దారితీసింది. దాడుల్లో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తునట్లు ఉంగుటూరు ఎస్ఐ యు.గోవిందు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

మసీదులో వస్తువులు ధ్వంసం చేసిన దుండగులు

» బాధ్యులను శిక్షించండి : మత పెద్దలు

మచిలీపట్నం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పంబలగూడెంలోని బిలాల్ మసీదులో మంగళవారం అర్ధరాత్రి కొందరు దుండగులు మసీదులోని కుర్చీలను విరగొట్టారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని దూరంగా పారవేశారు. సంఘటనాస్థలాన్ని సీఐ నబి సందర్శించారు. హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముస్లిం మతపెద్దలు మీడియాతో మాట్లాడుతూ, బిలాల్ మసీదులో కుర్చీలను విరగ్గొట్టి వస్తువులను చిన్నాభిన్నం చేయడం సహింపరాని విషయమన్నారు. మచిలీపట్నంలో హిందూ, క్రిస్టియన్, ముస్లిం మతాల్లో సమైక్యత ఉందన్నారు. మీడియాతో సంఘ అధికార ప్రతినిధి ఎండీ సద్‌రుద్దీన్ ఖురేషి, అబ్దుల్ రజాక్,ఖయూం, ఎండీ ఆరిఫ్ తదితరులు మాట్లాడారు. ఇందుకు బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

అనుమానాస్పద మృతి

చందర్లపాడు : ముప్పాళ్లలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన నల్లాని వీరమణితేజ(27) బుధవారం చందర్లపాడు, ముప్పాళ్ల గ్రామాల మధ్య సాయంత్రం రోడ్డుపై పడి ఉండటంతో స్థానికులు గుర్తించి అతడి తండ్రి నల్లాని సాయికి తెలిపారు. మృతుడి తలపై బలమైన గాయాలుండటంతో రోడ్డు ప్రమాదమా.. లేక ఎవరైనా దాడి చేసి చంపారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన ముప్పాళ్ల గ్రామంలో కలకలం రేపింది.

విజయవాడ తూర్పు

పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో క్యాలెండర్ల పంపిణీ

లబ్బీపేట: బందర్‌రోడ్డులోని పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో వినియోగదారులకు వారి కుటుంబ సభ్యులతో ముద్రించిన 2025 క్యాలెండర్‌ను ఉచితంగా అందజేశారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుమారు 850 మంది వినియోగదారులు వారి కుటుంబ సభ్యులతో వచ్చి ఫొటోలు దిగారు. వారికి క్యాలెండర్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్వీస్ స్టేషన్ అధిపతి ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గత 11సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ ఎ.అనిల్ కుమార్, జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్, మేనేజర్ కె.వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



రహదారులు ఖాళీ సంక్రాంతి సెలవులకు నగరవాసులు సొంతూళ్లకు వెళ్లడం, పండుగ సందర్భంగా దుకాణాలు మూసివేయడంతో నిర్మానుష్యంగా ఉన్న తూర్పు నియోజకవర్గం పరిధి మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కాలేజీ రోడ్డు, మదర్‌థెరెస్సా జంక్షన్ , పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు

ఘనంగా శోభన్‌బాబు జయంతి వేడుకలు

ధర్నాచౌక్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): శోభన్‌బాబు 89వ జయంతి వేడుకలు రాష్ట్ర శోభన్ సిండికేట్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. గాంధీనగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానికులకు స్వీట్స్ పంపిణీ చేశారు. శోభన్‌బాబు అభిమానులు గర్వించేలా ప్రతీ ఏటా ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు సిండికేట్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కళ్లేపల్లి మధుసూదనరాజు, ధారా సత్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు జీవిత విశేషాలను వివరించారు. ఆయన మృతి చెంది 17 ఏళ్లు గడచినా నేటికీ ఆయన తీపి గుర్తులు, మధురస్మృతులు నెమరు వేసుకుంటూ ఆయన చూపిన బాటలో పయనిస్తున్నామన్నారు. పలువురు సంఘం నేతలు, శోభన్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

దాసరి లింగయ్య వీధిలో అధ్వానంగా పార్కు

మొగల్రాజపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 7వ డివిజన్ మొగల్రాజపురం దాసరి లింగయ్య వీధిలో వీఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి పార్కు ప్రత్యక్ష నిదర్శనంగా సంవత్సరాల తరబడి కనిపిస్తోంది. దాదాపు పది సంవత్సరాల కాలంగా ఈ పార్కు ఆలనా పాలనా లేక పాడు పడి పోయింది. దూళిపాళ్ల వెంకట సుబ్బయ్య, సీతారామమ్మల జ్ఞాపకార్థం మనమడు వెంకట సత్యనారాయణ పేరుతో ఉన్న ఈ పార్కు రెండు అపార్టుమెంట్‌ల మధ్య ఉంటుంది. పార్కు గేటు ముందు టెలిఫోన్ స్తంభం, ఒక విద్యుత్ స్తంభం, ఫ్యూజు బాక్సు ఉన్న స్తంభం ఉంది. గతంలో ఎప్పుడో లోపల సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఇపుడు ఆవరణ అంతా చెత్త చెదారంతో, ఎండిపోయిన నేలతో, పాడైన బెంచిలతో ఉంది. గేటుతుప్పు పట్టి తెరిచి ఉంది. చుట్టుపక్కల అపార్టుమెంట్‌లు ఉండటంతో పెద్దలు, పిల్లలు సాయంత్రం వేళ బయటకు రావడానికి ఎక్కడా స్థలం కూడా లేదు. ఉన్నా ఇలాంటి పార్కులను పట్టించుకున్ననాథుడు లేదు. ఈ ప్రాంతం కార్పొరేటర్ దీని వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ప్రభుత్వం మారింది. ఇప్పటికైనా



ఈ పార్కును బాగు చేయిస్తే పిల్లలకు, పెద్దలకు ఉపయోగపడుతుందని స్థానికులు ఆశ పడుతున్నారు.



అంబేడ్కర్‌నగర్ కాలనీలోని అంతర్గత రోడ్డులో ఏర్పడిన గుంతలు

గోతులతో అంతర్గత రోడ్డు అధ్వానం

● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

భారతీనగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నాల్గవ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్ కాలనీలోని వీఎంసీ పార్కు సమీపంలోని అంతర్గత రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో ఈ రోడ్లో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పటమటలో కుక్కల బెడద

పటమట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పటమట దానయ్య, అచ్చమ్మ వీధుల్లో గ్రామ సింహాలు గడగడలాడిస్తున్నాయి. గుంపులు, గుంపులుగా తిరుగుతూ విద్యార్థులను, మహిళలను భయపెడుతున్నాయి. ఇటీవల బాలుడ్ని కరిచింది. అధికారులు స్పందించి వెంటనే కుక్కలను పట్టించాలని పలువురు కోరుతున్నారు.



వీధిలో విచ్చలవిడిగా కుక్కలు

ప్రమాదకరంగా మారిన సిమెంట్ చప్టాలు

భారతీనగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గుణదల ఈఎస్ఐ సమీపంలో దాసరి వెంకట గిరిధర కుమార్ అవంతి నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాల మెయిన్ గేటు వద్ద ఉన్న డ్రెయినేజీలోని పూడికను తొలగించడానికి సిమెంట్ చప్టాలను తీశారు. పూడికను తొలిగించిన అనంతరం డ్రెయినేజీపై సిమెంట్ చప్టాలను సరిగా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో విద్యార్థులు బడికి వచ్చే సమయంలో, ఇంటికి వెళ్లే సమయంలో కాలికి తగులుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



దాసరి వెంకట గిరిధరకుమార్ అవంతి పాఠశాలలో మెయిన్ గేట్ వద్ద పైకి లేచిన సిమెంట్ చప్టాలు

రేపటి నుంచి నల్ల మస్తానయ్య ఉరుసు ఉత్సవాలు

గవర్నర్‌పేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నల్లమస్తానయ్య ఉరుసు ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానుండటంతో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హజరత్ కాలే మస్తాన్ షావలి దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు. హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లింలు ఐక్యంగా ఆరాధించే మస్తాన్ బాబా ఉత్సవాలను శుక్రవారం నుంచి 21 వరకు నిర్వహిస్తామన్నారు. చాందిని అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమతాయని, అన్నదానం, సందల్ ఊరేగింపు ఉంటుందన్నారు. 18న గంధం పంపిణీ, 19న గ్యార్మీ షరీఫ్, 20న పకీర్లకు చద్దర్లు పంపిణీ నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 21న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. సమావేశంలో ఉరుసు నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



దానయ్యవీధిలో పొంగుతున్న డ్రెయినేజీ

పటమట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పటమట దానయ్య వీధిలో డ్రెయినేజీలు పొంగి వీధుల్లోకి మురుగు నీరు పారుతోంది. కొందరు వ్యర్థాలను రోడ్డు మీదకు వదిలేస్తున్నారు. పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

త్రిపురనేని వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

అభ్యుదయ రచయితల సంఘం, త్రిపురనేని స్మారక కమిటీ ప్రతినిధులు

వన్‌టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హేతువాద రచయిత, త్రిపురనేని రామస్వామి వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని అభ్యుదయ రచయితల సంఘం, త్రిపురనేని స్మారక కమిటీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. త్రిపురనేని రామస్వామి జయంతి సందర్భంగా బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో ఆయన విగ్రహానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ సమాజాన్ని తప్పుదోవ పట్టించే మూఢ విశ్వాసాల నుంచి ప్రజలను మేల్కొలిపి మెరుగైన మార్గం వైపు మళ్లించటమే హేతువాద ఉద్యమమన్నారు. త్రిపురనేని తన ఇంటిని సాహిత్య కేంద్రంగా మార్చారన్నారు. త్రిపురనేని కుటుంబ సభ్యుడు పొట్లూరి పూర్ణేందు మౌళి మాట్లాడుతూ రామస్వామి కుటుంబ నేపథ్యం, జీవిత విశేషాలను వివరించారు. నాస్తిక సమాజం కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 8,9 తేదీలలో మంగళగిరి చార్వాక ఆశ్రమంలో నాస్తిక మేళా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చియ్య, ఆయా కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పటమట కోడిపందేల బరి
పందేనికి కోళ్లు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

కొండపల్లి ఖిల్లాలో పర్యాటకుల సందడి

ఇబ్రహీంపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీలో ఉన్న కొండపల్లి రిజర్వు ఫారెస్టులో ఉన్న కొండపల్లి ఖిల్లా, సీతాకోకచిలుకల పార్క్ దొంగమర్ల బావి వంటి పర్యాటక ప్రాంతాల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ప్రకృతి అందాల మధ్య పర్యాటకుల రోజంతా ఉల్లాసంగా గడిపేశారు. ఈ మూడు పర్యాటక ప్రాంతాల్లోని అందాలతో పర్యాటకుల మంత్ర ముగ్ధులయ్యారు. కుటుంబ సభ్యులతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేశారు. కోట అందాలతో పాటు అడవి అందాలు వీక్షకులను కట్టిపడేశాయి. మరో పక్క సీతాకోక చిలుకల పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఆట వస్తువులు పిల్లల్ని, పెద్దల్ని విశేషంగా ఆటక్టుకున్నాయి.ఇక్కడున్న వెదురు పొదరిల్లు పర్యాటకులను కట్టి పడేసింది. అక్కడి నుంచి ఘాట్ రోడ్డులో మరో 8 కిలో మీటర్లు పర్యటించి దొంగమర్ల బావిని చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివెళ్లారు. ఆంజనేయ స్వామి ఆలయంలో పలువురు ప్రత్యేక పూజలు చేశారు. మొత్తం పర్యాటకులతో ఈ మూడు ప్రాంతాలు భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా కళకళలాడాయి.





పండగవేళ... సరికొత్త లుక్కులు

సంక్రాంతి సందర్భంగా స్టార్ హీరోల నుంచి చిన్న హీరోలు నటిస్తున్న సినిమాల వరకు కొత్త పోస్టర్స్ విడుదలయ్యాయి. ఈ ప్రచార చిత్రాలతో ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.


'రాజాసాబ్' నుంచి ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్ శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నారీ నారీ నడుమ మురారీ' టైటిల్‌ను ప్రకటించారు. విశ్వక్‌సేన్ నటిస్తున్న 'లైలా'లో ఫిమేల్ లుక్‌ను రివీల్ చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'బ్రహ్మ ఆనందం' నుంచి కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ జంటగా తెరకెక్కుతున్న 'దిల్‌రూబా' వచ్చే నెల 14న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిసున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.



తారల సంక్రాంతి సంబరాలు

తారలు సంక్రాంతిని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి ట్రెడిషనల్ లుక్‌లో కనువిందు చేశారు. రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసన, కూతురు క్లీంకారతో కలసి ఫొటో దిగారు. అల్లు అర్జున్ తన సతీమణి స్నేహా రెడ్డి, కూతురు అర్హ, తనయుడు అయాన్‌తో కలసి పిక్ తీసుకున్నారు. మోహన్‌బాబు దంపతులు, తనయుడు విష్ణు ఫ్యామిలీతో తిరుపతిలో కలసి ఫొటోలు దిగారు. వరుణ్‌తేజ్ తన సతీమణి లావణ్యతో కలసి గాలిపటాలు ఎగరేస్తూ ఫొటోలకు ఫోజిచ్చారు. నూతన దంపతులు నాగచైతన్య, శోభితా ధూళిపాళతో సంప్రదాయ దుస్తుల్లో పిక్ తీసుకున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కీర్తి సురేశ్, ఆంటోని తట్టిల్ జంటగా పండగ వేడుకల్లో తీసుకున్న ఫొటోలను షేర్ చేశారు. అలాగే విఘ్నేష్ నయనతార దంపతులు పిల్లలతో కలసి దిగిన పండగ ఫొటోను షేర్ చేశారు.










నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్


వెంకటేశ్

'మా సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, అభిమానులకు ధన్యవాదాలు. మేం మంచి ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనే ఆలోచనతో సంక్రాంతికి వస్తున్నాం అని చెప్పాం. నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు అనిల్‌కు థాంక్స్' అని అన్నారు విక్టరీ వెంకటేశ్. ఆయన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలై విజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ 'సాధారణంగా బెనిఫిట్ షోలకు ఫ్యాన్స్ యూత్ వెళుతుంటారు. కానీ తొలిసారి ఉదయం నాలుగున్నర షోకి ఫ్యామిలీ ఆడియన్స్ రావడం చాలా ఆనందం కలిగించింది' అన్నారు. సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు నిర్మాత దిల్ రాజు ధన్యవాదాలు తెలిపారు. పైరసీని ఎంకరేజ్ చేయకుండా థియేటర్లలోనే సినిమా చూడాలని ఆయన కోరారు.




అందమైన ప్రేమకథ


'బేబీ' కలయిక మరోసారి రిపీట్ అవుతోంది. ఆ సినిమాతో సూపర్ హిట్ కొట్టిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవిచైతన్య జంటగా మరో చిత్రం తెరకెక్కనుంది. '90స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య హసన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మేరకు 'యాన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ' పేరుతో ఓ అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల చేశారు. 'మీరు చూసిన మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా '90స్'లోంచి పుట్టిన అందమైన ప్రేమకథ ఇది. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా చిత్రం తెరకెక్కనుంది" అని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు. ఈ సినిమాకు ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రాఫర్: అజీమ్ మహమ్మద్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.

ఆస్కార్ వేడుక రద్దు అవుతుందా?



అమెరికాలోని లాస్‌ఏంజిల్స్ ప్రాంతాన్ని కార్చిచ్చు చుట్టుముట్టి, ఎంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలిగించిన ఫలితం ఇప్పుడు ఆస్కార్ అవార్డుల వేడుకలపై కూడా ప్రభావం చూపుతోందా?. టామ్ హాంక్స్ ఎమ్మా స్టోన్, మెల్ గిబ్సన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి హాలీవుడ్ ప్రముఖులు ఈ అగ్ని ప్రమాదంతో ఇళ్లు కోల్పోయారు. అలాగే ఆస్కార్ కమిటీలోని నలుగురు సభ్యులు కూడా ఈ కార్చిచ్చు వల్ల ఇళ్లు కోల్పోవడంతో మార్చి రెండున జరగాల్సిన ఆస్కార్ వేడుక రద్దు కావచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే.. 96 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో అవార్డుల వేడుక రద్దు కావడం ఇదే తొలిసారి అవుతుంది. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా ఆస్కార్ కమిటీ వేడుకని వాయిదా వేసింది తప్ప రద్దు చేయలేదు. ఇప్పుడు కూడా అలాగే చేయవచ్చని కొంతమంది అంటున్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో ఇలా కార్చిచ్చు వ్యాపించి లాస్ ఏంజిల్స్‌ను బూడిద కుప్పగా మార్చడంతో ఈ నెల 23న జరగాల్సిన నామినేషన్స్ ప్రకటన వాయిదా వేశారు. పరిస్థితిని గమనిస్తున్న ఆస్కార్ కమిటీ అవార్డుల వేడుక జరిగే తేదీలో ఏదన్నా మార్పు ఉంటే త్వరలో ప్రకటిస్తుందని అంటున్నారు.





కళ్లకు విశ్రాంతి ఇలా...

శీతాకాలంలో వీచే చలిగాలుల వల్ల కళ్లలో తేమ తగ్గిపోతుంటుంది. కళ్లు ఒత్తిడికి గురై పొడిబారుతుంటాయి. దీంతో కళ్లు ఎర్రగా మారి గుచ్చుకుంటున్నట్లుగా అనిపిస్తాయి. కళ్లు త్వరగా అలసిపోతాయి కూడా. వైద్యుల సలహా మేరకు కంటి చుక్కలు వాడడంతోపాటు కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్యల నుంచి సులభంగా బయటపడవచ్చు.

ఏకాగ్రతగా చూడడం

ఇది యోగాభ్యాసంలో ఒక ప్రక్రియ. స్థిరంగా చూపు నిలపడమే దీని ఉద్దేశం. మీ నుంచి మూడు అడుగుల దూరంలో ఒక కొవ్వొత్తిని ఉంచి వెలిగించండి. యథాస్థానంలో నిలబడి కొవ్వొత్తి మంటను అయిదు నుంచి పది నిమిషాలపాటు రెప్పవేయకుండా తదేకంగా చూడండి. ఇలా ప్రతిరోజూ చేస్తూ ఉంటే కళ్లలో నీరు సహజంగా ఉత్పత్తి అవుతుంది. తేమ శాతం పెరిగి కళ్లు పొడిబారే సమస్య తగ్గుతుంది. ఏకాగ్రతతోపాటు కంటి చూపు మెరుగుపడుతుంది.

అరచేతులతో వేడి అద్దడం

ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల ముందు పనిచేసేవాళ్లకి; చదువుకునే పిల్లలకు కళ్లు ఒత్తిడికి గురై అలసిపోతూ ఉంటాయి. ఈ సమస్య చలికాలంలో మరింత అధికంగా ఉంటుంది. ఇలాంటపుడు కళ్లకి విశ్రాంతి అవసరం. అరచేతులను ఒకదానిపై మరోదానిని చేర్చి వేగంగా రుద్దాలి. రెండు అరచేతులు వేడిగా అయిన తరవాత వాటిని మూసిన కళ్లమీద అద్దాలి. రెండు నిమిషాలు వేడి తగ్గే వరకు అలాగే ఉంచాలి. గట్టిగా గాలి పీల్చాలి. ఇలా వరుసగా నాలుగుసార్లు చేయాలి. అరచేతుల వేడికి కళ్లలోని కండరాలు సడలి విశ్రాంతి పొందుతాయి. కళ్లకు రక్తప్రసరణ జరిగి అలసట తగ్గుతుంది.

కళ్లు గుండ్రంగా తిప్పడం

కుర్చీలో కూర్చుని వీపుని నిటారుగా ఉంచాలి. కళ్లను గుండ్రంగా సవ్య దిశలో తరవాత అపసవ్య దిశలో తిప్పాలి. ఇలా పది నిమిషాలు చేయాలి.



దీనివల్ల కంటి చూట్టూ ఉన్న కండరాలపై ఒత్తిడి తగ్గుతుంది. దృష్టిని కేంద్రీకరించే సామర్థ్యం పెరుగుతుంది. కళ్లలో ఎరుపుదనం తగ్గి ప్రకాశవంతంగా మెరుస్తాయి.

వేగంగా రెప్ప వేయడం

రెప్పవేసే ప్రక్రియ ద్వారానే కళ్లు ద్రవాన్ని ఉత్పత్తి చేసుకుంటాయి. తరచుగా రెప్పవేస్తూ ఉంటేనే కళ్లు తేమగా ఉంటాయి. కంప్యూటర్ల ముందు పనిచేసేవారు, తదేక దృష్టితో చూస్తూ చదివే పిల్లలు చాలా సమయం వరకూ రెప్ప వేయరు. దీనికి చలిగాలులు తోడైతే కళ్లలో తేమ శాతం పూర్తిగా తగ్గుతుంది. అందుకే వీలుదొరికినపుడల్లా కనీసం ఇరవై సెకన్ల పాటు వేగంగా కళ్లు ఆర్పుతూ ఉండాలి. తరవాత అర నిమిషం కళ్లు మూసుకుని ఉండాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కళ్లు పొడిబారే సమస్య తలెత్తదు.

నీళ్లు చిలకరించడం

ఇది కళ్లను శుభ్రం చేసేందుకు ఉపయోగించే ప్రక్రియ. దోసిలి నిండా నీళ్లను తీసుకుని ముఖానికి దగ్గరగా పెట్టుకుని మెల్లగా కళ్లమీదికి చల్లాలి. గోరువెచ్చని లేదంటే చల్లని నీళ్లను ఇలా చిలకరించుకోవచ్చు. దీనివల్ల కళ్లలోని దుమ్ము, ధూళి తొలగిపోతాయి. ఎండ, గాలి వల్ల కలిగే ఒత్తిడి, అలసట తగ్గి కళ్లు ప్రశాంతంగా కనిపిస్తాయి. త్రిఫల చూర్ణం కలిపి వడకట్టిన నీళ్లు లేదా గులాబీ నీళ్లను చిలకరించుకున్నా కూడా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

వారియర్



ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)కు... ఓఆర్ఎస్-ఎల్‌కు మధ్య తేడా తెలుసా? తెలుసుకోకుండా మార్కెట్‌లో లభ్యమయ్యే రకరకాల పొడర్లు, పానీయాలను ఉపయోగిస్తే ప్రాణాలకే ప్రమాదం కలగవచ్చు అంటున్నారు **డాక్టర్ శివరంజని సంతోష్.** ఈ అంశంపై ఆమె పోరాటం కూడా చేస్తున్నారు. ఆ వివరాలను 'నవ్య'తో పంచుకున్నారు

అందుకే ఈ పోరాటం!

డయేరియాతో బాధపడుతూ, ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన పిల్లలను తల్లితండ్రులు నా దగ్గరకు తీసుకొచ్చేవారు. వాళ్లను ఆరా తీస్తే, మందుల షాపుల్లో, రెడీమేడ్ టెట్రాప్యాక్‌లో దొరికే ఓఆర్ఎస్ పానీయాలను పిల్లలకు ఇస్తున్నట్టు తెలిసింది. వాటిని తెప్పించుకుని చూస్తే, అవి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన అసలైన ఓఆర్ఎస్‌లు కావనీ, చక్కెర మోతాదులు ఎక్కువగా కలిగి ఉన్న ఓఆర్ఎస్ మారు రూపాలనీ, వాటి వల్లే పిల్లల్లో డీహైడ్రేషన్ పెరిగి, ఆరోగ్యం క్షీణిస్తోందనీ కనిపెట్టాను. అధిక చక్కెర వల్ల విరోచనాలు మరింత పెరిగి, డీహైడ్రేషన్ రెట్టింపై, పిల్లల్లో ప్రాణాంతక పరిస్థితి తలెత్తుతుంది. ఈ రకమైన మోసాన్ని నేను భరించలేకపోయాను. అన్ని మందుల షాపుల్లో, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇవి అందుబాటులో ఉంటున్నాయి. తీయగా ఉండడంతో పిల్లలూ, పెద్దలూ వీటిని తాగుతున్నారు. కలరాతో పాటు ఎండదెబ్బకు గురైన సందర్భాల్లో, వ్యాధుల నుంచి కోలుకునే సమయాల్లో, నీరసాన్ని దూరం చేసుకోవడం కోసం వీటి మీదే ఆధారపడుతున్నారు. ఇది ప్రమాదకరం. అందుకే గత ఆరేళ్లుగా ఓఆర్ఎస్‌ల మీద ఉద్యమం చేస్తున్నాను.

ప్రజలు తప్పుదోవలో...

ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)ను ఒక ఔషధంగా వర్గీకరించడం జరిగింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని తయారుచేయాలి. కానీ కొన్ని కంపెనీలు ఆ ప్రమాణాలకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఫార్ములాకు భిన్నంగా ఓఆర్ఎస్‌ను ఇష్టారాజ్యంగా తయారుచేసి మార్కెట్లో ప్రవేశపెడుతూ ఉండడంతో, వాటికి అడ్డుకట్ట వేయాలని, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్‌కు ఉత్తరం రాశాను. వాళ్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయమని అన్నారు. దాంతో ఆ సంస్థకు పలుమార్లు ఫిర్యాదు చేసిన తర్వాత, 2022లో టెట్రాప్యాక్‌ల మీద ఓఆర్ఎస్ అక్షరాలను ఉపయోగించకుండా నిషేధిస్తూ సంస్థ, ఉత్తర్వులు జారీ చేసింది. కానీ రెండు నెలల తర్వాత ఓఆర్ఎస్'ఎల్' అనే మరొక పదంతో, ఎనర్జీ డ్రింక్‌ల పేరుతో ఈ ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తాయి. నిజానికి మన దేశంలోని ఔషధ చట్టాల్లో, ప్రజల్ని తప్పుదోవ పట్టించే లేబుల్స్ వాడకూడదనే నియమం ఉంది. ఈ నియమాన్ని ఖాతరు చేయకుండా, ఎన్నో ఓఆర్ఎస్ఎల్ పానీయాలు రూపొందుతూనే ఉన్నాయి. నియమాల ఉల్లంఘన నెపాన్ని తప్పించుకోవడం కోసం... 'డయేరియా సమయంలో వాడకూడదు' అనే సూచనను చిన్న అక్షరాల్లో ముద్రించి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తూనే ఉన్నాయి. దాంతో ఓఆర్ఎస్‌కూ, ఓఆర్ఎస్ఎల్‌కూ మధ్య తేడాను కనిపెట్టలేని వినియోగదారులు వీటిని విరివిగా కొని వాడుకుంటున్నారు. దీని వల్ల తల్లితండ్రులు మోసపోవడం, పిల్లలు ఆరోగ్యాన్ని నష్టపోవడం పరిపాటిగా మారుతోంది. కాబట్టి ఎవరో ఒకరు ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే, మున్ముందు మరెంతో మంది పిల్లల విలువైన ప్రాణాలను నష్టపోవలసి వస్తుంది. ఇలాంటి పానీయాలకు చోటు

> **నేను తణుకులో పుట్టాను. విజయవాడలో పెరిగి హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. పాండిచ్చేరి జిప్‌మర్‌లో ఎమ్‌బిబిఎస్, ఎమ్‌డి చదివాను. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. ఆల్ ఇండియా జిప్‌మర్‌లో మూడవ ర్యాంకు సాధించాను. ఎమ్‌డి పీడియాట్రిక్స్ పూర్తి చేసిన తర్వాత మొదట చండీఘడ్‌లో వైద్యవృత్తి మొదలుపెట్టాను. తర్వాత హైదరాబాద్‌లో అపోలో, బర్త్‌ప్లేస్‌లో పని చేశాను. ఇప్పుడు మా సొంత మ్యాగ్నా సెంటర్స్‌లో సేవలందిస్తున్నాను. పాప అదితి సంతోష్ 12వ తరగతి చదువుతోంది. తనకు టాల్ అండ్ ఆల్ అనే సొంత వస్త్ర బ్రాండ్ ఉంది.**





కల్పించవద్దని అన్ని కార్పొరేట్ ఆస్పత్రులకూ, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకూ ఉత్తరాలు రాయబోతున్నాను. 2022లో తెలంగాణా హైకోర్టులో నకిలీ ఓఆర్ఎస్‌లకు వ్యతిరేకంగా ఒక పిల్ కూడా వేశాను. ప్రస్తుతం ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా, విమెన్ పీడియాట్రిక్ ఫోరం మద్దతుతో నా పోరాటాన్ని మరింత ముమ్మరం చేయబోతున్నాను.

సామాజిక మాధ్యమాల ద్వారా...

అంతర్జాలంలో లెక్కలేనంత తప్పుడు సమాచారం అందరికీ అందుబాటులో ఉంటోంది. దాన్ని గుడ్డిగా అనుసరించి, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వాళ్లూ ఉంటున్నారు. అలాగే మనలో చాలా మందికి ప్రాథమిక చికిత్సల పట్ల కూడా అవగాహన ఉండడం లేదు. గొంతులో ఆహారం అడ్డుపడడం మూలంగా ప్రాణాలకు ముప్పు వాటిల్లే హఠాత్పరిణామాల్లో ఎలా వ్యవహరించాలో తెలియదు. నిజానికి ఈ పరిస్థితి నాక్కూడా ఎదురైంది. ఎమ్‌డి చదివే రోజుల్లో రేగి పండు నా గొంతులో విరుక్కుపోయి, ఊపిరి అందక ఎంతో సతమతమైపోయాను. ఆ సమయంలో తోటి ఇంటర్న్ హౌస్ సర్జన్, అరుణ్ వెంటనే స్పందించి, సహాయపడడంతో ప్రాణాలతో బయటపడ్డాను. కాబట్టి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల ద్వారా ఓఆర్ఎస్, ఫస్ట్‌ఎయిడ్, సిపిఆర్, అపోహల పట్ల కూడా అవగాహన కల్పిస్తున్నాను. మా అమ్మాయి అదితితో కలిసి, ఇప్పటివరకూ 20 వేల మందికి ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్‌లలో శిక్షణ ఇచ్చాను. తెలుగు సినీ కథానాయకుడు నాని కూడా నా దగ్గర సిపిఆర్ శిక్షణ తీసుకుని, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు.

● గోగుమళ్ల కవిత

సలహా

నెలసరితో అదుపు తప్పే భావోద్వేగాలు

డాక్టర్! మా అమ్మాయికి 18 ఏళ్లు. నెలసరి సమయంలో చిత్రంగా ప్రవర్తిస్తూ ఉంటుంది. విపరీతమైన కోపం, ప్రతి చిన్న విషయానికీ చిరాకు పడిపోతూ ఉంటుంది. నెలసరి సమయంలో ఈ మార్పు ఎందుకు? ఈ భావోద్వేగాలను ఎలా అదుపు చేయాలి?

\- ఓ సోదరి, హైదరాబాద్.

సాధారణంగా పెరిగే వయసుతోపాటు ప్రీమెన్‌స్ట్రువల్ సిండ్రోమ్(పి.ఎం.ఎస్) తగ్గుముఖం పడుతుంది. కానీ అరుదుగా కొందరిలో అది ఎంతకీ అదుపులోకి రాదు. పెళ్లై, పిల్లలున్న కొందరు మహిళలను కూడా ఈ సమస్య వేధిస్తూ ఉంటుంది. అయితే తొలి నెలసరి కనిపించే 13 ఏళ్ల వయసు నుంచీ 20 - 25 ఏళ్ల వయసువరకూ ఈ రకమైన 'మూడ్ స్వింగ్స్' సర్వసాధారణం. ఈ మార్పులన్నిటికీ నెలసరి సమయంలో శరీరంలో చోటుచేసుకునే హార్మోన్ల హెచ్చుతగ్గులే కారణం. ఈ విషయాన్ని తల్లులతోపాటు, పిల్లలూ అర్థం



చేసుకోవాలి. తల్లులు పిల్లలకు ఇదంతా సహజమైనవనే భరోసా కల్పించాలి.

అప్పుడేం చేయాలంటే?

అలాగే ఆ భావోద్వేగాలను అదుపు చేయడం కోసం యోగా, లేదంటే క్రమం తప్పక వ్యాయామం చేయించాలి. పీరియడ్స్‌కి రెండు రోజుల ముందు నుంచీ ఆహారంలో ఉప్పు తగ్గించాలి. ఒకవేళ ఈ లక్షణాలు నెలసరికి 10 రోజుల ముందు నుంచీ మొదలై, నెలసరి పూర్తయిన తర్వాత కూడా కొనసాగుతూ, లక్షణాలు మరీ తీవ్రంగా ఉంటే తప్పనిసరిగా వైద్యులను కలవాలి. ఈ సమస్యకు క్యాప్సూల్ రూపంలోని విటమిన్ ఇ, ఈవినింగ్ ప్రైమ్ రోజ్ ఆయిల్ వాడితే ఫలితం ఉంటుంది.

డాక్టర్ కీర్తి,
స్త్రీల నిపుణులు, హైదరాబాద్.

అద్దం మెరిసేలా...

మనం రోజూ అద్దంలో ముఖం చూసుకుంటూ ఉంటాం. ఈ క్రమంలో అద్దాన్ని చేతులతో పట్టుకున్నపుడు దాని మీద వేలి ముద్రలు పడుతుంటాయి. డ్రెస్సింగ్ మిర్రర్ మీదయితే దుమ్ము ధూళి పేరుకుపోతుంటాయి. ఇలాంటపుడు అద్దంలో ముఖం సరిగా కనిపించదు. వీటన్నింటినీ పోగొడుతూ అద్దాన్ని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం!

- ప్రతిరోజూ అద్దాన్ని కాగితంతో గట్టిగా తుడవాలి. దీనివల్ల అద్దం మీద ఉన్న చేతి గుర్తులు, దుమ్ము తొలగిపోతాయి. అద్దం మసకగా కనిపిస్తుంటే దానిమీద రెండు నీటి చుక్కలు చల్లి మరో కాగితంతో రుద్ది తుడవాలి. అద్దం పూర్తిగా శుభ్రమవుతుంది.
- అద్దం మీద మరకలు ఎక్కువగా ఉంటే రెండు చుక్కల వైట్ వెనిగర్ వేసి సన్నని వస్త్రం లేదా కాగితంతో తుడవాలి.
- అద్దం లేదంటే డ్రెస్సింగ్ మిర్రర్ మీద కొద్దిగా టాల్కం పౌడర్ చల్లాలి. రెండు నిమిషాలు



అలాగే ఉంచాలి. తరవాత పేపర్ నాప్‌కిన్ లేదా చిన్న రుమాలుతో తుడిచేస్తే అద్దం చక్కగా మెరుస్తుంది

- ఒక కప్పు నీళ్లలో రెండు చెంచాల నిమ్మరసం వేసి కలపాలి. ఈ నీటిని ఓ స్ప్రే బాటిల్‌లో పోసి అద్దం మీద చిలకరించాలి. తరవాత చిన్న తువాలుతో తుడిచేస్తే అద్దం తళతళలాడుతుంది.
- ఒక గ్లాసు నీళ్లలో ఒక చెంచా ఉప్పు వేసి కరగించండి. దీనిలో చేతిరుమాలు ముంచి నీటిని పిండి దానితో అద్దాన్ని తుడిస్తే ఎలాంటి మొండి మరకలైనా శుభ్రంగా పోతాయి. అద్దం కొత్తదానిలా మెరుస్తుంది.
- అద్దం మీద మురికి ఎక్కువగా ఉంటే గోరువెచ్చని నీళ్లు చల్లి మెత్తని బట్టతో తుడిచేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- అద్దం మీదికి వేడి నీటి ఆవిరి పడేలా చేయాలి. తరవాత కాగితంతో తుడిచేస్తే మరకలన్నీ పోయి అద్దం శుభ్రంగా ఉంటుంది.

కల నిజమైన రోజు

వెండితెరపై తారగా మెరిసిపోవాలన్నది ఆమె చిన్ననాటి కల. కానీ మనసులో మాట చెబితే అందరూ చులకన చేస్తారనే భయం. 'అనుష్కాలాగానో... ప్రియాంకలానో నువ్వు లేవు' అంటారేమోననే సందేహం. ఇన్ని మానసిక సంఘర్షణలను దాటి... తన ఇష్టాన్ని తనలోనే దాచిపెట్టి... పట్టుదలగా ప్రయత్నించింది. సహనంతో... దృఢ సంకల్పంతో అడుగు ముందుకు వేసింది. ఒక మంచి సినిమాతో బాలీవుడ్ లోకి ప్రవేశించింది. ఆమే అర్చితా అగర్వాల్.

సెలబ్ టాక్



"చిన్నప్పుడు ఎన్నో కలలు కంటాం. చదువు కోసమనో... పరిస్థితుల ప్రభావంతోనో అవన్నీ మరుగున పడిపోతుంటాయి. కానీ నేను కన్నది ఒకే ఒక్క కల. చిత్ర పరిశ్రమలో స్థిరపడాలని. అదీ నటిగా. ఆ కల నాతోపాటే పెరుగుతూ వచ్చింది. ఎక్కడ ఉన్నా... ఏంచేస్తున్నా... నా ఆలోచనల నుంచి ఎన్నడూ అది పక్కకు పోలేదు. ఎలాగైనా సాధించి తీరాలన్న పట్టుదల, అవకాశం వచ్చేవరకు వేచి చూసేంత సహనం... ఇవే నన్ను ఇవాళ నటిని చేశాయి. కమర్షియల్ సినిమా కాకపోయినా... 'డిస్పాచ్'తో తొలి చిత్రంలోనే మనోజ్ బాజ్‌పాయ్ లాంటి మంచి నటుడితో కలిసి పని చేయడం నాకు లభించిన అద్భుత అవకాశం.

చెప్పాలంటే భయం...

అసోంలోని ఓ మధ్యతరగతి కుటుంబం మాది. ఊహ తెలిసినప్పటి నుంచీ సినిమా లంటే ఇష్టం. ఆ ఇష్టం ప్రేమగా మారింది. కొన్నాళ్లకు నటించాలన్న తపన... తెరపై నన్ను నేను చూసుకోవాలన్న కోరిక మొదలైంది. అయితే ఎవరితోనైనా చెబితే ఎక్కడ ఆట పట్టిస్తారోననే భయం. 'నువ్వేమన్నా అనుష్కాలాగా ఉన్నావా? ప్రియాంకతో సరిపోతావా' లాంటి వ్యాఖ్యలతో నిరుత్సాహపరుస్తారనే సందేహం. దాంతో చాలా ఏళ్లు నా ఇష్టాన్ని నాలోనే దాచుకున్నా. ఇలా ఎంతోమంది తమను తాము తక్కువ చేసుకొని... కలలను చంపేసుకొంటున్నారు. వారిలా నేనూ మిగిలిపోవాలని అనుకోలేదు.

కాలేజీకి వెళ్లాక...

పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. కాలేజీలో చేరాను. అప్పుడు నా స్నేహితులకు చెప్పడం మొదలుపెట్టాను... 'నేను నటిని కావాలని అనుకొంటున్నా' అని. చాలామంది నేనేదో సరదాగా మాట్లాడుతున్నానని పట్టించుకోలేదు. నవ్వేసి వెళ్లిపోయేవారు. సన్నిహితులు, బంధువులు అయితే 'సినిమాలంటే కురచ డ్రెస్సులు వేసుకోవాలి. అలాంటివి మన ఇంటికి సరిపడవు' అనేవారు. వేరొకరైతే ప్రయత్నాలు అప్పటితోనే ఆపేసేవారేమో! కానీ ఆ మాటలు నాలో మరింత పట్టుదలను పెంచాయి. ఎలాగైనా నటిని అయ్యి చూపించాలని నిశ్చయించుకున్నాను. అసోం వదిలి ముంబయికి వచ్చేశాను. నాకు తెలుసు... నేను అనుష్కా అంతటి అందగత్తెను కాదని. అలాగని ప్రయత్నం ఆపదలచుకోలేదు.

తొమ్మిదేళ్ల ప్రయత్నం...

నటి కావాలన్న బలమైన ఆకాంక్ష మినహా పరిశ్రమ గురించి నాకు ఏమీ తెలియదు. ఎవరిని కలవాలనే కనీస అవగాహన లేదు. ఎంతో ప్రయత్నిస్తే ఒక చిన్న అవకాశం వచ్చింది... కాస్ట్యూమ్ డిజైనర్ అసిస్టెంట్‌గా. ఎలాగో పరిశ్రమలోకి అడుగు పెట్టాను. 'బంగిస్తాన్, పికు, రయీస్' చిత్రాలకు పని చేశాను. అది నా కెరీర్‌కు ఏ విధంగానూ ఉపయోగపడలేదు. దాంతో మళ్లీ ఆలోచనలో పడ్డాను. అదే సమయంలో 'అనుపమ్ ఖేర్ యాక్టింగ్ స్కూల్' నిర్వహించిన వర్క్‌షాప్‌కు వెళ్లాను. ఆ తరువాత చాలా వర్క్‌షాప్‌లకు హాజరయ్యాను. ఇవన్నీ నటిగా ఎదగడానికి, నాలో ఆత్మవిశ్వాసం పెంపొందడానికి ఎంతో దోహదపడ్డాయి. ఐదేళ్ల ప్రయత్నం తరువాత 2020లో ఒక సినిమాలో అవకాశం లభించింది. ఆడిషన్స్‌కు వెళితే నిరాశే ఎదురైంది. అయితే మొదట వద్దన్న వారే మళ్లీ రమ్మన్నారు. నాలుగేళ్ల అనంతరం ఆ చిత్రం గత నెల విడుదల అయింది. అదే 'డిస్పాచ్'. మనోజ్‌బాజ్‌పాయ్‌తో కలిసి పని చేయడం వల్ల నటన పరంగానే కాకుండా చాలా విషయాలు నేర్చుకున్నాను. అంత స్టార్ అయినా ఆయనలో ఆ దర్పం కనిపించదు. నాలాంటి జూనియర్లతో కూడా సరదాగా ఉంటారు. అవసరమైనచోట సలహాలు ఇస్తారు. దర్శకుడి పనిని దర్శకుడికే వదిలేస్తారు. పాత్రలోకి ఒదిగిపోయాక దాన్ని పండించడానికి వంద శాతం కష్టపడతారు. అదే ఆయన్ను ప్రత్యేకంగా నిలిపిందని అనుకొంటున్నాను.

> **పెద్ద బ్రేక్...**
>
> సినిమాల మీద ప్రేమతో ముంబయి వచ్చినా... చదువు మానేయలేదు. ఒక పక్క చదువు కొంటూనే సినిమా ప్రయత్నాలు చేశాను. 'అనుపమ్ ఖేర్ యాక్టింగ్ స్కూల్'కు వెళ్లాక కూడా రకరకాల ప్రాజెక్టులు ఒప్పుకున్నాను. ఏడెనిమిది లఘుచిత్రాల్లో, పలు బ్రాండ్ల ప్రకటనల్లో నటించాను. కొన్ని యూట్యూబ్ సిరీస్‌లో చేశాను. వీటన్నిటి నేపథ్యంలోనే 'డిస్పాచ్' రూపంలో నాకు పెద్ద బ్రేక్ వచ్చింది. దీని తరువాత చాలామంది కాస్టింగ్ డైరెక్టర్లను కలిశాను. వాళ్ల కాల్ కోసం చూస్తున్నాను. అలాగే ఒక అస్సామీ చిత్రంలో నటిస్తున్నాను.

నాన్నను చూసి నేర్చుకున్నా...

తెరపై కనిపించాలని వచ్చిన నాకు నటి కావడానికి తొమ్మిదేళ్లు పట్టింది. ఈ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు. అడుగడుగునా సవాళ్లు. కానీ ఏ రోజూ వెనక్కి వెళ్లిపోవాలని అనుకోలేదు. ఈ పట్టుదల, మనం చేసే పనిపై విశ్వాసం మా నాన్నను చూసి నేర్చుకున్నా. ఆయన వ్యాపారవేత్త. బాగా డబ్బు సంపాదించారు. పోగొట్టుకున్నారు. తిరిగి సంపాదించాలని ఇప్పటికీ కష్టపడుతున్నారు. ఈ వయసులోనూ ఆయన పట్టు వదలని ప్రయత్నం చేస్తున్నారు. అలాంటిది నేనెందుకు చేయలేను? నిజాయతీగా ప్రయత్నిస్తే ఎప్పటికైన సత్ఫలితం వస్తుంది. అలా నాన్నను ప్రేరణగా తీసుకొని అడుగులు వేశాను."

దోశలు అంటుకోకుండా రావాలంటే...

ఒక్కోసారి దోశలు వేసినపుడు అవి పెనానికి అతుక్కుపోతుంటాయి. వాటిని పెనం నుంచి తీయడానికి ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. అలాగని నాన్‌స్టిక్ పాన్‌లను ఉపయోగించడం..... ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. దోశలు పెనానికి అంటుకోకుండా మంచి రంగులో క్రిస్పీగా రావాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం!

- ముందుగా పెనాన్ని జిడ్డు లేకుండా నున్నగా శుభ్రం చేసుకోవాలి. తరవాత స్టవ్ మీద పెట్టి చిన్న మంట మీద వేడి చేయాలి. పెనం మీద నీళ్లు చల్లితే చిటపటమంటూ వెంటనే ఆవిరైపోవాలి. అప్పుడే దోశ వేయడానికి పెనం అనుకూలంగా ఉంటుంది. ఒక పెద్ద ఉల్లిపాయను మధ్యకు కోసి దానితో పెనమంతా రుద్దాలి. తరవాత ఒక గంటెతో దోశ పిండిని పెనం మధ్యలో వేసి గుండ్రంగా వేగంగా రుద్దుతూ పెనమంతా పరచాలి. ఈ దోశ మీద కొన్ని నూనె చుక్కలు వేయాలి. మంట మధ్య స్థాయిలో ఉండేలా చూసుకుంటే ఒక నిమిషంలో చుట్టూ ఎర్రగా కాలి దోశ సులభంగా పెనం నుంచి విడివడుతుంది.



- ఒక గిన్నెలో గ్లాసు నీళ్లు తీసుకుని మూడు చెంచాల నూనె వేసి బాగా కలపండి. చిన్న గుడ్డ ముక్కను గుండ్రంగా మడిచి ఈ మిశ్రమంలో ముంచి దానితో వేడిగా ఉన్న పెనం మీద రుద్దాలి. తరవాత దోశ వేస్తే పెనానికి అంటుకోకుండా ఉంటుంది.
- పెనం వేడెక్కిన తరవాత దానిమీద అర చెంచా నూనె వేయాలి. ఒక బంగాళదుంపను తీసుకుని మధ్యకు కోసి ఒక భాగం మీద చాకుతో గాట్లు పెట్టి దానితో పెనమంతా నూనె అంటుకునేలా రుద్దాలి. తరవాత దోశ వేస్తే చక్కగా వేగి పెనం నుంచి సులువుగా వచ్చేస్తుంది.
- పెనాన్ని ఉపయోగించడానికి ముందు దాని మీద కొంచెం ఉప్పు వేసి ఐస్ ముక్కతో బాగా రుద్దాలి. దీనివల్ల పెనం పూర్తిగా శుభ్రమై పిండి అంటుకోకుండా దోశలు చక్కగా వస్తాయి.
- దోశల పిండిలో చిటికెడు పంచదార కలిపితే దోశలు ఎరుపు రంగులో వేగి పెనానికి అంటుకోవు. దోశల పిండి కోసం పప్పు, బియ్యం నానబెట్టేటపుడే అందులో ఒక చెంచా మెంతులు కలపడం వల్ల కూడా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

చాంపియన్స్ ట్రోఫీకి బుమ్రా దూరం?

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు పెద్ద ఎదురు దెబ్బ తగిలేలా ఉంది. జట్టు ప్రధాన పేసర్ బుమ్రా ఆ టోర్నమెంట్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు కనిపించడంలేదు. ఇటీవలి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ చివరి టెస్ట్ సందర్భంగా బుమ్రా వెన్ను నొప్పితో బాధపడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో..స్వదేశం తిరిగొచ్చాక అతడు గతంలో వెన్ను నొప్పికి చికిత్స చేయించుకున్న న్యూజిలాండ్ డాక్టర్‌నూ సంప్రదించాడు. ఇక..వెన్ను నొప్పి నుంచి కోలుకొనేందుకుగాను బుమ్రా బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి వెళ్లాల్సి ఉంది. కానీ ప్రస్తుతం అతడు ఎన్‌సీఏకి వెళ్లడంపై సందిగ్ధం ఏర్పడింది. 'వచ్చేవారం బుమ్రా ఎన్‌సీఏలో చేరాలి. కానీ ఈ విషయంలో ఇంకా స్పష్టత రాలేదు' అని బీసీసీఐ అధికారి తెలిపారు.

ఏడేళ్ల తర్వాత.. రంజీ బరిలో పంత్

న్యూఢిల్లీ: స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ ఏడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత రంజీ ట్రోఫీ బరిలో దిగుతున్నాడు. ఈనెల 23 నుంచి రాజ్‌కోట్‌లో సౌరాష్ట్రతో జరిగే మ్యాచ్‌లో ఢిల్లీకి ఆడనున్నట్టు పంత్ స్వయంగా తెలిపాడట. ఈ విషయాన్ని ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం కార్యదర్శి అశోక్ శర్మ బుధవారం వెల్లడించాడు. 2017-18 సీజన్‌లో పంత్ చివరిసారి రంజీ మ్యాచ్ ఆడాడు. అయితే మరో స్టార్ విరాట్ కోహ్లీ రంజీ మ్యాచ్‌లో ఆడే విషయమై స్పష్టత లేదని అలోక్ తెలిపాడు. ఇక..యువ ఆటగాడు యశస్వీ జైస్వాల్ ముంబై తరఫున రంజీ మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఈమేరకు అతడు జట్టులో చేరాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్..మంగళవారంనాడు వాంఖడే స్టేడియంలో ముంబై జట్టుతో కలిసి సాధనలో పాల్గొన్నాడు. కానీ అతడు రంజీ మ్యాచ్ బరిలో దిగుతాడా..లేదా..అన్నది మాత్రం తెలియరాలేదు. భారత జట్టు మరో బ్యాటర్ గిల్..పంజాబ్ తుదుపరి రంజీ మ్యాచ్‌లో పాల్గొననున్నట్టు ఇప్పటికే ప్రకటించాడు.

సింధు, అనుపమ ముందంజ

● **ఇండియా ఓపెన్‌లో ప్రణయ్, లక్ష్యకు నిరాశ**

న్యూఢిల్లీ: సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత సింగిల్స్ స్టార్లు లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ ఆరంభ రౌండ్లోనే కంగుతిన్నారు. మహిళల్లో పీవీ సింధు, అనుపమ ఉపాధ్యాయ శుభారంభం చేశారు. సింధు 21-14, 22-20తో సంగ్ షూ యన్ (తైవాన్)పై, అనుపమ 21-17, 21-18తో భారత్‌కే చెందిన రక్షితపై గెలిచి రెండో రౌండ్ చేరారు. ప్రణయ్ 21-16, 18-21, 12-21తో సూ లి యాంగ్ (తైపీ) చేతిలో, లక్ష్య 15-21, 10-21తో చున్ యి లిన్ (తైపీ) చేతిలో చిత్తయ్యారు. కాగా, కిరణ్ జార్జ్ 21-19, 14-21, 27-25తో యుషి తనక (జపాన్)పై గెలిచి పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక భారత షట్లర్‌గా నిలిచాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప/తనీషా జంట 21-11, 21-12తో సహచర ద్వయం కావ్య/రాధికను ఓడించి రెండో రౌండ్లో ప్రవేశించింది. మరో భారత జంట గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ 21-23, 19-21తో జపాన్ జోడీ హిగషినో/సకురమొటో చేతిలో ఓటమిపాలైంది.

మంధాన, ప్రతిక శతక జోరు
రికార్డుల హోరు

ఆఖరి వన్డేలో 304 పరుగులతో భారత్ గెలుపు

0-3తో ఐర్లాండ్ చిత్తు



ప్రతికా రావల్ (154)

రాజ్‌కోట్: సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు స్మృతీ మంధాన (80 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 135), ప్రతికా రావల్ (129 బంతుల్లో 20 ఫోర్లు, సిక్సర్‌తో 154) సెంచరీలతో కదం తొక్కారు. ఫలితంగా పరుగులు వెల్లువెత్తాయి. రికార్డులపై రికార్డులు నమోదయ్యాయి. దాంతో భారత్‌తో బుధవారం జరిగిన ఆఖరి వన్డేలో ఐర్లాండ్ అమ్మాయిలు ఏకంగా 304 పరుగులతో చిత్తయ్యారు. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను స్మృతి సేన 0-3తో దక్కించుకుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 435/5 స్కోరు చేసింది. కీపర్ రిచా ఘోష్ (42 బంతుల్లో 10 ఫోర్లు, సిక్సర్‌తో 59) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. ప్రెండెర్‌గాస్ట్ రెండు వికెట్లు పడగొట్టింది. అత్యంత భారీ లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 31.4 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. సారా ఫోర్బ్స్ (41), ప్రెండెర్‌గాస్ట్ (36) మాత్రమే భారత బౌలర్లను ఒకింత అడ్డుకున్నారు. దీప్తీ శర్మ మూడు, తనూజా కన్వర్ రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్'గా ప్రతికా రావల్ నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 435/5 (ప్రతిక 154, మంధాన 135, రిచా 59, తేజల్ 28, ప్రెండెర్‌గాస్ట్ 2/71).
ఐర్లాండ్: 31.4 ఓవర్లలో 131 ఆలౌట్ (సారా 41, ప్రెండెర్‌గాస్ట్ 36, దీప్తి 3/27, కన్వర్ 2/31).

ఎన్ని రికార్డులో ..

కెప్టెన్ మంధాన, ప్రతికా రావల్ సూపర్ షోతో మ్యాచ్ పలు రికార్డులకు వేదికైంది.

● 435/5.. భారత మహిళలు, పురుషుల జట్టుకు వన్డేలలో అత్యధిక స్కోరు. పురుషుల జట్టు అత్యధిక స్కోరు 418/5, 2011లో వెస్టిండీస్‌పై ఇండోర్‌లో సాధించింది. ఇక మహిళల జట్టు గత అత్యధిక స్కోరు 370/5ను ఈ సిరీస్ రెండో వన్డేలో చేసింది.

● 304 పరుగుల తేడా.. వన్డేలలో భారత మహిళలకు అతి భారీ విజయం. 2017లో సౌతాఫ్రికాలో ఐర్లాండ్‌పైనే 248 రన్స్ గెలుపు గత అత్యుత్తమం.

● మంధాన, రావల్ 233 పరుగుల భాగస్వామ్యం.. మహిళల వన్డేలలో భారత్ తరఫున నాలుగో ద్విశతక భాగస్వామ్యం.

● భారత ఓపెనర్లు ఇద్దరూ శతకాలు సాధించడం ఇది మూడోసారి. గతంలో రేష్మ, మిథాలి (1999, 258, ఐర్లాండ్‌పై), దీప్తీ శర్మ, పూనమ్ రౌత్ (2017, 320 పరుగులు, ఐర్లాండ్‌పై) ఈ ఫీట్ నమోదు చేశారు.

స్మృతీ మంధాన 70 బంతుల్లోనే..

స్మృతీ మంధాన 70 బంతుల్లోనే సెంచరీ చేసి అదరహో అనిపించింది. ఈ క్రమంలో ఆమె వన్డేల్లో వేగవంతమైన శతకం చేసిన భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కింది. దీంతో నిరుడు దక్షిణాఫ్రికాపై హర్మన్‌ప్రీత్ చేసిన 87 బంతుల రికార్డు తుడిచి పెట్టుకుపోయింది.



క్వార్టర్స్‌లో భారత్

ఖోఖో ప్రపంచ కప్

న్యూఢిల్లీ: భారత పురుషులు, మహిళల జట్లు అదిరే ఆటతో ఖోఖో ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకు పోయాయి. గ్రూప్-ఎలో తలపడుతున్న మహిళల జట్టు బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో 100-16 పాయింట్ల తేడాతో ఇరాన్‌ని చిత్తు చేసింది. మొదటి టర్న్‌లోని ఏకంగా 50 పాయింట్లు సాధించిన మన మహిళలు ఆ జోరును మిగిలిన మూడు టర్న్‌లలోనూ కొనసాగించారు. అంతకుముందు..మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 175-18 పాయింట్ల తేడాతో దక్షిణ కొరియాపై అద్భుత విజయంతో శుభారంభం అందుకుంది. నాలుగు జట్ల గ్రూప్-ఎలో మహిళల జట్టు రెండు విజయాలతో అగ్ర స్థానంలో కొనసాగుతోంది. ఇక..పురుషుల జట్టు హ్యాట్రిక్ కొట్టింది. బుధవారం జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో మనోళ్లు 70-38తో పెరూపై నెగ్గారు. తెలుగు ఆటగాడు పోతిరెడ్డి శివారెడ్డి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఇక..పోటీల తొలి రోజు నేపాల్‌ను ఓడించిన పురుషుల జట్టు మంగళవారం రెండో మ్యాచ్‌లో 64-34 స్కోరుతో బ్రెజిల్‌ను చిత్తు చేసింది. ఐదు జట్ల గ్రూపులో మొత్తం ఆరు పాయింట్లతో టాప్‌లో నిలిచింది.

'నార్వే చెస్' బరిలో హంపి

స్టావెంజర్ (నార్వే): తెలుగు గ్రాండ్‌మాస్టర్, వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్ కోనేరు హంపి ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో పోటీపడనుంది. ప్రస్తుతం మహిళల క్లాసికల్ చెస్‌లో ప్రపంచ ఆరో ర్యాంకులో ఉన్న హంపి తమ టోర్నీలో ఆడడం చాలా సంతోషంగా ఉందని నార్వే చెస్ నిర్వాహకులు వెల్లడించారు. ఈ టోర్నీ ఈ ఏడాది మే నెలలో జరగనుంది.

ఒలింపిక్ చాంపియన్‌కు షాక్

● కిన్వెన్ జెంగ్, రూడ్ అవుట్
● ఫెదరర్‌ను దాటేసిన జొకో
● అల్కారజ్ సబలెంక, ఒసాక, గాఫ్ ముందంజ
● ఆస్ట్రేలియన్ ఓపెన్



కిన్వెన్



లారా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాలుగో రోజు కొందరు స్టార్లకు చుక్కెదురైంది. మహిళల సింగిల్స్‌లో గతేడాది ఫైనలిస్టు, పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ కిన్వెన్ జెంగ్, ఆరో సీడ్ కాస్పర్ రూడ్ రెండో రౌండ్లోనే వెనుదిరిగారు. ఇక, 25వ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న నొవాక్ జొకోవిచ్ వరుసగా రెండో విజయంతో మూడో రౌండ్‌లో ప్రవేశించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-7(4), 6-3, 6-2తో పోర్చుగల్ క్వాలిఫయర్ జేమీ ఫరియాను ఓడించాడు. 37 ఏళ్ల జొకోవిచ్‌కు ఇది గ్రాండ్‌స్లామ్స్‌లో 430వ మ్యాచ్ కావడం విశేషం. ఈ క్రమంలో జొకో.. ఓపెన్ ఎరాలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లాడిన ఆటలాడిగా దిగ్గజం రోజర్ ఫెడరర్ (429) రికార్డును అధిగమించాడు. దీంతో నొవాక్ గ్రాండ్‌స్లామ్స్‌లో తన గెలుపోటముల రికార్డును 379-51కి పెంచుకున్నాడు. విఁగతా ఫేవరెట్ ఆటగాళ్లలో మూడో సీడ్ అల్కారజ్ 6-0, 6-1, 6-4తో నిషిఒకపై, రెండో సీడ్ జ్వెరేవ్ 6-1, 6-4, 6-1తో మార్టినెజ్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 6-7(7), 6-0, 6-3, 6-1తో నిషికోరిపై, 15వ సీడ్ డ్రేపర్ 6-7(7), 6-3, 3-6, 7-5, 6-3తో కొకినాకిస్‌పై గెలిచి మూడో రౌండ్ చేరారు. ఆరో సీడ్, 2022 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్టు కాస్పర్ రూడ్ 2-6, 6-3, 1-6, 4-6తో జాకుబ్ మెన్సిక్ (చెక్ రిపబ్లిక్) చేతిలో కంగుతిన్నాడు. గతేడాది పారిస్ విశ్వక్రీడల్లో మహిళల విజేతగా నిలిచి రికార్డుకెక్కిన చైనా స్టార్, ఐదో సీడ్ కిన్వెన్ జెంగ్‌కు జర్మనీకి చెందిన 36 ఏళ్ల లారా సిగెమండ్ షాకిచ్చి సంచలనం సృష్టించింది. లారా 7-6(3), 6-3తో 22 ఏళ్ల జెంగ్‌ను చిత్తుచేసింది. మిగతా స్టార్ క్రీడాకారిణుల్లో టాప్ సీడ్ సబలెంక 6-3, 7-5తో బౌజాస్‌పై, మూడో సీడ్ గాఫ్ 6-3, 7-5తో బురేజ్‌పై, ఏడో సీడ్ పెగులా 6-4, 6-2తో మెర్టెన్స్‌పై, మాజీ నెంబర్‌వన్ నవోమి ఒసాక 1-6, 6-1, 6-3తో ముచోవాపై గెలిచి మూడో రౌండ్లో ప్రవేశించారు.

డబుల్స్‌లో భారత్‌కు నిరాశ: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లు రోహన్ బోపన్న, యుకీ భాంబ్రీలకు నిరాశ ఎదురైంది. ఆరంభ రౌండ్లో బోపన్న/నికోలస్ ద్వయం 5-7, 6-7(5)తో మార్టినెజ్/మునార్ జోడీ చేతిలో ఓడగా.. భాంబ్రీ/అల్బానో ఒలివెట్టి జోడీ 2-6, 6-7(7)తో ట్రిస్టన్/ఆడమ్ చేతిలో పరాజయం పాలైంది.

పారిస్ పతకాల నాణ్యతపై విమర్శలు

● నాసిరకంగా ఉన్నాయన్న భాకర్, అమన్ ● కొత్తవి ఇస్తామన్న ఐఓసీ



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో విజేతలకు అందించిన పతకాలు నాసిరకంగా ఉన్నాయంటూ అథ్లెట్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది పారిస్ క్రీడల్లో రెండు కాంస్య పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన పిస్టల్ షూటర్ మనూ భాకర్, కంచు మోత మోగించిన యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది అథ్లెట్లు పతకాల నాణ్యతపై విమర్శలు గుప్పిస్తున్నారు. 'కాంస్య పతకంపైనున్న పూత తొలగిపోతోంది. ఒలింపిక్స్‌లో దక్కిన పతకంలా ఇది అనిపించడం లేదు' అని భాకర్ పేర్కొంది. తన పతకం కూడా నాణ్యమైనదిగా లేదని రెజ్లర్ అమన్ వ్యాఖ్యానించాడు. మరో ఇద్దరు షూటర్లు స్వప్నిల్, సరబ్‌జోత్‌ల పతకాలు కూడా మసకబారినట్టు సమాచారం. కాగా, పతకాలు లోపభూయిష్టంగా ఉన్నాయంటూ ప్రపంచవ్యాప్తంగా 100 మంది దాకా అథ్లెట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి వెనక్కిచ్చినట్టు తెలుస్తోంది. పతకాల నాణ్యతపై విమర్శలు వస్తుండడంతో ఐఓసీ స్పందించింది. వీటి స్థానంలో కొత్తవి అందజేస్తామని ప్రకటించింది.



తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న యువ క్రికెటర్ నితీష్‌కుమార్.



బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతలలో నిర్వహించిన సంక్రాంతి కప్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన ఎస్‌కేఎంసీసీ చెన్నై జట్టు. ఫైనల్లో సౌత్‌జోన్ సీసీ చెన్నై జట్టుపై ఎస్‌కేఎంసీసీపై గెలిచింది.

బిజినెస్

ఎగుమతులు మళ్లీ డీలా

డిసెంబరులో రూ.3.27 లక్షల కోట్లకు పరిమితం
వాణిజ్య లోటు రూ.1.89 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: భారత వస్తు ఎగుమతులు వరుసగా రెండో నెలలోనూ క్షీణించాయి. గత డిసెంబరులో ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన ఒక శాతం తగ్గి 3,801 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.3.27 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. అంతర్జాతీయ వాణిజ్య మార్కెట్లో అనిశ్చితుల నేపథ్యంలో పెట్రోలియం, వజ్రాభరణాలు, రసాయనాల ఎగుమతులు క్షీణించడం ఇందుకు కారణం. కాగా, గత నెలకు దిగుమతులు 5 శాతం పెరిగి 5,995 కోట్ల డాలర్లకు (సుమారు రూ.5.16 లక్షల కోట్లు) చేరాయి. దాంతో వాణిజ్య లోటు 2,194 కోట్ల డాలర్లుగా (రూ.1.89 లక్షల కోట్లు) నమోదైంది. గత ఏడాది నవంబరులోనైతే వాణిజ్యలోటు ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయికి పెరిగింది. ఎగుమతులు క్షీణించడంతోపాటు బంగారం, వెండి, వంటనూనెలు, ఎరువుల దిగుమతులు భారీగా పెరగడం ఇందుకు దోహదపడింది. కాగా, గతనెలకు సేవల ఎగుమతులు 3,266 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2.81 లక్షల కోట్లు) పెరిగి ఉండవచ్చని వాణిజ్య శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది.

నవంబరు గణాంకాల్లో సవరణ

కేంద్ర వాణిజ్య శాఖ 2024 నవంబరు వాణిజ్య గణాంకాలను సవరించింది. ఎగుమతులను 5.06 శాతం తగ్గుదలతో 3,203 కోట్ల డాలర్లకు, దిగుమతులను 16 శాతం పెరుగుదలతో 6,386 కోట్ల డాలర్లకు కుదించింది. తద్వారా వాణిజ్య లోటు 3,183 కోట్ల డాలర్లకు తగ్గింది. పసిడి దిగుమతుల లెక్కింపులో తప్పిదం ఇందుకు కారణమైనట్టు తెలిపింది. నవంబరులో పసిడి దిగుమతులు సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి 1,486 కోట్ల డాలర్లకు పెరిగాయని తొలుత వెల్లడించిన కేంద్రం.. తన తప్పిదాన్ని సరిదిద్దుకుంది. పసిడి దిగుమతులను 500 కోట్ల డాలర్ల మేర తగ్గించి 984 కోట్ల డాలర్లకు కుదించింది.

ఏప్రిల్-డిసెంబరు కాలానికి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన 9 నెలల కాలానికి ఎగుమతులు 1.6 శాతం వృద్ధితో 32,171 కోట్ల డాలర్లకు చేరగా.. దిగుమతులు 5.15 శాతం పెరుగుదలతో 53,248 కోట్ల డాలర్లకు ఎగబాకాయి. దాంతో వాణిజ్య లోటు 21,077 కోట్ల డాలర్లుగా నమోదైంది.

రెండేళ్ల గరిష్ఠానికి ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు

గత నెలలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు 35.11 శాతంవృద్ధితో 358 కోట్ల డాలర్లకు (రూ.30,788 కోట్లు) పెరిగాయని వాణిజ్య శాఖ వెల్లడించింది. ఇది రెండేళ్ల గరిష్ఠ స్థాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రోత్సాహకాలతో దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ బాగా పుంజుకుందనడానికిదే నిదర్శనమని సునీల్ భరత్‌వాల్ అన్నారు. గత నవంబరులో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 347 కోట్ల డాలర్లుగా, అక్టోబరులో 343 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

వాణిజ్య గణాంకాల కోసం డేటా అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి

ఎగుమతి, దిగుమతి వాణిజ్య గణాంకాల్లో మెరుగైన అంతర్దృష్టి కోసం కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత మద్దతుతో డేటా అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయనున్నట్టు వాణిజ్య కార్యదర్శి భరత్‌వాల్ వెల్లడించారు. త్వరలోనే దీన్ని ప్రారంభించనున్నట్టు ఆయన చెప్పారు.

3 భారతీయ సంస్థలపై అమెరికా ఆంక్షల తొలగింపు

న్యూయార్క్: అమెరికాకు చెందిన బ్యూరో ఆఫ్ ఇండస్ట్రీ అండ్ సెక్యూరిటీ(బీఐఎస్) తన ఆంక్షల జాబితా నుంచి 3 భారతీయ అణు రంగ సంస్థల పేర్లను తొలగించింది. అమెరికా జాతీయ భద్రత, విదేశీ విధాన ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయన్న కారణంగా 11 చైనా కంపెనీలను కొత్తగా ఈ లిస్ట్‌లో చేర్చింది. అమెరికా ఆంక్షల జాబితా నుంచి తొలగించిన భారత సంస్థల్లో ఇండియన్ రేర్ ఎర్త్, ఇందిరా గాంధీ ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(ఐజీసీఏఆర్), బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్) ఉన్నాయి. భారత్-అమెరికా మధ్య అణు సహకారానికి ఉన్న అవరోధాలను తొలగించే దిశగా చర్యలు చేపట్టబోతున్నట్లు అమెరికా జాతీయ భద్రత సలహాదారు(ఎన్ఎస్ఏ) జేక్ సుల్లివన్ వ్యాఖ్యానించిన వారం రోజులకే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. 16 ఏళ్ల క్రితం భారత్‌తో అమెరికా కుదుర్చుకున్న పౌర అణు ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రయత్నంగా అమెరికా తాజా చర్యను చూడవచ్చు. అగ్రరాజ్యం తాజా నిర్ణయంతో అణు రంగంలో భారత్-అమెరికా పరస్పరం సహకరించుకోవడంతోపాటు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

కర్నూలు జిల్లాలో మెగా సోలార్ ప్రాజెక్టు

» రూ.10,000 కోట్లతో రిలయన్స్ పవర్ ఏర్పాటు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో రూ.10,000 కోట్ల పెట్టుబడితో మెగా సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయబోతున్నట్లు అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ లిమిటెడ్ బుధవారం ప్రకటించింది. రిలయన్స్ పవర్ పూర్తి అనుబంధ విభాగమైన రిలయన్స్ ఎన్‌యూ సన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్ట్‌ను బిల్డ్-ఓన్-ఆపరేట్ పద్ధతిన నిర్మించనుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 930 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్‌తోపాటు 1,860 మెగా వాట్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వసతిని సైతం ఏర్పాటు చేయనుంది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఈసీఐ) ఉమ్మడి భాగస్వామ్యంలో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి.. విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకున్న 24 నెలల్లో ప్రారంభం కానుంది. ఈ కంపెనీ నుంచి 25 ఏళ్ల పాటు విద్యుత్ కొనుగోలుకు ఎస్ఈసీఐ పీపీఏ కుదుర్చుకోనుంది. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను దేశంలోని పలు డిస్కమ్‌లకు సరఫరా చేయనున్నారు. దక్షిణాదికి కీలక మైలురాయి కానున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణ దశలో 1,000 మంది కి ప్రత్యక్షంగా, 5000 మందికి పరోక్షంగా ఉపాధి లభించనున్నట్టు అంచనా.

'మెటా'లో మరో 3,600 మంది ఔట్

వాషింగ్టన్: అమెరికా టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. తాజాగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, థ్రెడ్స్ మాతృ సంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్ ఉద్యోగాల కోతకు దిగింది. తన ఉద్యోగుల్లో ఐదు శాతం మందిని పనితీరు బాగోలేదనే పేరుతో ఇంటికి పంపిస్తోంది. తాజా గణాంకాల ప్రకారం మెటాలో ప్రపంచ వ్యాప్తంగా 72,000 మంది పని చేస్తున్నారు. వీరిలో ఐదు శాతం అంటే 3,600 మంది త్వరలో ఉద్యోగాలు కోల్పోనున్నారు. వీరి స్థానంలో కొత్త ఉద్యోగులను తీసుకుంటామని మెటా సీఈఓ మార్క్ జుకర్‌బెర్గ్ చెప్పారు. తీసివేతల విషయం అమెరికాలోని ఉద్యోగులకు ఈ నెల 10వ తేదీనే తెలిపారు. ఇతర దేశాల్లోని ఉద్యోగులకూ త్వరలోనే ఈ వార్త అందనుంది.

మార్కెట్లో రిలీఫ్ ర్యాలీ

200 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా పలు ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ముడిచమురు సెగలు, విదేశీ పెట్టుబడులు ఉపసంహరణ వంటి అంశాలు మాత్రం లాభాలను పరిమితం చేశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 491.42 పాయింట్లు ఎగబాకినప్పటికీ, చివరికి 224.45 పాయింట్ల లాభంతో 76,724.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 37.15 పాయింట్ల వృద్ధితో 23,213.20 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.34 శాతం వరకు పెరిగాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 169.62 పాయింట్లు, నిఫ్టీ 90.10 పాయింట్లు లాభపడ్డాయి.

● భారత్ కరెన్సీ కూడా వరుసగా రెండో రోజూ బలపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 13 పైసలు పెరిగి రూ.86.40 వద్ద ముగిసింది. మంగళవారం సెషన్‌లోనూ రూపాయి మారకం విలువ 17 పైసలు పెరిగింది.

● లక్ష్మీ డెంటల్ పబ్లిక్ ఆఫరింగ్‌కు భారీ స్పందన లభించింది. బుధవారంతో ముగిసిన ఈ రూ.698 కోట్ల ఆఫర్‌కు ఏకంగా 113.97 రెట్ల బిడ్లు వచ్చాయి.

వేదాంత రిసోర్సెస్ 110 కోట్ల డాలర్ల సమీకరణ: రెండు విడతల బాండ్ల జారీ ద్వారా వేదాంత రిసోర్సెస్ 110 కోట్ల డాలర్లు సమీకరించింది. ప్రస్తుత రుణభారాన్ని తగ్గించుకునేందుకు ఈ నిధులను వినియోగించుకోనుంది. 2024 సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు బాండ్ల జారీ ద్వారా కంపెనీ 310 కోట్ల డాలర్లు సేకరించింది.

ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్ రూ.4,789 కోట్ల సేకరణ: ప్రమోటర్లకు ప్రిఫరెన్షియల్ ఇష్యూతో పాటు క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా మొత్తం రూ.4,789 కోట్లు సమీకరించనున్నట్లు ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ (ఏబీఎఫ్ఆర్ఎల్) వెల్లడించింది. వ్యాపార వృద్ధి కోసం ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు కంపెనీ తెలిపింది.

పన్నుల భారం తగ్గించాలి

ఇక్రా బడ్జెట్ విన్నపం



న్యూఢిల్లీ: వచ్చే కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) భారం తగ్గించక తప్పదని ప్రముఖ రేటింగ్ సంస్థ ఇక్రా స్పష్టం చేసింది. ఈ భారం తగ్గితే తప్ప వినియోగ వ్యయం పెరిగి జీడీపీ వృద్ధి రేటు పుంజుకునే అవకాశం లేదని పేర్కొంది. గత సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి పడిపోయిన నేపథ్యంలో ఇక్రా ఈ హెచ్చరిక చేసింది. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులు కూడా రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండాలని సూచించింది.

రూ.1.4 లక్షల కోట్ల లోటు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.11.11 లక్షల కోట్ల మూలధన పెట్టుబడుల్లో రూ.1.4 లక్షల కోట్లు లోటు ఏర్పడే అవకాశం ఉందని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ చెప్పారు. గత ఏడాది ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో మొత్తం మూలధన పెట్టుబడుల్లో 46 శాతం (రూ.5.13 లక్షల కోట్లు) మాత్రమే ఖర్చు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఆర్థిక సంవత్సరానికి రుణ సేకరణను నియంత్రిస్తూ మూలధన పెట్టుబడులు రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చర్యలు తీసుకోవాలన్నారు.

4.5 శాతం ద్రవ్య లోటు సాధ్యమే : ఆదాయ వృద్ధిరేటును పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ద్రవ్యలోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయడం పెద్ద కష్టమేమీ కాదని నాయర్ స్పష్టం చేశారు. అపుడు మూలధన పెట్టుబడుల కోసం రూ.11 లక్షల కోట్లు కేటాయించడం సాధ్యమవుతుందన్నారు.

దిగుమతులు కట్టడి చేయాలి : ఈవై

పడిపోతున్న రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై సూచించింది. ఇందుకోసం దిగుమతులపై సుంకాలు పెంచాలని కోరింది. ఇలా చేయడం వల్ల డాలర్లకు గిరాకీ తగ్గి, రూపాయి మారకం రేటు కుదు టపడుతుందని తెలిపింది.

పన్నుపోటు తగ్గించండి: క్రెడాయ్

అందుబాటు ధరల (అఫర్డబుల్) గృహ ప్రాజెక్టులపై ఆదాయ పన్ను 15 శాతానికి కుదించాలని రియల్ ఎస్టేట్ రంగం కోరింది. అలాగే ఈ తరహా ప్రాజెక్టులు చేపట్టే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరింది. అలాగే అందుబాటు ధరల గృహ నిర్వచనాన్నీ ప్రస్తుతం రూ.45 లక్షల నుంచి మరింత పెంచాలని విజ్ఞప్తి చేసింది.

టూ వీలర్లపై జీఎస్‌టీ తగ్గించాలి : హీరో మోటోకార్ప్

కనీసం 125 సీసీ వరకు సామర్థ్యం ఉన్న ద్విచక్ర వాహనాలపై జీఎస్‌టీని 28% నుంచి 18% స్థాయికి కుదించాలని హీరో మోటోకార్ప్ కోరింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,080 ▲	73,410 ▲	1,01,000 ▼
విజయవాడ	80,900 ▼	76,500 ▲	92,000 ▼
విశాఖపట్నం	78,840 ▲	72,270 ▲	91,250 ▲
రాజమండ్రి	80,070 ▲	73,400 ▲	91,200 ▼
ప్రొద్దుటూరు	79,700 ▼	73,800 ▼	91,500 ▼
ముంబై	78,420 ▲	71,840 ▲	89,550 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	131
వరంగల్	117	గుంటూరు	130
కరీంనగర్	117	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	100
కర్నూలు	117	నెల్లూరు	105
విశాఖపట్నం	127	అనంతపురం	105
గోదావరి	131		

కోళ్ల కొట్లాట



తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో తలపడుతున్న కోడిపుంజులు

బండ లాగే ఎద్దులు



కడపలో బండలాగుడు పందెంలో ఎద్దులు

పందుల ఫైటింగ్



తాడేపల్లిగూడెంలో నిర్వహించిన పందేలలో తలపడుతున్న పందులు

పొట్టేళ్ల పోరు



ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులో నిర్వహించిన పందేలలో పొట్టేళ్ల ఫైటింగ్

కోట్లలో కూత

(మొదటి పేజీ తరువాయి)

జరిగాయి. తూర్పుగోదావరి జిల్లాలో రూ.150కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.100కోట్లుకుపైగా పందేలు, గుండాట వ్యాపారం జరిగింది. వెరసి మొత్తం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంతా కలిపి 1500కిపైగా బరుల్లో పందేలు జరిగాయి.





మెడలో రెండు కేజీలు తగ్గకుండా బంగారపు గొలుసు... చేతి వేళ్లకు ఎనిమిది ఉంగరాలు... ముంజేతికి పసిడి తొడిగిన పూసల దండలు.. ఒక్కమాటలో ఈయనో బంగారుబాబు! పేరు దేగల నాగేంద్ర. కాకినాడ జిల్లా కరపలోని కొరుపల్లి బరిలో పండగ మూడు రోజులు 64 పందేలు సాగగా, అందులో ఎక్కువ పందేల్లో విజేతగా నిలిచారు. మహీంద్రా థార్ జీపును గెలుచుకున్నారు.

గుండాట కూడా కోట్లలోనే..

గుండాటలో కాకినాడ జిల్లాలో వ్యాపారులకు లక్షలకు లక్షలు కురిపించాయి. ఒక్కో గ్రామంలో ఏర్పాటు చేసిన బరుల వద్ద రెండు నుంచి నాలుగు వరకు గుండాట బోర్డులు ఏర్పాటు చేసి లక్షల్లో లావాదేవీలు జరిపారు. ప్రత్తిపాడు మండలంలోని ఓ గ్రామంలో మూడురోజులకు కలిపి ఓ గుండాట నిర్వాహకుడు ఏకంగా రూ.1.20కోట్ల వ్యాపారం నిర్వహించారు. ఇందులో సదరు వ్యాపారి రూ.25లక్షలు సంపాదించాడు. మురమళ్ల, కరపలో గుండాట నిర్వాహకులు రూ.కోటికిపైగా సంపాదించారు. కాకినాడ జిల్లాలో 490వరకు బరులు ఏర్పాటవగా, రూ.250కోట్ల పందేలు జరిగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడిపందేలు, పేకాట, గుండాట జోరుగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు జగ్గయ్యపేట నుంచి మచిలీపట్నం, హనుమాన్ జంక్షన్ వరకు బరులను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో సాగిన కోడి పందాల్లో రూ.400 కోట్లు చేతులు మారాయి. కొన్ని చోట్ల భోగి రోజు మందకొడిగా పందేలు సాగినప్పటికీ సంక్రాంతి, కనుమ రోజున పందేలు జోరందుకున్నాయి. ఈసారి జిల్లా వ్యాప్తంగా లెక్కకు మించి బరులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి బరి వద్దా జనం పలచగా కనిపించారు.

కొత్తబట్టలు.. గారెలు

జూదరులను ఆకర్షించేందుకు నిర్వహకులు కొత్త దారుల్లో ప్రయత్నించారు. బాపట్ల జిల్లా నగరం మండలంలోని ఒక పేకాట శిబిరంలో కొత్తబట్టలు, నాటుకోడి పులుసుతో రాగిసంకటి, గారెలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్కో పందెం రూ.లక్ష నుంచి రూ.7 లక్షల వరకు కొనసాగాయి. వీఐపీ బరుల్లో రూ.3 నుంచి రూ.5 లక్షలపైనే పందాలు వేశారు. ఒక్కో బరిలో రోజుకు 70 నుంచి 100కుపైగా పందేలు వేశారు. ఇందుకు తమ వంతు సహకారం అందించిన పోలీసులు, మిగిలిన శాఖల అధికారులకు కలిపి ఒక్కో బరికి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు మామూళ్లు అందాయని చెబుతున్నారు. కొన్ని బరుల్లో మహిళా యాంకర్‌లు ఆకర్షణగా నిలిస్తే, మరికొన్ని చోట్ల హిజ్రాలు నృత్యాలతో సందడి చేశారు.

కనిపించని పోలీసింగ్..

హోం మంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గం పాయకరావుపేట పరిధిలోని నక్కపల్లి మండలం వేంపాడు, సత్యవరం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. ఈ శిబిరానికి ఎంపీ సీఎం రమేశ్ కుటుంబసమేతంగా హాజరై సందడి చేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో భుజబలపట్నంలో వేసిన అతి పెద్ద బరిని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తదితరులు సందర్శించారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం జుత్తాడ, పులగాలిపాలెంలలో పోలీసులు దాడులు నిర్వహించి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పోలీసులు, మిగిలిన శాఖల అధికారులకు కలిపి ఒక్కో బరికి రూ.లక్ష నుంచి రూ. ఐదులక్షల వరకు మామూళ్లు అందాయని చెబుతున్నారు.

'కోడిని గెలిచిన కోడి ఇది..'

కడప జిల్లా వేములలో పోలీసులు ఐదుగురు పందెంరాయుళ్లను, నాలుగు కోడి పుంజులను స్టేషన్‌కు తరలించారు. వారినుంచి రూ.13వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకుని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. 'అది కోళ్లను గెలిచిన కోడి' అంటూ పోలీసుల స్వాధీనంలో ఉన్నవాటిలో ఒక దానిని తీసుకెళ్లారు.

గెలిచిన డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లిలో కోడిపందేల శిబిరంవద్ద ఏర్పాటు చేసిన గుండాటలో రూ.200 గెలుచుకున్నప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో జరిగిన వివాదంతో కొమ్మిశెట్టి గంగాధర్(18) అనే యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. మోటార్‌సైకిల్ నుంచి పెట్రోలు తీసి మీద పోసుకుని నిప్పంటించుకున్నాడు. అనంతరం భయాందోళనకు గురై పక్కనే ఉన్న నీళ్ల బోదెలోకి దూకాడు. అప్పటికే శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. ఆయనను వెంటనే స్థానికులు తణుకు ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

పారిన తెలంగాణ మద్యం

ఏలూరు జిల్లావ్యాప్తంగా దాదాపు 80 కోట్ల రూపాయలు కోడి పందేల రూపంలోను, మరో 30 కోట్ల రూపాయలు పేకాటలోను జనం చేతులు మారాయి. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా బరులన్నింటిలోనూ ఎలాంటి బెరుకు లేకుండా పేకాట, గుండాట యథేచ్ఛగా సాగాయి. బరుల వద్ద మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. తెలంగాణ సరిహద్దున ఉన్న చింతలపూడి నియోజకవర్గానికి పెద్దఎత్తున తెలంగాణవాసులు తరలివచ్చారు. వస్తూ వస్తూ తెలంగాణ మద్యం తెచ్చారు. కొంత మంది పందేల మాటున ఆ మద్యం విక్రయించారు. నూజివీడులో జరిగిన కోడి పందేలకు తెలంగాణ మాజీ ఎమ్మెల్యే మచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు.

కుమ్మేసుకున్న పొట్టేళ్లు..

చందర్లపాడు, జనవరి 15: సంక్రాంతి పండుగ అంటే ముందుగా గుర్తొచ్చేది కోడి పందేలు. రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల కోడి పందేలు జోరుగా సాగాయి. అయితే ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలంలో దీనికి భిన్నంగా పొట్టేలు పందేలు అందర్నీ ఆకట్టుకున్నాయి. చందర్లపాడులోని కొందరు తమ పొట్టేళ్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పోటీలకు తీసుకొచ్చారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోటీల్లో పొట్టేళ్లు కుమ్మేసుకున్నాయి. పోటీల అనంతర విజేతలకు బహుమతులు అందజేశారు. కోమటి అజేష్‌కు చెందిన పొట్టేలు మొదటి బహుమతిని సొంతం చేసుకుంది.

జల్లికట్టులో నలుగురికి గాయాలు

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జల్లికట్టులో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలో బుధవారం అట్టహాసంగా జల్లికట్టు నిర్వహించారు. ఈ సందర్భంగా వందకుపైగా ఎద్దులను వదిలారు. ఎద్దులకు కట్టిన బహుమతులను చేజిక్కించుకోడానికి యువత పోటీ పడగా, వారినీ, తిలకించేందుకు వచ్చిన జనాన్నీ ఎద్దులు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.





తిరుపతి జిల్లా ఎ.రంగంపేటలో జల్లికట్టును తిలకించేందుకు భారీగా తరలి వచ్చిన జనం

ఆర్టీసీ కిటకిట

- తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సులూ ఫుల్లే
- ఐదు రోజులు... 500 స్పెషల్స్

విజయవాడ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి సొంత ఊళ్లకు వచ్చిన వారిని తిరిగి వారి వారి గమ్యస్థానాలకు చేర్చడానికి వీలుగా ఆర్టీసీ అధికారులు భారీ సంఖ్యలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. 19వ తేదీ వరకు... 500 ప్రత్యేక బస్సులను నడపడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కనుమ రోజున పెద్దగా ప్రయాణాలు ఉండవని ఆర్టీసీ అధికారులు భావించారు. వారి ఊహకు భిన్నంగా ప్రయాణాలు ప్రారంభం కావడంతో 15వ తేదీ బుధవారం నుంచే ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. బుధవారం ఒక్క రోజునే సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్ రూట్‌లో 45 ప్రత్యేక బస్సులు నడిపారు. రాత్రికి ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు చెపుతున్నారు. బెంగళూరు రూట్‌లో 4, చెన్నై రూట్‌లో 3 ప్రత్యేక బస్సులను నడిపారు. ఇవి కాకుండా లోకల్‌గా మరో 10 బస్సుల వరకు నడిపారు. ఈ నెల 19 వరకు సెలవులు ఉండటంతో అప్పటి వరకు స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించారు. హైదరాబాద్ రూట్‌లో ప్రతి రోజూ సగటున 50 స్పెషల్ బస్సులకు తక్కువ కాకుండా నడపాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్రత్యేక బస్సులకూ రిజర్వేషన్ లేదు

తిరుగు ప్రయాణంలోనూ ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరకని పరిస్థితి. షెడ్యూల్ బస్సుల్లో పండగకు పక్షం రోజుల ముందే తిరుగు ప్రయాణాలకు టికెట్లు బుక్ అయ్యాయి. ఆర్టీసీ అధికారులు రోజుకు 50 చొప్పున ప్రత్యేక బస్సులకు కూడా రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. దీంతో దాదాపుగా ఇవి కూడా హౌస్‌ఫుల్ అయిపోయాయి. మరిన్ని ప్రత్యేక బస్సులు ప్రకటించి రిజర్వేషన్ కల్పిస్తే తప్ప సీట్లు అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. కాగా, రైల్వే ఇప్పటికే విశాఖపట్నం-విజయవాడల మధ్య ప్రత్యేక రైళ్లను ప్రకటించిన విషయం తెలిసిందే.



విజయవాడలోని రామవరప్పాడులో మంగళవారం రాత్రి సంక్రాంతి సంబరాలు



ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో గుండాట



విజయవాడ రామవరప్పాడులో కోడి పందేలను తిలకిస్తున్న మహిళలు

ఆకర్షించిన ఆఫర్లు



పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం దొండ్లవాగులో కోడిపందేలకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం పెద అమిరం, సీసలిలో పెద్ద బరులు ఏర్పాటయ్యాయి. ఇక్కడ ముసుగు పందేలు జోరుగా సాగాయి. తాడేపల్లిగూడెంలో ఒక్కో ముసుగు పందెం రూ.27 లక్షలు కాశారు. యూనికార్న్, యాక్టివా వంటి ఆఫర్‌లు భీమవరంలో ప్రకటించారు. భీమవరం, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పందెం రాయుళ్లు చెరో వాహనాన్ని దక్కించుకున్నారు. నర్సాపురం, మొగల్తూరు మండలాల్లోని హోటళ్లలో పేకాటలు జరిగాయి. జబర్దస్త్ టీమ్‌తో పాటు యాంకర్ శ్రీముఖి పండగ రెండు రోజులూ నర్సాపురంలో సందడి చేశారు. సినీ గాయకులు విచ్చేశారు. యలమంచిలిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించి తొమ్మిది బంగారు నాణేలను మహిళలకు ప్రథమ బహుమతులుగా ఇచ్చారు. మహిళల కోసం ప్రత్యేకంగా గుండాట టేబుళ్లు ఏర్పాటుచేశారు. అక్కడే విందు భోజనాలు ఏర్పాటుచేశారు. సమీపంలో కోడి పందేల బరి నిర్వహించారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలో కోడి పందేల్లో విజేతలకు బహుమతిగా 12 బైక్‌లను అందజేశారు. కాకినాడ జిల్లాలోని కరప మండలంలో ఎక్కువమంది పందెంరాయుళ్లను ఆకర్షించడానికి గిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. పందేల్లో ఎవరు ఎక్కువ గెలిస్తే వారికి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్లను మూడురోజులపాటు అందించారు. కరపలోని కొరుపల్లి బరిలో మూడురోజుల జరిగిన 64 కోడిపందేల్లో ఎక్కువ పందేలు గెలిచిన దేగల నాగేంద్ర అనే (గోల్డ్‌మ్యాన్) వ్యక్తికి మహీంద్రా థార్ జీపును కనుమరోజు అందించారు. ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన సత్తిరెడ్డి, ఆత్రేయపురం మండలం మెర్లపాలేనికి చెందిన గోవిందు, అమలాపురం రూరల్ మండలం మాగాంకు చెందిన సురేష్‌చౌదరి బుల్లెట్ దక్కించుకున్నారు. మండపేటలో హోండా యాక్టివా ద్విచక్రవాహనాలు ఇచ్చారు. పందేల తొలిరోజు పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట ప్రాంతాలకు చెందిన వారు రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిళ్లను గెలిచారు.

పులివెందులలో పందేల జోరు

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కొణిజేడు కొండల వద్ద మంగళ, బుధవారాల్లో రూ.కోట్లలో పందెం నడిచింది. ప్రతి రోజూ 30 జతలకు తగ్గకుండా పందేలు వేశారు. పైపందేలు సైతం పెద్దఎత్తున జరిగాయి. బరుల వద్ద మందు, బిర్యానీ, తినుబండారాల దుకాణాలను ఏర్పాటుచేశారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె, పులివెందుల, లింగాల, చక్రాయపేట మండలాల్లో పందేలు కోట్లలో సాగాయి. రెండు మూడు చోట్ల ముక్కలాట కూడా నిర్వహించారు. పులివెందులలో ఓ చోట ప్రవేశ రుసుం కట్టిన తర్వాతే బరిలోకి అనుమతించారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, కడప తదితర నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన కొన్ని బరుల్లో కోడి పందేల నిర్వాహకులు అక్కడకు వచ్చిన వారందరికీ తాగునీరు, భోజన వసతి ఏర్పాటుచేశారు. మద్యం విక్రయించారు.



తూర్పుపాలెంలో పందెం మనదే గెలిచిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్న మంత్రి అనగాని, పక్కన ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు

కాలుకదపకుండానే గెలిచిన పుంజు

భీమడోలు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఒక్కోసారి ఏమీ చేయకుండా ఉంటేనే కలసివస్తుంది. దానికి ఉదాహరణే ఓ కోడిపుంజు గెలుపు. కదన రంగంలో కనీసం కాలు కదపకుండానే విజయం సాధించింది. కోడి పందేలు చివరి దశకు చేరుకున్న క్రమంలో పోరాడకుండానే గెలిచిన ఆ పుంజు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా భీమడోలులో మూడు రోజులుగా కోడి పందేలు జరుగుతున్నాయి. బుధవారం చీకటి పడే వేళకు పందేలు ముగించాల్సి ఉండగా ఇక ఐదు పుంజులు మిగిలాయి. ఈసారి ఒకే పందెం వేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఒక్కోదానిపైన రూ.పది వేలు పందెం కాశారు. అంటే చివరికి మిగిలిన కోడికి మిగిలిన నలుగురు నలభై వేలు ఇవ్వాలి. ఐదు పుంజులను బరిలోకి దింపారు. రసంగి రకం పుంజు వీరోచితంగా పోరాడి మిగిలిన మూడు పుంజులను మట్టి కరిపించింది. ఈ పోరు జరుగుతున్నంత సేపు అబ్రాస్ రకం కోడి కాలు కదపలేదు. మిగిలిన పుంజుల పోరాటాన్ని చూస్తూ ఉండిపోయింది. చివరకు దగ్గరకు రాగానే అప్పటికే అలసిపోయి.. రక్తమోడుతున్న రసంగి నేలకొరిగింది. అబ్రాస్ విజేతగా నిలిచింది.



గెలిచిన కోడి (వృత్తంలో)



కోనసీమ జిల్లా ఐ.పోలవరంలో భారీసంఖ్యలో కోడిపందేలు తిలకిస్తున్న జనం

టీడీపీ @ 1,00,20,065!

- సంక్రాంతి వేళ పార్టీ సభ్యత్వాల రికార్డు బద్దలు
- పార్టీ ఆవిర్భావం తర్వాత కోటి మార్కుకు తొలిసారి
- టాప్‌లో నెల్లూరు నగరం.. ఐదో స్థానంలో కుప్పం

అమరావతి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు రికార్డు స్థాయిలో కోటి మార్కును దాటాయి. ఆ పార్టీ ఆవిర్భావం తర్వాత ఇంత పెద్దసంఖ్యలో నమోదు కావడం ఇదే ప్రథమం. సంక్రాంతి పండుగ వేళ టీడీపీ ఈ మైలురాయిని చేరుకోవడం విశేషం. మంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు నగరం రాష్ట్రంలోనే టాప్‌లో నిలిచింది. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం ఐదో స్థానంలో ఉంది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన వంద రోజుల్లోనే టీడీపీ కోటి మార్కును అధిగమించింది. ఈ కార్యక్రమాన్ని గతేడాది నవంబరులో లాంఛనంగా మొదలు పెట్టారు. బుధవారం నాటికి ఆ పార్టీ సభ్యత్వం అధికారికంగా 1,00,20,065కు చేరింది. ఈ నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొద్దిరోజుల్లో నిలిపివేస్తారని టీడీపీ వర్గాల సమాచారం. తెలంగాణలో సుమారు 15 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయి.

నాలుగో స్థానంలో రాజంపేట

నెల్లూరు నగరంలో అత్యధికంగా 1,49,000 సభ్యత్వాలు నమోదయ్యాయి. దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి నియోజకవర్గం ఆత్మకూరు (1,48,797), నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గం పాలకొల్లు (1,48,559) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. రాజంపేట (1,45,000) నాలుగో స్థానంలో నిలిచింది. ఇక చంద్రబాబు నియోజకవర్గం కుప్పం 1.38 లక్షలతో ఐదో స్థానంలో ఉంది. డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు నియోజకవర్గం ఉండి (1.21 లక్షలు), యరపతినేని శ్రీనివాసరావు నియోజకవర్గం గురజాల (1.11లక్షలు), చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు నియోజకవర్గం వినుకొండ (1.06లక్షలు), మంత్రి లోకేశ్ నియోజకవర్గం మంగళగిరి (1.06 లక్షలు), సురేంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కల్యాణదుర్గం(1.01 లక్షలు) వరుసగా టాప్-10లో ఉన్నాయి. ఇక కోవూరు, భీమిలి, ఉదయగిరి, కదిరి, కనిగిరి, పెనుకొండ, కావలి, కడప, రాప్తాడు, రాయదుర్గం 11 నుంచి 20 స్థానాలు సాధించాయి. ఈ 20 నియోజకవర్గాల్లో రాజంపేటకు వైసీపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కల్యాణదుర్గం, కోవూరు, ఉదయగిరి, పెనుకొండ, కావలి, కడపలో తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రఘురామరాజు తొలిసారి ఎమ్మెల్యే అయినా ఆయన గతంలో లోక్‌సభ సభ్యుడిగా పనిచేశారు.

ప్రతి ఇల్లు, గ్రామం

ఆనందంగా ఉండాలి

- అందుకోసమే స్వర్ణాంధ్ర విజన్-2047
- సంక్రాంతికి సొంతూళ్లకు రావడం మంచి సంప్రదాయం
- అన్ని వర్గాల అభివృద్ధికి సూపర్ సిక్స్: బాబు



తన తల్లిదండ్రుల సమాధి వద్ద చంద్రబాబు నివాళులు

తిరుపతి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ జరుపుకోవడానికి ప్రజలు తమ సొంత గ్రామాలకు వస్తున్నారని, ఇదొక మంచి సంప్రదాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ప్రతి ఇల్లు, ప్రతి గ్రామం ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047ని రూపొందించామని తెలిపారు. పండుగ జరుపుకోవడానికి కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులతో కలసి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని తన స్వగ్రామం నారావారిపల్లెకు ఈ నెల 12న వచ్చిన ఆయన సోమ, మంగళవారాలు అక్కడ గడిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. శంకుస్థాపనలు కూడా చేశారు. మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. సమైక్యాంధ్ర సీఎంగా ఉన్నప్పుడు తానిచ్చిన విజన్-2020 కారణంగానే తెలంగాణ ఇప్పుడు దేశంలోనే అధిక తలసరి ఆదాయం పొందుతోందని గుర్తు చేశారు. ప్రపంచం మొత్తమ్మీద తెలుగువారు ఎక్కువ తలసరి ఆదాయం సంపాదిస్తున్నారని, అదే సమయంలో ప్రపంచంలో గొప్ప పెట్టుబడిదారులుగానూ ఎదుగుతున్నారని చెప్పారు. సంపన్న, ఆరోగ్య, ఆనంద సమాజం కోసం విజన్-2047 తెచ్చామని.. ఆ దిశగా తమ ప్రభుత్వం కష్టపడి పనిచేస్తోందని వివరించారు. 'అన్ని వర్గాలను అభివృద్ధి పరిచేందుకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నాం. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో సామాజిక పెన్షన్లను రూ.4వేలు, రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేలకు పెంచి ఇస్తున్నాం. రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్ల కోసం ఏటా రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఐవీఆర్‌ఎస్ టెక్నాలజీ ఉపయోగించి ఫీడ్‌బ్యాక్ పరిశీలిస్తే దేశం మొత్తమ్మీద ఏపీలోనే సంతృప్తికరంగా పెన్షన్ విధానం అమలవుతోంది. 199 అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5కే భోజనం అందిస్తున్నాం. భవిష్యత్‌లో ప్రతి నియోజకవర్గంలో ఒక క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.996 కోట్ల బకాయిలు చెల్లించాం. ఉద్యోగులు, పోలీసులు, చిన్న కాంట్రాక్టర్లకు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న రూ.6,700 కోట్లను పండుగ కానుకగా విడుదల చేశాం. సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధితులకు రూ.125 కోట్లు ఇచ్చాం. ధాన్యం కొనుగోలు పెండింగు బకాయిలు రూ.1,600 కోట్లు విడుదల చేయడంతో పాటు తాజాగా కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో రూ.6,655 కోట్లు చెల్లించాం. అన్ని వ్యవస్థలనూ గాడిలో పెడుతున్నాం. అందరికీ న్యాయం చేస్తాం' అని స్పష్టం చేశారు. జీవితంలో అభివృద్ధి చెందినవారు, తమ తోటి వారికి సహకారమందించాలని మరోసారి పిలుపిచ్చారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని రాత్రి 7 గంటలకు విజయవాడ బయల్దేరి వెళ్లారు.

గ్రామదేవతలకు పూజలు.. అమ్మానాన్నకు నివాళులు

సొంతూరులో మంగళవారం చంద్రబాబు సంక్రాంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పంచెకట్టు కట్టి.. సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, రామ్మూర్తినాయుడి కుటుంబసభ్యులు, నందమూరి రామకృష్ణ, బాలకృష్ణ కుటుంబసభ్యులు తదితరులతో కలిసి గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు పూజలు నిర్వహించారు. కుల దైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11.25 గంటలకు చంద్రబాబు తన తల్లితండ్రులు ఖర్జూరపునాయుడు, అమ్మణమ్మ సమాధులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలను ఆవిష్కరించారు. తర్వాత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సాయంత్రం 4 గంటలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో నారావారిపల్లె క్లస్టర్ గ్రామస్తులతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

స్కిల్ కేసులో బాబుకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. ఇప్పటికే చార్జిషీటు దాఖలైన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చంద్రబాబుకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సమర్థించిన ధర్మాసనం.. దానిని రద్దు చేసేందుకు నిరాకరించింది. అవసరమైన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సూచించింది. ఇంకోవైపు.. ఆయనకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని స్వర్ణాంధ్ర పత్రిక విలేకరి బాలగంగాధర తిలక్ దాఖలు చేసిన ఇంటర్‌లొక్యూటరీ దరఖాస్తును కూడా సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. అసలీ కేసులో మీరెవరు.. మీకేం సంబంధమని జస్టిస్ బేలా త్రివేది ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ దరఖాస్తు వేసేందుకు మీకున్న అర్హత ఏమిటి? బెయిల్ వ్యవహారాల్లో మూడో పక్షం ప్రమేయం ఎందుకు? సంబంధంలేని బెయిల్ వ్యవహారాల్లో ఎలా దరఖాస్తు వేస్తారు? ఇంకోసారి ఇలా జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయి' అని తిలక్‌ను హెచ్చరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును 2023 సెప్టెంబరు 9వ తేదీ అర్ధరాత్రి నంద్యాలలో సీఐడీ పోలీసులు అరెస్టుచేశారు. మర్నాడు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఆ ఏడాది అక్టోబరు 31న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆయనకు తొలుత మధ్యంతర బెయిల్ ఇచ్చింది. అదే ఏడాది నవంబరు 20న పూర్తిస్థాయి రెగ్యులర్ బెయిల్ కూడా మంజూరు చేసింది. అయితే ఆ బెయిల్ రద్దు చేయాలంటూ ఆ మర్నాడే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

వైసీపీకి చుక్కెదురు

- చంద్రబాబు బెయిల్ రద్దుకు విఫలయత్నం
- రూ.కోట్ల ఖర్చుతో సీనియర్ లాయర్లను పెట్టినా దక్కని ఫలితం: టీడీపీ

అమరావతి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయించేందుకు ప్రయత్నించిన వైసీపీకి సుప్రీంకోర్టులో భంగపాటు తప్పలేదు. నాటి ప్రభుత్వం వేసిన ఆ పిటిషన్ వెనుక వైసీపీ నాయకత్వం ఉందని.. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సీనియర్ న్యాయవాదులను మోహరించినా ఆ పార్టీకి ఫలితం దక్కలేదని టీడీపీ వర్గాలు వ్యాఖ్యానించాయి. తమ ప్రయత్నం ఫలించి చంద్రబాబు బెయిల్ రద్దవుతుందని వైసీపీ నాయకత్వం బలంగా విశ్వసించిందని, అందుకే రెండు నెలల్లో కూటమి ప్రభుత్వం కూలిపోతుందని మాజీ సీఎం జగన్ పదేపదే చెబుతూ వచ్చారని పేర్కొన్నాయి. జగన్ ప్రభుత్వం స్కిల్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసి 52 రోజులు జైల్లో ఉంచిన సంగతి తెలిసిందే. హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో 2023 అక్టోబరు 31న ఆయన విడుదలయ్యారు. 'మా అధినేతపై అక్రమ కేసు పెట్టడమే కాకుండా ఇప్పుడు బెయిలు రద్దుకు కూడా వైసీపీ నేతలు తెగించారు. కానీ వారి కుట్రలు సుప్రీంకోర్టు ముందు పారలేదు. ఈ కేసులో చార్జిషీటు కూడా దాఖలైంది. సాంకేతిక కారణాలతో కోర్టు దానిని తిప్పిపంపింది. చంద్రబాబుకు బెయిల్ వచ్చి ఏడాదిన్నర దాటింది. ఇప్పుడు బెయిల్ రద్దుపై వాదనలు వినడానికి కూడా కోర్టు ఇష్టపడలేదు. సంబంధం లేని వ్యక్తులు ఆయన బెయిల్ రద్దుచేయాలంటూ దరఖాస్తు చేయడాన్ని కూడా తప్పుబట్టింది. ఇతరులు ఇందులో తలదూర్చడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఇది వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన విషయం. ఈ కేసుతో మీకేం సంబంధమని ప్రశ్నించింది. తన దిక్కుమాలిన ప్రయత్నాలతో వైసీపీ కోర్టు ముందు నవ్వులపాలైంది' అని టీడీపీ సీనియర్ నేత ఒకరు అన్నారు.

పిన్నెల్లి సోదరులను వదిలే ప్రసక్తే లేదు!

- రామకృష్ణారెడ్డిని ఏ1గా చేర్చాలని పల్నాడు ఎస్పీకి బుద్దా వెంకన్న విజ్ఞప్తి



నరసరావుపేట లీగల్, విజయవాడ(వన్‌టౌన్), జనవరి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులైన పిన్నెల్లి సోదరులను వదిలే ప్రసక్తే లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న చెప్పారు. మునిసిపల్ ఎన్నికల సమయంలో తమపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి మంగళవారం ఆయన నరసరావుపేటలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. పిన్నెల్లి సోదరులు వేలం పాట పెట్టి.. వచ్చిన వారిని ఎవరు చంపుతారో వారికి లైఫ్ సెటిల్‌మెంట్ అని పిలుపునిచ్చారన్నారు. దీంతో తనను, బొండా ఉమామహేశ్వరరావును చంపేందుకు తురకా కిషోర్ అనే వ్యక్తి ముందుకు వచ్చాడన్నారు. కిషోర్ వెదురు బొంగుతో తమపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించాడని తెలిపారు. ఆ దాడి చేయించింది పిన్నెల్లి సోదరులని, ఈ కేసులో మొదటి నిందితుడిగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని చేర్చాలని ఎస్పీని కోరారు. పిన్నెల్లిపై హైకోర్టులో ప్రైవేటు కేసు కూడా వేయబోతున్నానని తెలిపారు. ముందస్తు బెయిల్‌ను కూడా రద్దు చేసే విధంగా పోరాడతానన్నారు. మాచర్లకు ఒక్కడినే వెళ్లి డీఎస్పీని కలవబోతున్నానని, దమ్ముంటే ఇప్పుడు తనపై దాడి చేయాలని పిన్నెల్లి సోదరులకు సవాల్ విసిరారు.

20న జూరిచ్‌లో తెలుగువారితో బాబు భేటీ

అమరావతి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్విట్జర్లాండ్‌లోని జూరిచ్‌లో ఈనెల 20న తెలుగు డయాస్పొరా మీట్ జరుగుతుందని స్థానిక భారత రాయబార కార్యాలయం బుధవారం తెలిపింది. సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ పాల్గొంటారని తెలిపింది. సీఎం చంద్రబాబు అక్కడి వారితో ఏపీ ప్రభుత్వ దార్శనికతను పంచుకొంటారని వివరించింది.

కువైట్‌లో చిక్కుకున్న తిరుపతి మహిళ

- మంత్రి లోకేశ్ సాయంతో స్వస్థలం చేరిక

అమరావతి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఏజెంట్ చేతిలో మోసపోయి, కువైట్‌లో చిక్కుకున్న మహిళ స్వస్థలం చేరుకోవటానికి మంత్రి నారా లోకేశ్ సాయం చేశారు. తిరుపతి మండలం కుంట్రపాకం గ్రామానికి చెందిన వరగంటి సుగుణ జీవనోపాధి కోసం కువైట్ వెళ్లారు. ఆమె సోషల్ మీడియాలో లోకేశ్‌కు విజ్ఞప్తి చేస్తూ ఓ వీడియో పెట్టారు. 'తినడానికి తిండి లేదు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా. ఏజెంట్ మోసం చేశాడు. నన్ను ఎలాగైనా రక్షించి, స్వస్థలానికి చేర్చండి' అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. లోకేశ్ టీమ్ ఆమెను క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చి, కుటుంబ సభ్యుల వద్దకు చేర్చింది. తనకు అండగా నిలిచిన లోకేశ్‌కు ఆమె, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లండన్ వెళ్లిన జగన్ దంపతులు

అమరావతి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి దంపతులు లండన్ పర్యటనకు బుధవారం బయలుదేరి వెళ్లారు. జగన్ రెండో కుమార్తె వర్షారెడ్డి పట్టా ప్రదానోత్సవానికిహాజరవుతారు. వర్షారెడ్డి లండన్‌లోని కింగ్స్ కాలేజీలో ఎంఎస్, ఫైనాన్స్ పూర్తి చేశారు. ఈ నెలాఖరుకు జగన్ దంపతులు తాడేపల్లికి తిరిగి వస్తారు.

ఎయిమ్స్ సభ్యులుగా ఎంపీలు కేశినేని, బాలశౌరి

అమరావతి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ మంగళగిరి సంస్థ కమిటీ సభ్యులుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ ఎ.మిశ్రా బుండేలా నోటిఫికేషన్ జారీ చేశారు. వారితో పాటు మొత్తం ఆరుగురు కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారు.

పనిచేసిన వారికే పదవులు

- నెలాఖరుకు నామినేటెడ్ పోస్టుల భర్తీ
- రెడ్ బుక్ తన పని చేసుకుపోతుంది
- ఇసుక, లిక్కర్ కుంభకోణాల్లో త్వరలో కొందరు జైలుకు: లోకేశ్



చంద్రగిరి నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

తిరుపతి (విద్య)/ చంద్రగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టులన్నీ ఈ నెలాఖరుకు భర్తీచేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలను కూడా త్వరలో నియమిస్తామన్నారు. సీనియర్లు, జూనియర్లను సమానంగా ప్రోత్సహిస్తామని చెప్పారు. గతంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొన్న కేడర్‌కు గుర్తింపునిస్తామన్నారు. తిరుపతి జిల్లా నారావారిపల్లెలో బుధవారం ఆయన చంద్రగిరి నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పనితీరు ఆధారంగా పదవులు ఇస్తామని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండి పనిచేయాలని సూచించారు. వచ్చే నెల నుంచి పార్టీకోసం అధిక సమయం కేటాయిస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలతో వాట్సాప్ ద్వారా టచ్‌లో ఉంటూ క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటానని, నాయకుల పనితీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటానని చెప్పారు. పొలిట్ బ్యూరోలో ప్రతి రెండేళ్లకూ 30 శాతం కొత్తవారు రావాలని, అప్పుడే పార్టీ ఉత్తేజంగా నడుస్తుందని చెప్పారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమికి 164 సీట్లు ఇచ్చారని, మనం ఒళ్లు దగ్గరపెట్టుకొని పనిచేయాలని అన్నారు. అహంకారంగా మాట్లాడకూడదని దిశానిర్దేశం చేశారు. 'రెడ్ బుక్‌ను నేను మర్చిపోలేదు. అది తనపని తాను చేసుకుపోతుంది. యువగళంలో పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టారో నాకు తెలుసు. తప్పు చేసినవారిని ఎవరినీ వదలే ప్రసక్తే లేదు. ఇసుక, లిక్కర్ కుంభకోణాల్లో చాలా మంది త్వరలో జైలుకు వెళతారు' అని లోకేశ్ స్పష్టం చేశారు. అనవసరంగా కేసులు పెట్టడం మన విధానం కాదన్నారు. 'ఫిబ్రవరి నుంచి స్వర్ణాంధ్ర పేరుతో చేపట్టే కార్యక్రమంలో శ్రేణులు భాగస్వాములు కావాలి. మనం చేసింది చెప్పుకోవాలి. ప్రాధాన్య క్రమంలో బాబు సూపర్ 6 హామీలు నెరవేర్చి తీరుతాం. మెగా డీఎస్సీకి త్వరలో నోటిఫికేషన్ ఇస్తాం. జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తాం' అని వివరించారు.

కూటమిలో మనది పెద్దన్న పాత్ర

'కూటమి ప్రభుత్వంలో మనది పెద్దన్న పాత్ర. మిత్రధర్మంతో పనిచేస్తున్నాం. కొంతమంది ఆవేశంతో మాట్లాడినా ఓర్పుగా ఉండాలి. 1985 తర్వాత గెలవని మంగళగిరిలో భారీ మెజారిటీతో గెలిచాం. నన్ను, చంద్రబాబును ఓడించడానికి వైసీపీ వారు మంగళగిరి, కుప్పంలో ఓటుకు రూ.4వేల చొప్పున రూ.150 కోట్లు ఖర్చుపెట్టారు' అని లోకేశ్ అన్నారు. అన్నీ గమనించిన ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపించారన్నారు.

మోహన్‌బాబు వర్సిటీ వద్ద ఉద్రిక్తత

- క్యాంపస్‌లోకి వెళ్లేందుకు మనోజ్ దంపతుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది



ఎంబీ యూనివర్సిటీ వద్ద గేటు వేసేసి మంచు మనోజ్‌ను అడ్డుకున్న పోలీసులు, సిబ్బంది

తిరుపతి(వైద్యం)/చంద్రగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. వర్సిటీ క్యాంపస్‌లోకి వెళ్లేందుకు మంచు మనోజ్, ఆయన సతీమణి భూమా మౌనిక యత్నించగా పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. చివరికి క్యాంపస్ పక్కన ఫామ్‌హౌస్‌లోని తన నానమ్మ, తాత సమాధులకు మొక్కుకుని మనోజ్ వెనుదిరిగారు. మండలంలోని ఎ.రంగంపేటలో సినీనటుడు మోహన్‌బాబుకు చెందిన పలు విద్యాసంస్థలు ఉన్నాయి. కొంతకాలంగా ఆయన కుటుంబంలో వివాదం తలెత్తి చిన్న కుమారుడు మనోజ్‌తో ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. తన విద్యాసంస్థల్లోకి మనోజ్ ప్రవేశించకుండా అడ్డుకోవాలని మోహన్‌బాబు కోర్టును ఆశ్రయించి అనుకూల ఉత్తర్వులు పొందారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం మనోజ్, ఆయన సతీమణి మౌనిక హైదరాబాద్ నుంచి తిరుపతి చేరుకున్నారు. తొలుత నారావారిపల్లె వెళ్లి, మంత్రి లోకేశ్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత రంగంపేట వచ్చి జల్లికట్టు వీక్షించారు. అనంతరం మోహన్‌బాబు స్కూల్ క్యాంపస్ ప్రధాన గేటు వద్దకు చేరుకున్నారు. పలు వాహనాల్లో 50-60 మంది అనుచరులు వారిని అనుసరించారు. అంతకుముందే అక్కడకు భారీగా చేరుకున్న పోలీసులు, క్యాంపస్ సెక్యూరిటీ సిబ్బంది గేటు వద్ద మోహరించి, మనోజ్‌ను అడ్డుకున్నారు. ఆయన వారితో వాగ్వాదానికి దిగారు. తనకు కోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులూ అందలేదని చెప్పడంతో పోలీసులు జిరాక్స్ ప్రతిని అందజేశారు. కోర్టు ఆదేశాలను గౌరవించాలని వారు నచ్చజెప్పడంతో అంగీకరించిన మనోజ్ గేటు వద్ద బౌన్సర్లను ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. 'ఎంతమంది బౌన్సర్లను పంపుతారో పంపండి... నేను ఒక్కడిని చాలు వారికి సమాధానం చెప్పడానికి' అంటూ సవాల్ విసిరారు. ఆ తర్వాత అక్కడ నుంచి బయల్దేరి పక్కనే ఉన్న కాలేజీ క్యాంపస్ ప్రధాన గేటు వద్దకు వెళుతుండగా విష్ణు అనుచరులుగా భావిస్తున్న యువకుల బృందంలో ఒకరు కర్రతో మనోజ్ వాహనంపై బాదారు. పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా వారు పారిపోయారు. ఆ గేటు వద్ద కూడా పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది మనోజ్‌ను నిలువరించారు. కాగా, కోర్టు ధిక్కరణకు పాల్పడిన మనోజ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసి, కోర్టుకు అప్పీలుకు వెళ్లనున్నట్లు ఎంబీయూ మీడియా ఇన్‌చార్జ్ రవిచంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

హైకోర్టుకు మరో ఇద్దరు

న్యాయమూర్తులు

- హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు పేర్లు సిఫారసు చేసిన సుప్రీం కొలీజియం

అమరావతి/న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా న్యాయాధికారులు అవధానం హరిహరనాథశర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావును నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ఈ నెల 11న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 28 మంది ఉన్నారు. ప్రస్తుతం కొలీజియం సిఫారసు చేసిన ఇద్దరూ వస్తే ఆ సంఖ్య 30కి చేరుతుంది. ఇంకో ఏడు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా.. తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్ పాల్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ఈ నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఆ రాష్ట్రంలో సీనియర్ న్యాయాధికారులు రేణుక యార, నందికొండ నర్సింగ్‌రావు, ఈ తిరుమలదేవి, బీఆర్ మధుసూదన్ రావులను అక్కడి హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. వీరి నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం లభించగానే పదవీప్రమాణం చేస్తారు.

న్యాయవాదిగా.. జిల్లా జడ్జిగా..

హరిహరనాథ శర్మ 1968 ఏప్రిల్ 16న జన్మించారు. ఆయన స్వస్థలం కర్నూలు. తల్లిదండ్రులు రామచంద్రయ్య, సుబ్బమ్మ. తండ్రి పురోహితుడు. కర్నూలు ఉస్మానియా కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసిన హరిహరనాథశర్మ నెల్లూరు వీఆర్ లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1994లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. కర్నూలు జిల్లా కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది రామకృష్ణారావు వద్ద వృత్తి మెలకువలు నేర్చుకున్నారు. 1998లో సొంత ప్రాక్టీసు మొదలుపెట్టారు. 2007 అక్టోబరులో జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో సేవలు అందించారు. 2017-18 నడుమ అనంతపురం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి(పీడీజే)గా, 2020-22లో విశాఖ పీడీజేగా పనిచేశారు. 2022లో హైకోర్టు రిజిస్ట్రార్‌గా పనిచేశారు. 2023 నుంచి ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

ఏయూ నుంచి పీహెచ్‌డీ..

డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు 1975 ఆగస్టు 3న జన్మించారు. ఆయన స్వగ్రామం ప్రకాశం జిల్లా కనిగిరి. తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, పద్మావతి. ప్రాథమిక విద్యను ప్రకాశం జిల్లాలో పూర్తి చేసిన ఆయన.. నెల్లూరు వీఆర్ లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. క్రిమినల్ లా, కంపెనీ లాలో బంగారు పతకాలు పొందారు. 2000లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి ప్రకాశంజిల్లాతో పాటు నెల్లూరు, కావలిలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 2014లో జ్యుడీషియల్ సర్వీసులోకి వచ్చారు. మొదట ఏలూరు జిల్లా అదనపు జిల్లా జడ్జిగా పోస్టింగ్ తీసుకున్నారు. తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో సేవలు అందించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పీడీజేగా పనిచేస్తూ 2021 సెప్టెంబరు 2న హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా నియమితులయ్యారు. 2022 అక్టోబరు 22న రిజిస్ట్రార్ జనరల్‌గా నియమితులయ్యారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.